అభ్యుదయ

సంచిక ౨

యితలు :

పిళ్ల
ంకటశాస్త్రి

★

ండ్యాల
బ్రహ్మణ్యశాస్త్రి

★

డవటిగంటి
టుంబరావు

★

యుల సోమయాజుల
సింహశర్మ

ఎ. ఎస్.
రాయణరావు

★

. గోఖలే

★

శెట్టి

★

యాగ

★

య్య



అభ్యుదయ

సచిత్ర సాహిత్య మాసపత్రిక

★

సంపుటి ౧ సంచిక ౨

నవంబరు, 1946

★

సంపాదకులు :

చదలవాడ పిచ్చయ్య

కొడవటిగంటి కుటుంబరావు జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి

ప్రయాగ కోదండరామశాస్త్రి తుమ్మల వెంకట రామయ్య

విషయ సూచిక

ముఖచిత్రం :

శతావధాని, శ్రీ చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిగారు

ఉండిపోయినారా-అని ఈ బడిపిల్లలకు లేనిపోని బెంగ. మేనత్తగారింటికి రోజూ మజ్జిగతెచ్చే శాస్త్రిగారిని ఎలాగో పట్టుకొని అమావాస్యకూ, పూర్ణమికీ బళ్ళోకి పట్టుకొచ్చేవాళ్ళు ఆ యమకింకరులు.

ప్రయత్నమే ఉండాలిగాని ఫలితానికేమిటి ? ఏమైనా శాస్త్రిగారు బళ్ళో నిలిచేవారు కారు. ఆ వచ్చిన పిల్లలు లోకువగావుంటే వాళ్ళను బెదిరించీ, లేక పోతే మేనత్తగారి ఆసరా తీసుకునీ తప్పించుకునేవారు.

ఇంతచేసినా, ఈ స్వేచ్ఛ ఒక ఏడాదిపాటే దక్కింది. తర్వాత మళ్ళీ బళ్ళోకి వెళ్ళవలసేవచ్చింది. బడికిపోగానే పంతులుగారు గుంట 'ఓ న మా' లు వ్రాసిపెట్టారు. శాస్త్రిగారు వేలుపెట్టి దిద్దుతున్నారు. ఇంకా వేలు అరగలేదు; కందనైనాలేదు - సాయంత్రానికే ఐదుబళ్ళూ వచ్చేశాయి.

ఆ రోజుల్లో బోర్డు బడులు కొత్తగా పెట్టారు. తగినంతమంది పిల్లలువస్తేనే ఆ బడులు నిలుస్తాయి. బడులు నిలిస్తేనే పంతుళ్ళకు ఉద్యోగాలు నిలుస్తాయి. కనుక ఆ రోజుల్లో బోర్డు పంతుళ్ళు, ఇప్పటి వీధిబడి పంతుళ్ళలాగా, పిల్లలకోసం ఇల్లిల్లూ తిరిగేవారు. కొత్త కొత్త పద్ధతులతో విద్యాభ్యాసం చేసేవారు. 'క కకు దీర్ఘమిస్తే కా; క కు గుడిస్తే కి -' అనే వీధిబళ్ళ పద్ధతిని మార్చి, బోర్డుబడులలో 'క కార అకారములు క. క కార ఇకారములు కి' - అనే వర్ణక్రమాన్ని ప్రవేశపెట్టారు.

శాస్త్రిగారు బడికిపోవడం మొదలుపెట్టిన మూడోనాడే, బోర్డు బడిపంతులుగారి ప్రోద్బలంవల్ల వీధిబడినుంచి బోర్డుబడికి మారవలసివచ్చింది. మొదటిరోజునే అక్కడ శాస్త్రిగారికి పేర్లు చెప్పారు; వర్ణక్రమం కూడా చెప్పారు. పంతులుగారు చెప్పవి ఇంకా ఆయన పెదవులు దాటనేలేదు - ఎంత కఠిన పదానికయినా వర్ణక్రమం చెప్పడం మొదలెట్టారు శాస్త్రిగారు. ఆ పదాలకే వర్ణక్రమం చెప్పలేక, పై తరగతి పిల్లలు శాస్త్రిగారికి ప్రదక్షిణ నమస్కారాలు చెయ్యడంకూడా అప్పుడే మొదలెట్టారు. (ఇది వాళ్ళు సిగ్గుతెచ్చుకునేందుకు గురువుగారు విధించిన శిక్ష)

పదిహేను రోజుల్లో శాస్త్రిగారు మూడవ తరగతిలోకి వచ్చారు. కాని గణిత శాస్త్రంలో మట్టుకు మీనమేషాలే ! గురువుగారికి సాయంత్రం గణిత పారమయితే, శిష్యుడికి మాత్రం సాయంత్రమే ఆటవిడుపు !

దప్త్రం పెద్దది కావాలని, పలక పొడుగుకు మించిన తాళపత్ర గ్రంథాలను తెగకోసి దప్త్రంలో బిగించుకోవడమూ;— మార్కులకోసం పై క్లాసు పిల్లలకు పొగాకు లంచం సమర్పించుకోవడమూ;— దొడ్లో మొక్కజొన్నచేలో చాటున కూర్చొని, స్నేహితులతో ఏకాంతంలో చుట్ట కాల్చడమూ;— ఏమయితేనేం, శాస్త్రిగారికి మందిబలమూ, మార్కుల బలమూ ఏర్పడ్డాయి, ఎనిమిదోఏటనే.

ఇంతలో తండ్రిగారికున్న భూమికాస్తా అప్పులపాలైపోయింది. ఆ పేద రైతుకు వ్యవసాయం చేసుకునే ఆస్కారం కాస్తాపోయింది. మరేదన్నా వృత్తి

చూసుకోవాలి, కుటుంబాన్ని పోషించుకోవాలి. కాని, పూవు లమ్ముకున్న వూళ్ళో కట్టె లమ్ముకోవడ మంటే సాధ్యమా ?

ఫ్రెంచి టవున్ యానాం చేరి, భిక్షాటనం చేస్తూ కుటుంబాన్ని పోషించు కోవాలనుకున్నాడు తండ్రి. తల్లిదండ్రులతోపాటు శాస్త్రిగారుకూడా, తన ప్రాత మిత్రుల్ని వదలి, యానాం వెళ్ళవలసి వచ్చింది

అక్కడా బడివుంది - పిల్లలున్నారు - అప్పుడప్పుడు చుట్ట కాల్చుకోవచ్చు; కాని ఫ్రెంచి రిపబ్లిక్ ఒక శాసనంచేసింది దాని ప్రకారం హరిజనబాలురతోసహా అందరూ ఒకే బెంచీమీద కూర్చొని చదువుకోవాలి. దీంతో శాస్త్రిగారికి అక్కడి చదువు సరి.

అయితే, యానాంకు సమీపంలోనే ఇంగ్లీషువారి 'ధర్మ' రాజ్యంలో నీల పల్లి అనేగ్రామంలో ఒక బడివుంది. శాస్త్రిగారు ఈ బడిలో చదువు ఆరంభించారు. కాని యానాంకూ నీలపల్లికీ మధ్య ఉప్పువాగొకటి వుంది. ఆ వాగును దాటడానికి మాలమాదిగలెక్కిన పడవలో ఇతర వర్ణాలవారెక్కగూడదు. మళ్ళీ ఆ పడవ తిరిగివచ్చేదాగా ఆగవలసిందే అందువల్ల బడికి ఆలస్యంగా వెళ్ళినా ఆక్షేపణలేదు. ఎంత ఆలస్యమయితే మాత్రమేమి ? ఆ రోజుల్లో కానీకి పదహారు చుట్టలు - కావలసినంతమంది స్నేహితులు -

శ్రీ శాస్త్రిగారు నీలపల్లి స్కూల్లో ప్రైమరీ పరీక్ష ప్యాసై, ఇంగ్లీషు చదువు కుందామని ప్రయత్నించారు. కాని పెద్దల ప్రోత్సాహంవల్ల కాపవరంలో సంస్కృత విద్యాభ్యాసం చేశారు.

కాపవరం యానాంకు రెండు మైళ్ళు. త్రోవలో ఒక కాలువ వుండేది. పుస్తకాలు నెత్తికి కట్టుకొని రోజూ ఈదుకుంటూ వెళ్ళాలి. త్రోవంతా రెండు మైళ్ళూ నడచిపోవాలి. అంతేకాదు; యానాంలో అయితే, కుస్తీలు పట్టేవాళ్ళూ, కోతికొమ్మచ్చు లాడేవాళ్ళూ, చుట్టలు కాల్చేవాళ్ళూ - అనేకమంది స్నేహితులు! ఇలాంటివాళ్ళు ఇవాళ కాపవరంలో కొత్తగా ఎక్కడినుంచి వస్తారు ? పాపం, స్నేహితులు శాస్త్రిగారితో చాలాదూరంవచ్చి "వెళ్ళి త్వరగా పాఠం చెప్పించుకు ర"మ్మని ఆజ్ఞాపించి పంపేవాళ్లు! ఈ విధంగా రెండేళ్ళపాటు చదువుకుని శాస్త్రి గారు రఘువంశంలో మూడు సర్గలు పూర్తిచేశారు.

ఇంతలో కొండలపెట్టున జ్వరం ... 14 లంకణాలు . మళ్ళీ కోలుకోడా నికి ఐదారు నెలలు....

మళ్ళీ కాపవరంలో కుమారసంభవం ప్రారంభించారు కాని ఈ సారి గురువుగారు ఆ గ్రామం నుంచి వెళ్ళిపోవడం వల్ల చదువు ఆగిపోయింది.

ఆ తర్వాత - రాజమండ్రి సమీపంలో వున్న కాకవరం అనే గ్రామానికి పెళ్ళికి వెళ్ళడం; అక్కడ శ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు చూచి చదువు చెబుతాను రమ్మనడం; కాని అక్కడ ఆగకుండా పెళ్ళివారితో పాటు యానాం

వచ్చి పెళ్ళివారి బంధువులతో వచ్చిన అల్లంరాజు సుబ్రహ్మణ్య కవిగారి దగ్గర చదువుకోడానికి ఆయనతో బయలుదేరిపోవడం; ఆయన తీరా కాకినాడ దాకా తీసుకెళ్ళి 'మా వూళ్ళో వారాలు కుదర'వని చెప్పి, 'నీవు చాలా అదృష్టవంతుడ వవుతా'వని దీవించి తన త్రోవన తాను పోవడం; కాకినాడలో నయినా వారాలు దొరుకుతాయేమో నని ప్రయత్నించి విసిగి వేసారి, కాకవరం సంగతి దృష్టికిరావడం-అన్నీ నిమిత్తమాత్రంగా జరిగిపోయాయి.

మళ్ళీశాస్త్రిగారు కాకవరంవచ్చి, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి గారివద్ద కుమార సంభవం చదివారు. మేఘసందేశం ప్రారంభించేసరికి. అనేకవిఘ్నాలు వచ్చాయి.

తిరిగి ఇంటికి (యానాం) వస్తూ రాజమండ్రిలో చదరంగపు సామానూ, కవి రాజమనోరంజనం (కావ్యం) ఒకటీ, సులక్షణసారం ఒకటీ కొనుక్కొని శాస్త్రిగారు ఇల్లు చేరారు.

ఆయన తన 11 వ ఏటనే, అంటే, రఘువంశం చదువుకొనే రోజుల్లోనే ధారాళంగా పదకవిత్వం చెప్పేవారు. ఇప్పుడు 15 వ యేట 'సులక్షణ సారం' సహాయంతో పద్యకవిత్వం ప్రారంభించారు "శ్రీ మదఖండ వైభవముచే" అనే పద్యమూ, "శ్రీరామా మణి వక్షమందు దనరన్" అనే పద్యమూ వీరి తొలి పద్యాలు. (కలగూరగంప చూ)

కాని, శాస్త్రిగారికి చదరంగంమీద మనసు. చదరంగం బాగా ఆడగల వాళ్ళందరితోనూ ఆడి గెలుపొందాలనే కోరిక, దీనితో ఆయన కాలమంతా గడచి పోయింది. చదరంగంలో పెద్ద పందెగా డయినాడు.

ఇక రెండో ప్రక్కన - గాజులూరులో మేఘసందేశం పాఠం. ఒకరుకాదు- నలుగురు గురువులు ఇవాళ ఒకరిదగ్గర చెప్పించుకున్న శ్లోకమే, మరునాడు మరొ కరివద్ద. మూడునెలలు గడచినా మొదలు పెట్టిన పుస్తకం పూర్తికాలేదు. కాని కవిత్వ ధోరణిమాత్రం పెంపొందుతూ వచ్చింది. "కవితా ధోరణి గల మనకు విద్య యిక నేటికి?" అనుకున్నారు శాస్త్రిగారు. యానాంలోని వేంకటేశ్వరస్వామి మీద ఒక శతకం చెప్పబూనారు.

ఈ రోజుల్లో శాస్త్రిగారి కొక మిత్రుడుండేవాడు. శాస్త్రిగారు ఇవాళ పది పద్యాలు వ్రాశానంటే అతను పదిహేను పద్యాలు వ్రాశాననేవాడు తీరాచూస్తే అవి 'జానకీపతి' శతకంలోవి! చివరమాత్రం జానకీపతికి బదులు వేంకటేశ్వరుడు వచ్చేవాడు! ఇదేమిటిరా అంటే, నువ్వు కనుక్కుంటావో లేదో అని జవాబు!

ఒకనాడు కొంతమంది పెద్దలకు శాస్త్రిగారు తన పద్యాలు వినిపించారు. అందులో ఒక సంస్కృత సమాసంలోని సంధినిగురించి వారు తప్పుపట్టారు. అది ఒప్పే అని తనకు తెలిసినప్పటికీ, తెలుగు వ్యాకరణం మాత్రమే తెలిసిన శాస్త్రి గారు తన వాదాన్ని సమర్థించుకో లేకపోయారు.

ఆయనలో ఆవేదన బయలుదేరింది. సంస్కృత వ్యాకరణాన్ని సాధిం చాలి. అన్ని విద్యల్లోను ఆరితేరివుండాలి. కత్తికిలాగా కలానికి పదునుకావాలి

ఇంతలో తన మిత్రుడు 'వ్యాకరణం చదువుకోడానికి కాశీకి వెళదామా ?' అన్నాడు శాస్త్రిగారికి డబ్బెక్కడిది ? కావలసివస్తే త్రోవలో సంపాదించుకో లేమా ? అని మిత్రుని ప్రోద్బలం ! మంచిదే.

అప్పుడు శాస్త్రిగారికి కంటిజబ్బువుండేది నయంచేయించుకో బోతున్నానని ఇంట్లో చెప్పి, మూటముల్లె తీసుకొని అతనితోపాటు శాస్త్రిగారు కాశీకి ప్రయాణం కట్టారు. కాని, విశాఖపట్టణం వెళ్ళేసరికే, తేలిపోయింది - ఆమిత్రుడు నీరస పడ్డాడు. తిరిగి రాకతప్పిందికాదు

పిఠాపురంలో వ్యాకరణం చెప్పేవారు లేరు. సామర్లకోటలో ప్రతివాది భయంకర రాఘవాచార్యులుగారున్నారు. కాని వారాలు కుదరవు. ఏమైనా చదువు కొనితీరాలి మాధుకరమెత్తి చదువుకున్నారు శాస్త్రిగారు.

కంటిజబ్బు ఎక్కువై యింటికి రావలసివచ్చింది. చుట్టుపట్లగ్రామాల్లోవున్న పండితులవద్ద కావ్య, వ్యాకరణ పాఠాలు చెప్పుకుంటూ, కంటిజబ్బుకు ఔషధసేవ చేస్తూవచ్చారు. కాని జబ్బుమరీ ఎక్కువవుతూ వచ్చింది

"ఈకన్ను ఎల్లాగూ నయమయ్యేటట్లులేదు. పోతేపోయింది. ఒక్కకన్నైనా వుంటుంది. విజ్ఞానం లేనివాడికి రెండు కళ్ళూ లేనట్లేగదా" అనుకొని, చదువు సాగించితీరాలని శాస్త్రిగారు నిశ్చయించుకున్నారు

అప్పుడు కాశీపండితులు శ్రీ చర్ల బ్రహ్మయ్యశాస్త్రిగారు కడియెద్ద గ్రామములో విద్యార్థులకు చదువుచెబుతూ వుండేవారు చదువు చెప్పడమేకాదు విద్యార్థులకు అన్నపానాలకుకూడా వసతి ఏర్పరచేవారు. శ్రీ వేంకట శాస్త్రిగారికి వారివద్ద చదువుకోవాలని కుతూహలం కలిగింది జబ్బుచేసిన కంటికి గుడ్డ అడ్డంకట్టి ఒక్క కంటితోనే చూస్తూ, బయలుదేరారు. కాని, త్రోవలో తెలిసింది - పాలకొల్లుదగ్గిర చింతపర్రులో మంచి నేత్రవైద్యుడున్నాడని.

తర్వాత - చింతపర్రులో వైద్యం చేయించుకోడం - అధ్యాత్మ రామాయణం పురాణం చెప్పి, ఊరివారి గౌరవాదరణలను చూరగొనడం — కన్ను నయమై ఇంటికి వెళ్ళడం —

తర్వాత, శ్రీ చర్ల బ్రహ్మయ్యశాస్త్రిగారివద్ద చేరారు. వ్యాకరణం చదువ నారంభించారు. అప్పటికే(తిరుపతి వేంకటకవులలో ఒకరైన) శ్రీ దివాకర్ల తిరుపతి శాస్త్రిగారు బ్రహ్మయ్యశాస్త్రులవారి వద్ద శిష్యులుగా వున్నారు. క్రమంగా తిరుపతి శాస్త్రిగారికీ వేంకటశాస్త్రిగారికీ మైత్రి కలిసింది.

"ఆతడు దివాకరాన్వయ శీతరోచి,
యీతడో చెళ్ళపిళ్ళ విఖ్యాతకులుడు;
తిరుపతి యతండు, వేంకటేశ్వరు డితండు;
వయసు బుద్ధియు నొక్కటై వరలుచుండు—"

శ్రీ బ్రహ్మయ్యశాస్త్రులవారి దగ్గర చేరేనాటికి శాస్త్రిగారికి 17 సంవత్సరాలు. రెండు సంవత్సరాలపాటు దీక్షగా చదివారు. సర్వశాస్త్ర సారాన్నీ సంగ్రహించారు.

కాని, కాశీకి వెళ్ళి విద్యాపూర్తి చేసుకోవాలనే ఉత్సాహం మాత్రం తగ్గ లేదు. ఒకనాడు ఎవ్వరికీ చెప్పకుండా బయలుదేరి ఒక స్నేహితుణ్ని కలుపుకొని నిడమర్రుగ్రామం చేరారు కాశీకి పోవడానికై డబ్బు సంపాదించుకోవాలి. ఆ గ్రామంలో అష్టావధానం చేసి, శాస్త్రిగారు కొంత పైకం సంపాదించారు. అదే వారి మొట్ట మొదటి అష్టావధానం. తర్వాత మరికొన్ని గ్రామాల్లో అవధానాలు చేసి, కాశీకి పోవడాని కవసరమైన డబ్బు సేకరించుకొని స్నేహితుణ్ని తీసుకొని వెళ్ళిపోయారు.

కాశీలో సుబ్రహ్మణ్య పండితులవద్ద చదువుతూండగా, శ్రీ బ్రహ్మయ్య శాస్త్రులవారి వద్దనుంచి, శాస్త్రిగారిని రమ్మని ఉత్తరం వచ్చింది. శాస్త్రిగారికి తిరిగి రాక తప్పలేదు. ఆ స్నేహితుడు మాత్రం అక్కడే వుండిపోయాడు.

తిరిగి వచ్చి, శాస్త్రిగారు మళ్ళీ శ్రీ బ్రహ్మయ్యశాస్త్రిగారి వద్ద తిరుపతి శాస్త్రిగారితో కలిసి చదువ నారంభించారు. అప్పటినుంచే శ్రీ తిరుపతిశాస్త్రిగారూ, తామూ కలిసి కవిత్వం చెప్పడంకూడా ఆరంభించారు. 'ధాతురత్నాకర' మనే లక్షణగ్రంథాన్నీ, 'వీథి' అనే నాటికనూ సంస్కృతంలో వ్రాశారు.

తరువాత 1891 లో కాకినాడలో శ్రీ తిరుపతి వేంకటకవులు తమ మొట్ట మొదటి శతావధానాన్ని ఆంధ్రలోకానికి ప్రదర్శించారు. తరువాత తరువాత, ఆశుకవిత్వం చెబుతూ, అవధానాలు చేస్తూ, ఆంధ్రదేశాన్నే వారు నూతన కళా వాహినిలో ముంచెత్తారు. వారి శిష్యులైన శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు చెప్పినట్లు—

"పుడమిని పెక్కు సత్కవులు పుట్టిరి ముట్టిరి సత్కవిత్వపుం
దొడిమలు చెళ్ళపిళ్ళ కవితోఁ దులతూగెడువారె ? వానలో
తడియనివారు మద్గురు వధాన మృదూక్తి మరంద ధారలో
గడుగనివారు మా కెచట గానగరారిలఁ దెల్గునాడునన్"

అన్నంతటి ప్రఖ్యాతికెక్కారు. ఊరూరా వారిపేరు మారుమ్రోగింది. వారి ఆశుకవితా ధోరణిని విన్నవారూ, వారి అవధానంలో కూర్చున్నవారూ, వారి పుస్త కాలు చదివినవారూ - ఆంధ్రదేశం నలుమూలలా కవులై వెలిశారు. ఆంధ్రదేశంలో నూతన కవితా యుగోదయ మయింది. ఆనాడు కవితా ఝరి ఊరూరికీ ప్రాకింది. ఎక్కడచూచినా కవులూ, కవిత్వం; ఆశువు, అవధానం। ఆనాడే ఆంధ్ర కవి త్వాన్ని గురించి ప్రజలు ఆలోచించడం మొదలుపెట్టారు. అదే ప్రజలకూ, కవు లకూ ఆత్మీయత ఏర్పడడానికి ఆరంభం।

ఇలా అవధానాలుచేస్తూ నానా రాజాస్థానాల్లోను తమ కీర్తి ధ్వజాన్ని పాదు కొల్పుతూ శ్రీ తిరుపతి వేంకటకవులు 1903 దాకా దేశాటనం సాగించారు.

తర్వాత శ్రీ వేంకటశాస్త్రిగారు 1903 నుంచీ 1916 దాకా బందరు హిందూ హైస్కూలులో పండితులుగా పనిచేస్తూ అనేకమంది శిష్యులను ఆంధ్ర సాహితీ

రంగంలో ప్రవేశపెట్టారు. వారి శిష్యులందరూ నేటి మన ఆంధ్రసాహిత్యంలో ఉత్తమస్థానం పొందినవారే. వారిలో శ్రీ విశ్వనాథ సత్యనారాయణ, కాటూరి వేంకటేశ్వరరావు, పింగళి లక్ష్మీకాంతం, వేటూరి ప్రభాకరశాస్త్రి, వేలూరి శివరామ శాస్త్రి, త్రిపురనేని రామస్వామిచౌదరిగార్లు ముఖ్యులు.

శ్రీ శాస్త్రిగారు బందరులో వున్నరోజుల్లోనే వారి గ్రంథాలన్నీ (చాలా భాగం) ప్రచురించారు. ఈ రోజుల్లోనే వేంకట రామకృష్ణకవులతోను (పిఠాపురం), కొప్పరపు కవులతోను వివాదాలుకూడా సంభవించాయి.

(గీరతం, గుంటూరిసీమ చూ)

పండిత ప్రకాండులకు పాండిత్యభిక్ష పెట్టిన శ్రీ శాస్త్రిగారు సాహిత్యం ప్రజలందరికీ అందుబాటులో వుండాలనే దృష్టిలోనే మొదటినుంచీ కృషి చేస్తూ వచ్చారు. 1900 సం లోనే, అంటే శ్రీగిడుగు రామమూర్తిపంతులుగారి వ్యావహారికోద్యమం రాకముందే, శ్రీ శాస్త్రిగారు వ్యావహారికభాషలో "పల్లెటూళ్ళ పట్టుదలలు" ఈ మొదలైన అనేక ప్రహసనాలు 'మంజువాణి' పత్రికలో ప్రచురించారు.

1910 లో శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారు తమ్ము బందరులో కలుసుకున్నప్పుడు అన్యోన్యం హృదయం విప్పి సంభాషించుకున్నారు ప్రజా విజ్ఞానాభివృద్ధికోసమై శ్రీ గిడుగువారు చూపిన దీక్ష, అభిమానం, శాస్త్రిగారికి ఆదరణీయాలయినాయి వ్యావహారిక భాషలో రచన సాగించవచ్చునని అంగీకరించి, తానుగా జీవంగల వ్యావహారిక భాషలో రచన సాగించి యువరచయితలకు దారిచూపిన విద్వత్కవి వేంకటశాస్త్రిగారు.

1916 నుంచీ శ్రీ శాస్త్రిగారు తమ పిత్రీయమైన కడియం గ్రామంలోనే నివాస మేర్పరచుకొని, నానా రాజాస్థానాలనూ సందర్శిస్తూ, బహూకృతులందుతూ, ఊరూరా తమ కవితా శక్తిని ప్రదర్శిస్తూ అనేక గ్రంథాలను వ్రాస్తూ వున్నారు. కాని, ఇప్పుడు వృద్ధాప్యంలో 1943 నుంచీ బెజవాడలో వుంటున్నారు.

ఆంధ్రసాహిత్యానికి శ్రీ శాస్త్రిగారుచేసినసేవఅనన్యమైనది, అమోఘమైనది. ఆంధ్రసాహిత్యంలో ఆయన త్రొక్కని త్రోవలేదు. అవధాన విధానంలో ఆయన చూపనివిశేషం లేదు. యువరచయితలను పైకి తేవడంలోఆయనచేయని కృషిలేదు.

మృదు మధుర కవిత్వ తో పాటు, ఆయన గర్జారావంకూడా దేశం నలుమూలలా వినిపించింది. "...తుందుడుకొప్పగ పెంచినార మీ మీసము రెండు బాసలకు మేమె కవీంద్రుల మంచు జెప్పగా" అని రణభేరితో పాటు జయభేరి మ్రోగించిన కింకవీంద్ర ఘటా పంచాననుడు, విద్వత్కవి, శ్రీ వేంకటశాస్త్రిగారు!

— ప్రయాగ

కళలు - విశ్వవిద్యాలయాలు

ప్రత్యేక విశ్వవిద్యాలయం వస్తే తెలుగువారి కళా జీవితం తీర్చి దిద్దబడుతుందని యెంతగానో అందరూ ఆశించారు. అన్ని అవస్థలూ పడి, యెట్టకేలకు సంపాదించారు నిజంగా తెలుగువారికి విశ్వవిద్యాలయం వచ్చింది మూడుకోట్ల తెలుగువారి కళాతృష్ణయెలా పెరిగిందీ, మరి కెలా పెరుగుతుందీ? అనే ప్రశ్నలు యెన్నోయేండ్లనుంచీ కళాహితుల, కళాపోషకుల, కళాభిలాషుల, కళారాధకుల హృదయాలలో మారుమ్రోగుతూనే వున్నాయి. సమాధానం యెల్లప్పుడూ శూన్యంలోకి చూడడమే. ఎందువల్ల?

కళాశాలలో విద్యార్థులకూ ఉపాధ్యాయులకూ ఆదరాభిమానాలు అంటడంలా. ఉపాధ్యాయులకు పాఠాలు చెప్పడంపై అభిమానం పట్టడంలా విద్యార్థులు వినడంలో అంతకన్నా ఆసక్తిచూపరు. అందుకుబలమైన కారణంవుంది. మనజాతి వీరోచిత పాత్రను నిర్వహించే చరిత్రపలుకులు వినబడవు; మనసంపదలెలా అభివృద్ధిపొందినదీ చెప్పబడదు; మనకళలెలా వికసించినదీ బోధించబడదు. మనసంస్కృతికి రూపురేఖలెలా దిద్దబడినాయో వ్యక్తంచేయబడదు. మనసంపద, మన కళలు, మనజాతి, యెలా అభ్యుదయం పొందగలవో విపులీకరించ బడదు ఇక వినండి అబ్బబ్బా! ప్రతిఅక్షరం సామ్రాజ్యవాదుల దాస్యానికి దారితీయగల భావనలను వెల్లడిస్తాయి. అంతావాళ్ళ గొప్పతనాన్నే విప్పిచెప్పుతాయి. అన్నీ వాళ్ళ అనుభవాలనే నూరిపోస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే మనవిద్యావిధానమంతా, సామ్రాజ్యవాదుల పరిపాలనాధికార అవసరాలను తీర్చడానికే. వారికి అండను చేకూర్చడానికే. ఈ విధానం మనకికవద్దు, ఇదిమారాలి!

మూడుకోట్ల తెలుగువారు విశ్వవిద్యాలయంవైపు యెన్నెన్నో ఆశలు పెట్టుకుకూర్చున్నారు. వారి ఆశలు ఫలించాలి. వారితృష్ణలుతీరాలి. వారికోర్కెలీడేరాలి. వారిజీవితం తీర్చిదిద్దబడాలి, వారిముఖాలలో ఆనందరేఖలు విరజిమ్మబడాలి. ఎక్కడచూచినా కళారాధనలే కనుపించాలి విశ్వవిద్యాలయం ఈ పరిస్థితులను కల్పించగలదు. ఈ అభిలాషలను తీర్చగలదు. ఎప్పుడు?

విశ్వవిద్యాలయం ప్రజల విజ్ఞానవికాసాలను పెంపొందించే కేంద్రసంస్థ అనీ, అదిఅందరికీ విజ్ఞానాన్ని పంచడానికీ, పెంచడానికీ, కూడలి స్థానమనీ,

అందరమూ అంగీకరిస్తున్నాము. అయితే విశ్వవిద్యాలయం సహృదయంతో ఈ బాధ్యతలను నిర్వర్తించడానికి ప్రయత్నించిందా ? లేదు. ఇంతవరకూ అలాంటి ప్రయత్నంచేయలేదు. పైగా, విద్యార్థులు ఈ అభిరుచిలేని బానిస విద్యావిధానం పనికిరాదని మొత్తుకున్నా వినిపించుకోలేదు. పైపెచ్చు విద్యా విజ్ఞానాలను పెంపొందించే సలహాలిస్తున్నందుకు శిక్షణకు వ్యతిరేకమంటూ దండిస్తూ వచ్చారు. ఈ దండన ఒక్కొక్క సమయంలో పశుప్రవృత్తినిగూడా దాటిపోయింది. ఇలా చేయడం విశ్వవిద్యాలయ బాధ్యులకూ, వుత్తమ విజ్ఞాన సంపన్నులకూ భావ్యమా ? కాదు, కాదు. అదెన్నటికీ సక్రమవిధానంకాదు. వేలమందియువకుల హృదయాలలో జాతీయ సంస్కారభావాలు పెంపొందుతున్నప్పుడు, దీక్షగా అందుకు కృషి జేస్తున్నప్పుడు, మాతృదేవిలా ఆనందంతో మురిసిపోవాలి. అల్లారు ముద్దుగా బుజ్జగిస్తూ అండవున్నానని ధైర్యం చెప్పాలి. అప్పుడే బిడ్డలైన విద్యార్థులకూ, మాతృదేవిలాంటి విశ్వవిద్యాలయానికీ, సన్నిహిత సంబంధం ఏర్పడుతుంది. విద్యావిధానంలో మార్పుకు మార్గా వస్తుంది. విద్యాభిమానమూ పెరుగుతుంది, బోధకులను విద్యార్థులూ, విద్యార్థులను బోధకులూ అర్థంచేసుకుంటారు. ఒకరికొకరు సలహాలనిచ్చుకుంటారు. కళాదరణ వస్తుంది. కళాభ్యుదయం కలుగుతుంది. ఇందుకు విశ్వవిద్యాలయం పూనుకుంటుందా ? అవును, పూనుకోవచ్చు పాతసంగతుల పరిచయంవల్ల పశ్చాత్తాపముకలగనూ వచ్చు. సంపూర్ణత్వం పొందడంకోసం తహతహ హెచ్చనూవచ్చు. మనం మానవులం ప్రయత్నం చేస్తాం. విజయసాధనకై దీక్షవహిస్తాం విజయంతప్పదు. ఇందుకు మానవ విజ్ఞాన పరిణామ చరిత్రే చక్కని వుదాహరణ.

మన ఆంధ్రులలో విజ్ఞానవంతులు, కళారాధకులూ, విశ్వవిద్యాలయోపాధ్యక్షులూ అయిన శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు కవిత్వ తత్వవిచారంలో యిలావ్రాశారు: "మనకవులూ పండితులూ యింటిలోనే కూర్చుండి నిఘంటువులం గంఠ పారము సేయువారు. వీరికి కార్యోత్సాహము, భావ ప్రాబల్యము రెండును క్షీణములు. కావుననే భావనాశక్తిమట్టు. ఒకవిధమైన యాలోచనాశక్తియెక్కువ. కాన, రేపగలును ఆలోచించి యాలోచించి దిక్కు గతి మోక్షములేని యూహల గల్పించుచునదియే కవిత్వమని విఱ్ఱవీగసాగిరి యుక్తులు కుయుక్తులుం గవితాశక్తి యగునా ? కానేరవు."

అవును. ఇదిఅక్షరాలా నిజం, మానవ జీవితంలోని అనుభవం లేకండా భావనాశక్తిని కల్పించకండా, నిఘంటువులజూచి కవిత్వంరాయడం హాస్యాస్పదం కాదూ ! అలాంటి సాహసం యెవరు యే విషయంలో చేసినా మన్నించలేము. కాని చూడండి - ఇలా వ్రాసిన కట్టమంచి రామలింగారెడ్డిగారే ఆంధ్ర విశ్వవిద్యాలయం విషయంలో వక్రగమనం చేశారా అనిపిస్తుంది. యుక్తులు కుయుక్తులు పన్ని ఆలోచించి యాలోచించి దిక్కు గతీ మోక్షంలేని యూహల గల్పించి

విశ్వవిద్యాలయ కళాప్రభావము మూడుకోట్ల తెలుగు ప్రజలపై పడకుండాచేశారు ఎన్నెన్నో నీతులు వ్రాసిన, ఎంతెంతో మేధస్సుందనుకొన్న రామలింగారెడ్డిగారే విశ్వవిద్యాలయాన్ని నిర్వహిస్తున్నారా అన్న ఆశ్చర్యము వేస్తుంది. ఆదాయం వుంది, సామగ్రివుంది, సౌకర్యాలు వున్నాయి అన్నీవుండి అల్లుడినోట్లో శని అన్నట్లుగా యెందుకు విశ్వ విద్యాలయం యిలా కళావిహీనముగా వుండివుందో హృదయంపై చేయివేసుకొని రామలింగారెడ్డిగారు చెప్పగలరా? ఆంధ్రులందరికీ, విజ్ఞాన వికాసాల్ని పంచగల విశ్వవిద్యాలయానికి అధినేతలుగా వున్న రామలింగా రెడ్డిగారు సమాధానం చెప్పుటకు సాహసించగలరా? గతాన్ని తరచి, వర్తమ నాన్ని మరచి, కళాపరిపుష్టితో విశ్వవిద్యాలయాన్ని వెలుగొందేలా చేస్తారా? రామలింగారెడ్డిగారి కళాతృష్ణకు దీనిని పరీక్షగా లెక్కిస్తారా? వారి హృదయానికి అంతిమ కొలబద్దగా భావిస్తారా? వారి వక్తిత్వానికి పునాది రాయిగా అంగీక రిస్తారా? వారి వూహాపోహాలకు గీసిన గీటుగా వొప్పుకుంటారా? వారి వున్నత మేధస్సుకు తొలిచిన బాటగా స్వీకరిస్తారా? ఇకముందు అనుభవంగా తీసు కుందాం విశ్వ విద్యాలయం కళానిలయ మౌతుందని ఆశిద్దాం మన ఆశలు వుత్తిత్తినేపోవని అనుకొందాం. విశ్వవిద్యాలయానికి కళారాధకులూ, విద్యార్థులూ ఒకరేమిటి, మూడుకోట్ల ప్రజల హృదయావేదన అందగాఫుందని హామీనిస్తున్నాం. అత్యుత్సాహంతో అచంచల దీక్షతో ముందుకువచ్చి బాధ్యతల్ని నిర్వహించమని కోరుతున్నాము.

ఓ తెలుగు విశ్వ విద్యాలయమా! మూడుకోట్ల ప్రజల కళాహృదయాన్ని వ్యక్తం చేస్తావా?

మాలవ్యా పరిలేదు

మహా పండితుడూ, కాశీ విశ్వవిద్యాలయ స్థాపకుడూ, దేశభక్తుడూ, కళారాధకుడూ, ఉత్తమ విజ్ఞాన సంపన్నుడూ, బహు భాషాకోవిదుడూ అయిన శ్రీ మదనమోహన్ మాలవ్యాగారు 12-11-46 న పరమపదిం చారు జాతీయాభ్యుదయానికి కాంతిరేఖలు విరజిమ్మే ఒక నక్షత్రం మన కందని లోకాలకు జారిపోయింది. యావద్భారత దేశాన్ని క్షణం చీకటిలో ముంచింది. కళారాధకుల హృదయాలను దుఃఖంలో పొలిచింది.

ఆయన ఏ కళల అభివృద్ధికోసం, ఏ జాతి స్వేచ్ఛా స్వాతంత్ర్యాభ్యు దయాలకోసం కృషిచేసిపోయారో, ఆబాధ్యతను నిర్వహించి, దుఃఖాశ్రువుల నణచుకుంటామని ప్రతిజ్ఞ చేస్తున్నాం. వారి కుటుంబానికీ, ప్రత్యేకంగా కాశీ విశ్వవిద్యాలయంవారికీ కల్గిన బాధకు మా హృదయపూర్వక సానుభూతిని అందజేస్తున్నాం.

'అభ్యుదయ'కు స్వాగతం

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

'అభ్యుదయ' అన్న మాసపత్రిక ప్రథమసంచిక వచ్చినది.

'అభ్యుదయ' మార్గము క్రొత్తది. క్రొత్తదియైనను ప్రాఁతమార్గములతో సమన్వయము కొఱకు ప్రయత్నించుచున్నది. ప్రాఁతకుఁబ్రాఁత, క్రొత్తకుఁగ్రొత్త. యెవరిదారిని వారు వోయి జాతి మత సంఘములలో భిన్నత్వము తెచ్చుకొని యెవరితెన్ను వారు వోయి యైక్యము లేకుండఁ జేసికొనరాదు. అపుడు బలము నశించును. అట్లుకాక యభ్యుదయ సమైక్యముకొఱకే ప్రయత్నించుచున్నది.

క్రొత్త రారాదని యెవరును బిగించుకొని కూర్చుండరాదు. ప్రాత యను కొన్నదానిలోనను తత్తత్కాలములయందలి క్రొత్తలు కలిసియే నేటి సమిష్టిరూప మొక ప్రాతయైనది. సమన్వయము సంఘములోని యుదాత్తప్రకృతులయు సంఘ సమైక్యముయొక్క జీవననిర్మాతలయొక్కయు దృష్టి.

క్రొత్తలోఁ గొన్ని సమన్వయమునకుఁ గుదురని వుండును. కాలక్రమేణ అవి సర్దుకొనును. ఈ సర్దుకొని యీ నూత్నప్రవాహము నిత్యప్రవాహముతో సాధుసంగమము వొందునట్లు చేయుట కర్ణధారుల పని.

కర్ణధారులు సనాతనులు. అనగా నిత్యులు. అనగా సృష్టిలో అవసరమై నప్పుడెల్ల నుదయించుచుందురు.

ఈ యభ్యుదయ యీ సర్వలక్షణములు కలిగియుండుట శుభావహము.

ఇదే యభ్యుదయకు స్వాగతము.

శివతాండవం

శ్రీ అనిసెట్టి సుబ్బారావు

ప్రతి ఒకడూ శివుడు నేడు!
డమరుకమై భువి దద్దరిల్లు,
బుసకొట్టే విషఝుంఝులు
పొర్లి త్రెళ్ళి పోతున్నవి!
ప్రతి ఒకడూ శివుడు నేడు!

'భూత' కాల గళము మరిగి
కాలకూట మావిరులౌ,
'నేడు' ప్రళయరుద్రుని
త్రేతాగ్ని శిఖల దహనమౌను;
'భావి' మకుట దీప్తు లెగయ
ప్రతి ఒకడూ శివుడు నేడు!

విధికరములు మలిన జలధి
విసిరిన మణి కిరణమువో,
పొగగ్రమ్మిన రాత్రి త్రోసు
కొని పర్విన కిరణమువో
బాహ్యాంతర మనురాగ
ప్రదీప్తమౌను!

ప్రకృతి జీవనోద్వేగము
పదము లంటిపట్టినదా,
ప్రాణం ప్రవహించినదా!
ఈ అగాధ నీరవ సుందర
విశ్వహృదయములో శిరమునిలుచు,
అడుగందని లోతు కొలుచు!
ప్రతి ఒకడూ శివుడు నేడు!

☆

నేను సైతం
ప్రపంచాగ్నికి
సమిధ నొక్కటి ఆహుతిచ్చాను....

— శ్రీ శ్రీ

విద్య

శతావధాని, శ్రీ చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి

"విద్య రానివాడు వింతపశువు" "విద్యావిహీనః పశుః" "విద్యారూపం విరూపాణామ్" యిత్యాదులు యెన్నో అభియుక్తోక్తులు, విద్యనుగూర్చి బోధిస్తాయి. విద్యని సంపాదించడం చాలా కష్టం. పూర్వకాలంలో గురుశుశ్రూష చేసి విద్యని సంపాదించుకొనేవారు ఇప్పుడు ఆసంప్రదాయం చాలావఱకు నశించింది. ద్రవ్యం యిచ్చి కొనుక్కుంటూన్నారు హోటళ్ళ మాదిరిని "స్కూళ్లూ కాలేజీలు" యేర్పడ్డాయి శుశ్రూషకు సంతోషించి చెప్పే గురువులులేరు అయితే పూర్వం విద్య ధనికులకన్న బీదలకే అందుబాటులో వుండేది. యిప్పుడు ధనికులకే కాని విద్య లభించదు. ఓ- నా- మాలవఱకు వుచితంగా నేర్పుతారు గాని అదల్లా పంతుళ్ళజీతానికి మాత్రమే. యింకా ఇతరఖర్చులు చాలా వున్నాయి. పూర్వం విద్యార్థివేషం వేఱు, యిప్పుడు వేఱు. యీనాటివేషం కొంచెం గొప్ప విత్తంవుంటే కాని తుద నెగ్గేది కాదు.

నాచిన్నతనంలో యానాం (ఫ్రెంచి టవున్)లో కొన్నాళ్ళు చదువుకున్నాను. పుస్తకాలు స్కూలువారే యిచ్చేవారు. ఆస్కూల్లో మాతృభాషకూడా చెప్పినా ఫ్రెంచి ప్రధానంగా చెప్పేవారు. ఇప్పుడు విద్య చాలా వ్యాప్తిలో వుందనిన్నీ ఆకాలంలో నూఱుమందిలో యేవొక్కరికో తప్ప విద్యాలబ్ధి వుండేది కాదనిన్నీ చెప్పుకోవడం అంతా యెఱిగిందే. యిది సత్యదూరం కాదు. యిప్పటివిద్యాభ్యాసం-లేదా, విద్యావిధానం - "రష్యారాజ్యపరిపాలన"వంటిది దేశంలోవుండే ఐశ్వర్యం,యావన్మంది ప్రజలకూ అంతో యింతో "తిలాపాపం తలో పిడికెఁడు" అన్న మాదిరిది. అప్పటిది సామ్రాజ్యతత్వానికి అనుకూలించేది. యెవరో కొందఱు మహావిద్వాంసులుగా వుండేవారు. తక్కినవారు శుద్ధ శూన్యులుగా వుండేవారు. వేదమంతా తల్లకిందుగా వచ్చినవారిలో యెందఱో నిశానీదార్లు వుండేవారు ఆబాపతువారిలో శేషించిన మాబంధువులు వొకరు యీమధ్యనే 90 యేళ్ళ ప్రాయంలో స్వర్గస్థులైనారు. వేదపండితులలోనే కాదు యీమాదిరివారు షట్ఛాస్త్రజ్ఞులలో కూడా వుండేవారు వారు చదువుకున్న శాస్త్రాలన్నీ అచ్చుపడినా దేవనాగరలిపిలో వుండడంచేత అది చదవడం మట్టుకు నేర్చుకుని మాతృభాషలో కృషి చేసేవారు కారు. అందుచేత చేవ్రాలు చేయవలసివస్తే కొంత పుస్తకాపేక్షగా కనపడేది. మా పరమగురువులు కార్డు వ్రాయవలసివస్తే శిష్యులద్వారానే. మళ్ళా పాండిత్యం —

'షడ్దర్శనీవేది చర్ల బ్రహ్మయశాస్త్రి గురువరేణ్యుఁడు ధరాభరణ మాకు' యిది విషయాంతరం.

యిప్పుడు అందఱికి (ఆఁడాళ్ళకీ మొగాళ్ళకీ) ఆ బ్రాహ్మణ హరిహరజన పర్యంతమూ అంతో యింతో అక్షర జ్ఞానాన్ని మనకు బ్రిటిషు ప్రభుత్వం కలిగించినమాటనే విశ్వసిద్దాం. కృష్ణలోనో, గోదావరిలోనో యేనుఁగు యీఁత లోఁతు నీరు వుండడంకన్న ప్రతిగృహములోనూ నీటిపంపు వుండడం సుఖకరం కాదని యెవరంటారు? యిది అపాతరమణీయం తత్తథాస్తామ్. అయితే యిప్పుడు స్కూళ్ళల్లో బాలబాలికలకు చెప్పే పుస్తకాలని గూర్చి కొంచెం వ్రాయడానికి పెట్టుకున్నాను గనక యితరం జోలికి పోక దాన్నే వ్రాస్తాను. ఆ యీ పుస్తకాలల్లో వుండే పద్యాలు ప్రాచీనకవులవే చాలాభాగం. కొన్ని నవీనులవీ వుంటే వుంటాయి. తెలుఁగుభాషకు "యతిప్రాసల నిర్బంధం" వుండడంవల్ల యెంతటి మహాకవి రచించిన పద్యమేనా సరే కొన్ని నిరర్థకాలో సార్థకాలో మాఱుమూలపదాలు కలిగి వుంటుంది వుటంకిస్తాను—

"ఒడికముతోఁ బ్రయత్నమున
నొక్కమహాశిల కొండమీఁదికిన్"

ఆ యీ పద్యంలో వున్న మొట్టమొదటి పదం ఒడికము, (ప్రథమకబళే మక్షికాపాతః) అనేది నిఘంటు చూచి అర్థం చేసుకోవలసిందే గాని సుఖసుఖాల బోధపడేది కాదు. యతికోసమూ ప్రాస కోసమూ వుపయోగించవలసి వచ్చింది.

స్కూలుఫైనలు లోపు విద్యార్థులకు యీలాటి పదాలతో వున్న పద్యాలు ఆహ్లాదకరంగా వుండవు. మాష్టరు బోధించినా వాడుకలోది కాకపోవుటచేత లోయరుక్లాసు కుఱ్ఱలలో యే వొకనికో తప్ప జ్ఞాపక ముండదు. ఆ యీ ఒడికం అనేది నేను నేఁటికి మూడు పుష్కరాలకు పూర్వం (40 వత్సరాలకు ముందు) స్వయంగా గీరతంలో

"కడియఁపుఁ జేనిగ్రామ మది
కాపురమౌఁగద నాకుఁ; బూర్వమం
దొడికపుఁగైత కెవ్వఁడు
మహోదధి,మత్ప్రపితామహానుజుం
డెడపక జేనిసన్నిధికి
నేగకె కాలము పుచ్చె; నప్పుడా
తఁడు గల చోటికే నృప
వతంసుఁడువచ్చె రసజ్ఞుఁడౌటచే"
—(ఇతిహాస పర్వం చూ)

అనే పద్యంలో నైతే ప్రయోగించి వున్నాను గాని సరియైన అర్థం యిప్పటికీ తెలియదన్నది యధార్థం. అయితే ఆ యీ పదం చెడ్డని బోధిస్తుందా? మంచిని బోధిస్తుందా? అని ప్రశ్నించుకుంటే మంచినే బోధిస్తుందనే ధైర్యంతో వాడివుంటాను కవిత్రయంలో ఎఱ్ఱన్నగారి కవిత్వంలో దీన్ని చూచిన జ్ఞాపకం. యీలాటి వుజ్జాయింపు జ్ఞానంతో వాడిన పదాలు కొన్ని "అనడ్వాహాల" కథను జ్ఞప్తికి తెచ్చేవిగా పరిణమించి అపహాస్యత్వానికి దారితీయడమూ క్వాచిత్కంగా సంఘటిస్తుంది. వుదాహరించి మరీ చర్చిస్తాను—

"హరుని యంకమునందు
మురువుమీర వసించు
బాహులేయునికాంతి నోహటించి"

యీ సీస చణంలో వున్న "ఓహటించి" అనేది "జయించి" అనే అర్ధమందు మాచేత (తి॥ వెం॥) వుపయోగింపబడింది. కాని వుజ్జాయింపుటూహతో వాడిన యీ పదం కేవలం వ్యతిరేకంగా పరిణమించినట్లు కొన్నాళ్ళకు గుర్తించి తర్వాత—

"బాహులేయుని కాంతిపటిమ మించి"

అని దిద్దుకున్నాం. దీన్ని గూర్చి వ్రాయవలసివస్తే చాలా వ్రాయాలి మా కవితా సంసారంలో యీలాటి తబ్బిబ్బులు చాలా వుంటాయి. ఒకటి మచ్చుకు వుదాహరించాను ప్రధానాంశం వినండి.

అంత వాళ్ళం యింతవాళ్ళం మీసాలు పెంచాం, గెడ్డాలు పెంచాం, కవిత్వానికి మా ముందు నిల్చేవాళ్ళ (చిల్లర కవులలో జేరబోము చూ.) యెక్కడోగాని లేనేలేరంటూ, అహంభావాన్ని వెళ్ళగ్రక్కేవాళ్ళని బుట్టలో బెట్టే పదాలు లోయరుక్లాసు కుఱ్ఱలకు అజీర్ణం చేస్తాయి గాని సుళువుగా జీర్ణించవు. అందుచేత అలాటి పదాలతో వున్న పద్యాలుగాని, వచనాలుగాని లోయరు తరగతి పిల్లకాయలకు పఠనీయాలుగా యేర్పఱచడానికి నేను యిష్టపడను. అచ్చతెలుగే అయినా తెలుగు దేశంలో పుట్టిపెరిగిన కుఱ్ఱాడికి అగమ్యగోచరంగా వుండే భాష (కృతకభాష) కొంత వుంటుంది. వుదాహరిస్తాను—

"పల్కుటాల్ దొరగ్రుడ్డు
పసఁటు లాటలపట్టు"

ఈ సీసం యావత్తూ యిట్టి అచ్చతెలుగే. బ్రహ్మాండభాండములు విహారస్థలములు అనుటకు మా "పిన్నముత్తాత నర్సన్నగారు" ఈవిధంగా ప్రయోగించారు.

యిట్టి కృతకభాష మాతృభాష కానేరదు కనక లోయరు క్లాసు కుఱ్ఱల విషయంలో యిట్టిపద్యాలు వుపకరించవు తత్సమతెలుఁగే అయినా—

"దేవసముల్లైన అనుజుల
తోవిప్రులతో రథాళితో వచ్చిఅర
ణ్యావాసము జేసెదు ధర
ణీవల్లభ ? నీవు ధర్మనిష్ఠితబుద్ధిన్"
(భారతం)

ఈమాదిరి పద్యాలు లోయరుక్లాసు కుఱ్ఱలకు అనుకూలిస్తాయి. నా చిన్నతనంలో లోకల్‌ఫండుస్కూల్లో నాలుగో క్లాసులో ఈపద్యం చదువుకున్న జ్ఞాపకం, ఆవయస్సులోకూడా యించుమించు ప్రతిపదార్థంకూడా వంటఁబట్టింది కనకనే యింకా జ్ఞప్తిలో వుంది ఆయీ పద్యంలో యడాగమం చేయడం మానేసినవి రెండు ప్రయోగాలు వ్యాకరణవిరుద్ధాలు కనపటిచాను యెందుకంటే లోయరుక్లాసు కుఱ్ఱలకు వ్యాకరణపు కట్టుబాటు చాలావఱకు తగ్గించడమే వుపకారకం. యడాగమమే కాదు ద్రుతప్రకృతికసంధి వికారాలుకూడ తగ్గించిన భాషాయోషయే ఆయీ కుఱ్ఱలకు తల్లిగా వుండి అభివృద్ధికి తెస్తుంది. శైశవావస్థలో ద్రవపదార్థాలు జీర్ణకోశానికి అనుకూలించినట్లే భాషకూడా (యించుమించు వ్యావహారిక మన్నమాట) ద్రవపదార్థసదృశంగానే వుండడానికి నేను యిష్టపడతాను. లోయరు క్లాసుకుఱ్ఱలకు మాత్రమే కాదు స్కూలుఫైనలు వగ

యిరా పైతరగతుల విద్యార్థులలోకూడా వ్యాకరణం అంటే చుక్కెదురుగానే వుండే బుద్ధిమంతులను నేను చాలా మందిని యెఱుఁగుదును.

వ్యాకరణ మన్నప్పుడు అన్నిటికీ సమన్వయించుకోవలసినదే కాని సంస్కృతానికిమాత్రమే అనుకోరాదు. మామూలు మాటలకు సంబంధించక అచ్చులనీ హల్లులనీ యేమోఅనీ (తుమున్నర్థకం చేదాద్యర్థకం వగైరా) యేమోఅనీ చెప్ప వలసివస్తే ఆయీ మాటలు పైతరగతుల విద్యార్థులకూడా యినపగుగ్గిళ్ళుగానే వుంటాయి. నా తెలుఁగుటీచరీ రోజుల్లో నేను యీబాజరబందీ పడలేక స్కూలు పైనలు క్లాసుకు సమేతూ చిన్నయసూరి వ్యాకరణం వగైరాలు చెప్పక, టూకీగా ము క్తసరిగా మూడు నాలుగు మాటలతో వాళ్ళ కాంపోజిషను తుదనెగ్గేటట్టు చేసేవాణ్ణి సంవత్సరం పొడుగునా తావన్మాత్రానికి సంబంధించిన తప్పులే దిద్దడం.

ఆ సూత్రాలు—

(1) ఉకారసంధిసూత్రం. (2)అకారసంధి (3)ఇకారసంధి. ఇంతే నా తెలుఁగు వ్యాకరణం ఇందులో మొదటిది కంపల్‌సరీ. రెండు మూడులు మీయిష్టం. యీ విషయం యెక్కడో లోగడ వ్యాఖ్యానించే వుంటాను. కనకనే స్పృశించి విడుస్తున్నాను.

యిటీవల లోయరు కుట్టుల పరనీయాలు సంధుల నియమం కొంత తగ్గించి వుండడం గోచరించింది. అది అభినందనీయమే వచ్చే (1947) సంవత్సరాన్నుంచి భూగోళం వగయిరాలు కూడా మాతృభాషలోనే బోధించే యేర్పాటు కాంగ్రెస్సువారు చేస్తారని ఏదోపత్రికలో చదివినట్లుజ్ఞాపకం. ఆయీ మార్పును సర్వథా అభినందిస్తూ నాకు తోచిన సలహానుకూడా సూచిస్తాను. మాతృభాష అంటే యెవళ్ళకేనా వ్యావహారిక మవుతుందిగాని గ్రాంధికం కాదు. కనక లోయరు క్లాసులకు నాగరికుల వ్యావహారికంలో బోధిస్తే మటీవీలు. వ్యావహారిక మన్నా గ్రామ్య మన్నా వొకటే. గ్రామ్యంకూడా ఆయా దేశాలని బట్టి కులాలనుబట్టి శాఖలనుబట్టి నానా విధాలుగా వుంటుంది మనకి ప్రస్తుతం లోయరుక్లాసులకు వాడుకో తగ్గది, నా దృష్టిలో లౌకిక గ్రామ్యం కనపడుతూ వుంది. వైదికగ్రామ్యం బొత్తిగా అర్థాన్నంగా వెఱ్ఱిగా వుంమంది వుదాహరిస్తాను.

"ఆస్సే! చూస్విపషే! హాషే! చెముడషే!
అష్టాగషే ? యేమిషే ?
విస్సావఝ్ఝులవారి బుట్టినష ?
అవిస్సాయి కిస్సారుషే
విస్సం డెంతటివాఁడె యేళ్ళ
పదషే ? వేయేళ్ళకొ మంచి వ
ర్చెస్సే ? అందురు వైదికోత్తమ
కులస్త్రీ లాంధ్రదేశమ్మునన్"

ఆయీ భాష నాచిన్నతనం నాటికి (దాసువారి తెలుగునాడు. చూ.) బాగా ఛాందసుల యిళ్ళలో వాడుకలో వుండేది. యిఁట్లో బట్టలూ, వీధిబట్టలూ, స్కూలు బట్టలు వగైరా కేటాయింపులతోపాటు బాజార్లలో గవ్వల మారకంతోపాటు యింకా మటికొన్ని సందర్భాలతోపాటు పైని చూపిన భాషకూడా అంతరించి

నట్లే. యింకా హతశేషం యేబ్రాహ్మణాగ్రహారంలోనేనా వుపలబ్ధమైతే అవుతుందేమో !

స్కూళ్ళలో ఆయీ భాషతో వ్యవహరించ వలసివుండదు లౌకిక గ్రామ్యంలో పరనపాఠాలు జరిగేటట్టు చేస్తే అది గ్రాంధికభాషకు దగ్గఱగానే వుంటుంది. సంగీతకవుల కవిత్వానికి లౌకికగ్రామ్యానికి యెంతో వ్యత్యాసం వుండదు వుదాహరిస్తాను–

(1) ఉండేదే రాము డొకఁడు
పూరక చెడిపోకె మనస ! ॥ఉండే॥

(2) అంతా రామమయం యీజగ
మంతా రామమయం॥

త్యాగరాయలవంటి గేయకవి, రామదాసువంటి గేయకవి వాడిన భాష మన లోయరుక్లాసు పిల్లకాయలకు పనికిరాదని నేను చెప్పను. ఆయీ గేయములలోవున్న వ్యాకరణ వ్యత్యాసాలూ, (1) ఉండేదే (2) పూరక (3) అంతా వగయిరాలు ఉండెడిదే ఊరక అంతయు అని సవరించి కొంచెం చూపితే విద్యార్థులకు ఆయీ రెండిటికీ వుండే తేడా పాఠాలు సుళువుగా బోధపడతాయి.

"అధవా ప్రతిపక్షస్య వాచయిత్వా
బహూన్ గుణాన్
తజ్జయా న్నాయకోత్కర్ష
వర్ణనంచ క్వచిన్మతమ్"

ఆయీ కేచిన్మతానికి నేను చూపిన మార్గం అనుకూలిస్తుంది. తప్పులేవో గురువు శిష్యుఁడికి బోధిస్తే స విశేష న్యాయంచేత వొప్పులు చెప్పకుండానే బోధపడతాయి. నపరదారాన్ గచ్ఛేత్ - నకలంజం భక్షయేత్ - నానృతం వదేత్ అని పాపకార్యాచరణం నిషేధిస్తే పుణ్యకార్యం తెల్పకుండానే తెలుస్తుంది యీ మార్గం వేదసమ్మతంగాని నూతనంగాదు. వేదం కొన్ని ధర్మాలు విధిముఖేనా బోధించింది. కొన్నిటిని నిషేధ ముఖేనా బోధించింది. నిషేధానికి లోఁగడ చూపినవి వుదాహరణం. తక్కినదానికి వుదాహరణం చూపుతూ వున్నాను.

"స్వర్గకామో యజేత సంధ్యా
ముపాసీతు మాతృదేవో భవ"

ఇత్యాదులు.

గేయకవిత్వంలో పద్య కవిత్వంలో కంటె యెంతో వ్యత్యస్తప్రయోగాలు వుండవు. మారుమూల యతులూ ప్రాసలూ వుండవు–

"కృపగలదా ? మాముప్వ గోపాలబాల"

ఈమాదిరి యతులు క్వాచిత్కంగా వుంటాయి ఋకారానికి ఇ-ఈ-ఎ-ఏలు చెల్లడం శాస్త్రసిద్ధమైనా 'కృ' అనే దానికి కో, గో. అనేవే శ్రవణసుఖంగా కనపడతాయి పదకవులు శ్రవణసుఖాన్నే యెక్కువగా పాటిస్తారు. ఇది విషయాంతరం.

ప్రస్తుతం లోయరుక్లాసు పిల్లకాయలకు లౌకిక గ్రామ్యభాషతో చరిత్రాదులను బోధించడమే నాకు సర్వథా యుక్తంగా కనుపడుతూవుంది అనేది. యెంత తేలికలో తెలుక్కి వ్యాకరణం రచించినా లోయరుక్లాసు కుఱ్ఱలకు బోధపడదని నేను గుర్తించాను.

ఈ అనుభవం ఒకటి రెండేళ్ళది కాదు. సుమారు 13 యేళ్ల తెల్గుటీచరుగా

వుండి సంగ్రహిం చింది. వ్యావహారిక భాష వాడుకచేయడంవల్ల నరకం వస్తుం దనే భయం నాకులేదు. ఎంత మడి గట్టుకున్నా లోకంలో పుట్టి పెరిగే వాళ్ళకు లౌకికభాషతో సంబంధం అని వార్యం గ్రాంధిక భాషలో పాండిత్యం లేనివాళ్ళలో యెందఱో వా, వారి అభి ప్రాయాలు బహిర్గతం చేయడానికి యీ కట్టుబాటు బాధకంగా వుంది. యిది తొలగడం లోకానికి కొంత మేలు.

పద్యకవిత్వంగాని, గద్యకవిత్వం గాని వ్యావహారికభాషలో హృద్యంగా రచించేవారుంటే నేను వారిని ద్వేషిం చేవాణ్నికాను. ధూర్జటి—

"అంతా సంశయమే"

అంటూ పద్యం యెత్తుకున్నాడు. శ్రీనా ధాదులు తుట్టతుదకు - కవి బ్రహ్మ తిక్కన్నంతటివాడు వ్యావహారికానికి చోటివ్వక తప్పిందికాదు.

"నికృష్టంపుం జంపుచంపి"

అనో, యిదేమాదిరిదో కవి బ్రహ్మ ప్రయోగం యెక్కడో వ్యాసంలో వ్యాక రించినట్లు జ్ఞాపకం—

కాంగ్రెసు ప్రభుత్వంలోగడ శృంగార గ్రంధాలకు నిర్నిమిత్తంగా వచ్చి చుట్టుకున్న నిషేధాన్ని తొలగించి పుణ్యంకట్టుకుంది. ప్రస్తుతం వుప్పుపన్ను తొలగించడానికి సంక ల్పించింది. వ్యావహారికభాషకు లోయరు క్లాసు పిల్లలకు అభ్యనుజ్ఞ యిస్తుందని నేను ఆశిస్తున్నాను. పూర్వంకంటె నాన్‌బ్రామిన్సు విద్యార్థులు యెక్కువగా పాఠశాలలో చదివే యీకాలానికి యీ అభ్యనుజ్ఞ చాలా వుపకారకం.

ఈ వ్యావహారికభాషా బహిష్కరణా నికి చాలామంది పెద్దలు లోగడ పాటు బడ్డారు. వారిలో కొందఱు గతించినా కొందఱి కనూ సజీవులు వారుకూడా లోయరుక్లాసు పిల్లకాయలకు అభ్యనుజ్ఞ నిస్తారనే నేను విశ్వసిస్తాను. పత్రికా సం పాదకీయాలే కాక వార్తలుకూడా వ్యాక రణ సమ్మతంగా ప్రచురించబడి వుండే రోజులు నేను యెఱుగుదును. వొక్క కొక్కండ పంతులవారి జీవితం ఆ నియమనిష్ఠలతో నెఱవేఱింది సామాన్య లోకులకు అపహాస్యాస్పదంగా వున్న ప్పటికీ ఆయన వ్రతాన్ని నిరపాయంగా జరుపుకున్నారు వారికి గ్రాంధికభాషంటే యెంత పట్టుదలో మళ్ళా - గిడుగు పంతులుగారికి వ్యావహారిక భాషంటే అంతకు మించిన పట్టుదల నాకో, ఉభయులూ మిత్రులు కనక నేను యీ వుపాయం ద్వారాగా—ఉభయకవి మిత్ర బిరుదు ధరిస్తున్నానని నేటికి 12 ఏళ్ళనాడు కృష్ణాపత్రికలోని 'కవిత్వ మంటే యేమిటి?' అనే వ్యాసంలో వ్యాకరించినట్లు జ్ఞాపకం అప్పటికీ యిప్పటికీ కూడా కాలం చాలా భేదిం చింది. దాసు శ్రీరామకవిగారు నాకన్న కొంత పెద్దలు.

"ఈ యిసుకోలు బళ్ళకడ
నింగిలిపీసులు పీసుపాసుగా
గూయగఁజొచ్చి, ఆ మయిల
గుడ్డలు వంకెఁ దగిల్చిరండు మొ
ఱ్ఱో యన నాలకింప రిసిరో?
కలికాలము కాలె రామ రా
మా! యను వృద్ధురాలయిన
స్మార్తవితంతువు మాటిమాటికిన్"

ఆ యీ పద్యంలో పుటంకించినమాదిరి స్మార్తవితం-వులు నేఁడు కీర్తిశేష పదవిని పొందినట్లే. అప్పుడు యింగ్లీషును ఒంగిలిపీసుగా అనవదించే ఛాందసగృహాలన్నీ యిప్పుడు చిత్రంగా మాఱి వున్నాయి ఇప్పుడు యే యిల్లు చూచినా కాఫీ, టీ, సిగరెట్టు, క్రాపింగు, జందెపు రైకలు, సబ్బులు యీవిధంగా మార్పుచెంది వున్నాయి. ఇంకా యేకరు పెట్టవలసివస్తే చాలా వున్నాయి విశేషాలు. మునుపెవరు సకృష్టులో వారిప్పుడు తత్కృష్టులు—

"బాపఁడు బుట్టలన్ గొఱుగవచ్చును"
(సుశీల చూ.)

యిట్టికాలంలో లోయరు క్లాసు కుట్టల విద్యావిధాసంపత్లు యీమాత్రం సడలింపును అంగీకరించక పోదు ప్రాజ్ఞలోకమని నేను భావిస్తాను కొన్ని సంధి నియమాలు కూడా లోయరుక్లాసు కుట్టలకు నియమించే పార్యగ్రంధాలలో పాటించ నక్కఱలేదని లోఁగడ వ్రాసి వున్నాను ఆయీ విషయాన్ని కొంచెం సోదాహరణంగా వ్యాకరించి దీనికి స్వస్తి చెపుతాను—

"నేఁటిసంగరమునఁ గుంతిభోజు
సుతకంచెను గోడలు వీరమాతగన్"

ఆయీ పద్యభాగంలో ద్రుతప్రకృతిక సంధివల్ల కుంతి గుంఁతిగానూ కోడలు గోడలు (ఇంటిగోడ) గానూ మార్పు కలిగింది, లోయరు క్లాసుకుట్టల పార్య పుస్తకాలలో—

"నేటిసంగరంమున కుంతిభోజుసుత
కంచెను కోడలు వీరమాతగన్"

అనే ముద్రించడం మంచిది యిక్కడ అపార్థ సూచన లేదు గాని కొన్నిచోట్ల యీసంధి చారుణ్ణి జారుణ్ణిగానూ తను జుణ్ణి దనుజుణ్ణి (రాక్షసుఁడు) గాను మారుస్తుంది ఆయీ చర్చ యెప్పుడో యితరత్ర విపులంగా వ్యాకరించిందే.

యీమధ్యలోయరుక్లాసు పిల్లకాయల పుస్తకాలు చూడడం తటస్థించి ఆయీ స్వల్పమార్పు జరిగితే బాగుంటుందని తోఁచి యీనాలుగుమాటలూ వ్రాశాను. ఆదరణీయమని తోస్తే ఆదరిస్తారు లేదా వుపేక్షిస్తారు. స్వస్తి.

★

వెనక చూచిన కార్య మేమోయ్ ?
మంచి గతమున కొంచెమే నోయ్ !
మందగించక ముందు అడుగేయ్,
వెనక పడితే వెనకే నోయ్ !

— గురజాడ

సంఘశక్తి

మూలం : **ఆర్ స్కీ**

★

అనుకృతి : **శ్రీ రమణారెడ్డి**

ఒంటరిగా లేము మేము
ఒడ్డులొరసి పొర్లిలేచు
విలయ సమయ స్రవంతులం!
నింగిని నిప్పుల నుమిసే
సూర్యుని సుడిగుండాల్లోనూ
అధికారాలు మా మనస్సులు—

గతదినాల దట్టపు పొగమంచుల్లో
కదిలే
గాఢ నిర్భరానందంతో పొంగే
ఉజ్వల నక్షత్రకాంతి మండలములు!

నిప్పులమంటలు మండిస్తూ,
నిప్పుల పిడుగులు కురిపిస్తూ,
తిరుగుబాటు బోధిస్తాం!
ఈ యిలాతలంలో సర్వం
మా మహాశక్తికి దాసోహం!

రాయి, రప్ప, ఉక్కు, నీరు
సకల వస్తు సంపదలు
రాజు కెదురు తిరుగుతాయి!

పచ్చపైరు పైనాడే
పవనంలా స్వేచ్ఛమాది!
పురాదాస్య శృంఖలాలు
బ్రద్దలుగా పగిలిస్తాం!
ఐక్యకాంక్ష రగిలి మండి
ఉక్కుబోను దహిస్తుంది!

మేము మహోద్వేగంలా,
శక్తిలాగ, చలనంలా,
ఉసిమై, పుర్రూతలూపు
ఊహమై విజృంభిస్తాం!
అసామ్యమై, అశేషమై
'సంఘశక్తి' ప్రచండమై
సర్వం పాలిస్తుంది!

తరతరాల దాస్యంలో
తల్లడిలిన లోకానికి
కాంతి పథం తెరచి నవ్య
జగతినే ప్రసర్శిస్తాం!
శాంతిని వర్షిస్తాము!

బంగిరెదుగు మాపొలాలు
కన్నులార గా చుకొరకు
చెరసాలలు బ్రద్దలుగా
చీల్చి కూల్చి పారేస్తాం!
లోకపు నరులంతా ఒక
మానవుడై నిలిచారు!!
విశ్వశ్రామిక కుటుంబం
ఏకశక్తిగా లేచింది!!!
ఒంటరిగా లేము మేము
ఒడ్డులొరసి పొర్లిలేచు
విలయ సమయస్రవంతులము!

దీపావళి

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

రేపు దీపావళి.

నిన్న రాత్రి బండికే అక్కా బావా దిగారు.

"అసలు వద్దామనుకోలేదు. రైలెక్కడమంటే హడలుగావుంది. కిందటి మాటు దీపావళికికూడా రాలేకపోయినాం గదా అని నేనే బలవంతపెట్టి ఆయన్ని బయల్దేరదీశా" నన్నది అక్క.

"అయ్యో! అదేమిటి? మన కింత కంటె పెద్ద పండుగ లేదుగదా, వద్దామనుకోకపోవడమేమిటి? చీటికీమాటికీ వస్తూ పోతూ వుండడానికి దూరాభారమాయెను! మిమ్మల్నిద్దర్నీ, పిలిచి పెట్టుకోవాలన్నా, చేసుకోవాలన్నా, ఇప్పుడు కాకపోతేమరెప్పుడే?" అన్నది అమ్మ

"చిట్టినీ, బుల్లాణ్నీ, మిమ్మల్నీ చూసిపోదామని వచ్చాంగాని, విందులు కుడవడానికి రాలేదు మీ రేమీ వృథాగా డబ్బు తగలెయ్యకండి" అన్నాడు నాన్నతో బావ.

"అదేమిటయ్యా? పండుగన్న తర్వాత ఉన్నంతలో ఏదో చేసుకోవాలి గాని, ఏమీ లేకుండా ఊరుకుంటామా," అన్నాడు నాన్న.... ...

"చూడమ్మా. ఆయనకుగానీ, నాకు గానీ బట్టలూ అవీ పెట్టకండి. అసలే కరువు రోజులు రేషన్‌కార్డుమీద దొరికే గుడ్డ ఏమూలకీ చాలకుండావుంది. మీరు గుడ్డ కొనిపెడుతున్నారని తెలిస్తే ఆయనకు చాల కోపం వస్తుంది" అన్నది అమ్మతో అక్క చాటుగా.

అక్క అనుమానపడ్డట్టే రాత్రి ఎనిమిదిగంటలకే ఎవరో ఒకాయన చంకలో చిన్న మూట పట్టుకొచ్చాడు నాన్న ఆయన్ని లోపలికి పిలిచాడు ఆయన లోపలికొచ్చి మూటవిప్పాడు. అందులో చక్కని మిల్లు ధోవతులూ, మిల్లు చీరెలూ వున్నాయి వాటి ధరకూడా అందంగానే వుంది.

బావ చూస్తూనేవున్నాడు నాన్న ఒక ధోతుల చాపూ, ఒక చీర కొనడానికి తయారవుతున్నాడు ఇంతలో బావ నాన్న కడ్డంవచ్చి. "ఈ బట్ట లేషాపులోవి?" అని అడిగాడు బట్టలు పట్టుకొచ్చిన మనిషి ఆశ్చర్యపడి చూశాడు.

బావ మండిపడ్డాడు దొంగవ్యాపారం చేసేవాళ్ళందర్నీ కొరత వేయాలన్నాడు. ఇటువంటి భ్రష్టులు అవకాశం చిక్కితే దేశాన్నీ, జాతినీ కూడా దొంగమార్కెట్టులో అమ్మేస్తారన్నాడు బట్టలు తెచ్చినవాడు గబగబా చుట్ట చంకనపెట్టి జారుకున్నాడు.

"అదేమిటయ్యా? రేపు పండగ్గదా

ఏదోవిధంగా బట్టలు సంపాదించుకోక పోతే ఎలా ?" అన్నాడు నాన్న

"బీదవాళ్ళకి చౌకగా అందవలసిన ఈ బట్టలు దొంగవ్యాపారులదగ్గిర బోలె డంత ధరపోసి కొనకపోతే హాయిగా నేతబట్టలుగాని, ఖద్దరుగాని కొనరాదా?" అన్నాడు బావ.

"నాజూకుగా వుంటాయని" అన్నాడు నాన్న.

"అయితే సిల్కులు కొనండి" అన్నాడు బావ.

"ఏమిటే అమ్మాయి, మీ ఆయనేదో కేకలేస్తున్నట్టుందీ ?" అన్నది అమ్మ అక్కతో

"నేను చెప్పలేదా" అన్నది అక్క.

* * *

తెల్లవారుజామున తలంట్లు పోసు కొని టపాకాయలు కాల్చాలి అందు కని నాన్న ముందుగానే కొన్ని సీమ టపాకాయలూ, మతాబా పుల్లలూ అవీ తెచ్చి వుంచాడు.

"నేను ఇప్పుడే రంగు నిప్పుల్లలు కాలుస్తా"నంటూ చిట్టి పంతంపట్టింది.

"ఇప్పుడు కాల్చకూడదమ్మా రేపు పొద్దున కాలుద్దుగాని, ఏం ?" అన్నాడు నాన్న.

"ఇప్పుడే కాల్చాలి" అన్నది చిట్టి.

"ఇప్పుడు కాలిస్తే బావ కోప్పడు తాడు" అన్నాడు బుల్లాడు. అంతకు ముందు బట్టలవిషయంలో బావ కేక లెయ్యడం బుల్లాడు చూశాడు.

"ఏం బావా, కోప్పడుతావా ?" అని అడిగింది చిట్టి.

బావ చిట్టినీ బుల్లాణ్నీ దగ్గిరికిపిలిచి కూచోపెట్టి, "ఇవ్వాళ ఎవరూ టపా కాయలు కాల్చ కూడదు. ఎందుకో తెలుసా ?" అన్నాడు.

"ఇవాళ కాల్చొచ్చు" అన్నది చిట్టి

"తెలీ" దన్నాడు బుల్లాడు.

"ఇవాళ ఎందుకు కాల్చ కూడదంటే, ఇంకా నరకాసురుడు చావలేదు, అందు కని కాల్చకూడదు" అన్నాడు బావ.

"నరకాసురుడు చచ్చిం తర్వాత కాల్చొచ్చా ?" అన్నాడు బుల్లాడు.

"కాల్చొచ్చు" నన్నాడు బావ

"నరకాసురు డెప్పుడు చస్తా ?" డని అడిగింది చిట్టి.

"తెల్లారుజామున కల్లా చస్తాడు. అప్పుడు మనం తలంటిపోసుకొని టపా కాయలు కాలుస్తా" మన్నాడు బావ.

"నరకాసురుడు చస్తే మనం టపా కాయలు కాల్చడం దేనికి ?" అని అడి గాడు బుల్లాడు,

"నరకాసురుడంటే ఏమిటను కున్నారు ? వాడు రాక్షసుడు, వాణ్ని చూస్తే ప్రజలందరికీ హడలు. వాడు అందర్నీ తిండితిననివ్వడు. హాయిగా నిద్రపోనివ్వడు. సుఖంగా బతకనివ్వడు వాడు మనుష్యుల్ని పశువులల్లే బళ్ళకి కట్టి లాగిస్తాడు లాగనివాళ్ళని కొర డాతో కొడతాడు. వాడు బలవంతుడు. అందుకని వాణ్నిచూసి భయపడి ప్రజలు వాడు చెప్పినట్లల్లా చేస్తారు."

బావకడ్డంవచ్చి చిట్టి, "ఎవరైనా వాడు చెప్పినట్టు చేయకపోతే ?"అన్నది

"చెప్పినట్టుచేయకపోతే వాడు చంపే స్తాడు" అన్నాడు బావ.

"అందరూకలసి వాణ్ని మెత్తగా తంతే?" అన్నాడు బుల్లాడు.

"తంతే చచ్చిపోతాడు కాని వాణ్ని తన్నడానికి అందరూ కలవాలిగద? అందరూ కలవడానికి ఒక నాయకుడు కావాలి కృష్ణుడే ఆ నాయకుడు. కృష్ణుడూ, కృష్ణుడివెంట సత్యభామా కలిసి ప్రజలందర్నీ ఏకంచేసి నరకాసురుడిమీద పడి, వాణ్ని మెత్తగాతన్ని చంపేశారు. నరకాసురుడు చచ్చిపోగానే ప్రజలందరిభయం తీరిపోయింది. చక్కగా అందరుమళ్ళీ ఇళ్ళల్లో దీపాలు పెట్టుకొని తలంట్లు పోసుకొని పండుగ చేసుకున్నారు." అన్నాడు బావ.

"అయితే మరి, టపాకాయ లెందుకు కాల్చారు?" అన్నాడు బుల్లాడు.

నరకాసురుడు చచ్చినా, ఇంకా చిల్లర రాక్షసులు మిగిలారు. వాళ్ళు దోమలూ పురుగులూ అయి మురుగ్గుంటల్లోను రొచ్చుల్లోను దాక్కొని ప్రజల కనేక విధాల బాధలు తెచ్చిపెట్టారు. వాళ్ళందర్నీ చంపటానికి టపాకాయలు కాల్చవలసి వచ్చింది అన్నాడు బావ.

"ఇవాళ రాత్రికి నరకాసురుడు చస్తే మనం చూడొచ్చా?" అన్నది చిట్టి

"నరకాసురుడు చావడం మనం కళ్ళారా చూడగలమా? వాడు ఎక్కడో చస్తాడు. మళ్ళీ ఎక్కడో పుడతాడు. అందర్నీ పీడించుక తింటాడు, వాడున్నంతకాలమూ ఎవరూ కొంపలో దీపాలుకూడా పెట్టుకోరు. వాడు చచ్చేవరకూ అమావాస్యే. మళ్ళీ వాణ్ని ఏకృష్ణుడో వచ్చి చంపేస్తాడు, మళ్ళీ కొంతకాలం మన ప్రాణాలకు హాయిగా వుంటుంది. కాని వాణ్ని ఎన్నిసార్లు చంపినా, వాడి తర్వాత వాడి భటులైన రాక్షసులుంటూనే వుంటారు. వాళ్ళనికూడా చంపాలి .. మీరు హిట్లరు పేరు విన్నారా?" అన్నాడు బావ.

"నేను హిట్లరు బొమ్మచూశా!" నన్నాడు బుల్లాడు

"అయ్యో, నేను చూడలేదే" అన్నది చిట్టి

"ముక్కుకింద మీసాలంటించు కుంటాడే, వాడేనే" అన్నాడు బుల్లాడు.

"వాడా? వాణ్ని నేనుచూశా మనం భాగోతం చూశామే, వాడు కాదూ?" అన్నది చిట్టి

"ఔను. వాడే. హిట్లరు ప్రపంచాన్నంతా మింగడానికి యుద్ధంచేశాడు. యుద్ధంజరిగినన్నాళ్ళూ ఎవరూ రాత్రిపూట దీపాలు వెలిగించలేదు. చివరకు ప్రపంచంలో వున్న ప్రజలంతా కలిసి హిట్లరును చంపేశారు. హిట్లరు కుతోడైన వాళ్ళని ఈమధ్యనే వురి తీసేశారు."

"అందుకనేనా, మనం దీపావళి చేసుకుంటున్నాం?" అని అడిగింది చిట్టి

"ఔను. పెద్ద పెద్ద రాక్షసులు చచ్చిపోయినందుకు పండగ చేసుకుంటాం. కాని దీపావళి టపాకాయలు కాల్చడమంటే వట్టి పండగ చేసుకోవడమే కాదు చిల్లర రాక్షసుల్నికూడా చంపుతామని ప్రతిజ్ఞచెయ్యాలన్నమాట" అన్నాడు బావ.

"ఎవరీ చిల్లర రాక్షసులు?" అన్నది చిట్టి

"దురాశ, కోపమూ, గర్వమూ, పొగరూ — ఇటువంటివన్నీ. చిల్లర రాక్షసులే. ఈ రాక్షసుల్లోనుంచే మళ్ళీ ఒకనరకాసురుడులాంటివాడు పుడతాడు. .. ఇందాక బట్టలు పట్టుకొచ్చాడే, ఆ మనిషి ఎవరో తెలుసా?" అన్నాడు బావ.

"తెలుసు" నన్నది చిట్టి "ఆయన పేరు సాంబయ్య" అన్నాడు బుల్లాడు.

"ఆ సాంబయ్య వెంట చిన్నరాక్షసి కూడా వచ్చింది చూశారా?" అన్నాడు బావ

చిట్టి భయంమొహం పెట్టి "లేద" అన్నది.

"సాంబయ్యవెంట దురాశ కూడా వచ్చింది అయిదు రూపాయలు ఖరీదు చేసే ధోవతులకు పన్నెండు రూపాయ లడగమన్నది రాక్షసి. సాంబయ్య అడిగాడు."

బుల్లాడు కిలకిలా నవ్వాడు బావ కూడా నవ్వాడు

"సాంబయ్య వెంట వచ్చిన రాక్షసుణ్ని చంపాలా, వద్దా?" అన్నాడు బావ.

చంపాలన్నది చిట్టి. చంపాలన్నాడు బుల్లాడు నవ్వుతూ.

* * *

తెల్లారుజామున అందరూ తలంట్లు పోసుకున్నారు. నాన్న బావకు ఖద్దరు ధోవతులూ, అక్కకి ఖద్దరు చీరా కట్ట బెట్టాడు అందరూ సీమ టపాకాయలు కాల్చారు.

"రాక్షసులమాట మరచిపోవద్దేం?" అన్నాడు బావ,

చిట్టి సీమటపాకాయ అంటించి దూరంగా పారేసి చెవుల్లో వేళ్ళు పెట్టు కుంటూ "మరచిపో"నన్నది.

"రాక్షసుల్ని చంపేవాళ్ళట్లా భయ పడతారా?" అన్నాడు బావ.

"నాకు భయంలేదు"అంటూ బుల్లాడు కాల్చిన సీమటపాకాయ చేతిలోనే ఒక పక్కకుతిప్పి పట్టుకుని మొహం ఇంకో పక్కకి తిప్పి కళ్ళు గట్టిగా మూసు కున్నాడు.

సీమ టపాకాయ పేలి బుల్లాడి చేతి లోనుంచి ఎగిరిపోయింది. బుల్లాడివేళ్ళు కందినై. వాడు బిక్కమొహంతో వేళ్ళకేసి చూసుకున్నాడు.

"దీనికే భయపడతారా?" అన్నాడు బావ "నాచిన్నతనంలో మేంటపాకా యలు కడుతుంటే మందుపేలిమాఅందరి చేతులూ మొహాలూ కాలినై .... రా క్ష సు ల్ని చ ం ప డ మ ం టే మాటలా?" అన్నాడు బావ

"నాకేం భయంలేదు" అన్నాడు బుల్లాడు.

కొంచెం పొద్దెక్కినాక పక్కయింటి కాంతయ్య
గారి భార్య అమ్మను బియ్యం బదు ల డగ వచ్చింది. ఆనారం వాళ్ళకి చుట్టాల తాకిడి చాలా తగిలిందిట. నాలుగు రోజులకిందట తిరపతినించి తిరిగివస్తూ వాళ్ళ పెద్దబ్బాయి మామగారి తాలూకు అయిదారుగురు వచ్చి రెండురోజులుండి వెళ్ళారుట. నిన్న వాళ్ళమ్మాయిని దిగ బెట్టటానికి వస్తూ అయిదారుగురు వేరే పనిమీద వచ్చి ఒకపూట ఉండి పోయి నారుట.

"పిల్లా అల్లుడూ వచ్చారు, ఇవాళ్టికి సరిపోతాయో లేదో అన్నట్టుంది రేపటి మాట ఎట్లాగాలని చూస్తున్నానమ్మా పాపం!" అన్నది అమ్మ

బావ ఈ సంభాషణ విన్నాడు అక్కను పిలిచి, "పాపం, ఆవిడెవరో బియ్యం కోసం వస్తే, మీ అమ్మ లేదని చెబుతున్న ", చూసి వీలయితే బియ్యం ఇప్పించు" అన్నాడు.

"మీకు పులిహోర యిష్టమని అమ్మ పులిహోర చేద్దామను కొంటున్నది. అందుచేత నిజంగానే బియ్యంచాలవు" అన్నది అక్క.

"సామెత చెప్పినట్టుంది. వాళ్ళు అన్నం తినటంకన్న మనం పులిహోర తినటంముఖ్యమా ? పులిహోర మానేసి ఆవిడకి కాసిని బియ్యం ఇవ్వమను" అన్నాడు బావ

మధ్యాహ్నం ఒంటిగంట వేళప్పుడు కాంతయ్యగారి రెండోకొడుకు వచ్చి, "మాఅమ్మ కాస్త యింగువ పెట్టించుకు రమ్మంది" అన్నాడు.

అమ్మ వాణ్ణి వంటింటోకి పిలిచి ఇంగువయిస్తూ, "ఇవాళ మీయింటో పిండివంట లేమిట్రా ?" అని అడిగింది.

"గారెలూ, ఆవడలూ, పులిహోరా!" అని కేకపెట్టి కాంతయ్య కొడుకు ఇంగువ తీసుకుని పరిగెత్తాడు.

"చూశారా ? మనం పులిహోర మానుకుని వాళ్ళకి బియ్యమిస్తే వాళ్ళు హాయిగా పులిహోర చేసుకుంటున్నారు" అన్నది అక్క బావతో.

"కాంతయ్య భార్య వెంట రాక్షసి ఉందని నేను గుర్తించ లేదుసుమా !" అన్నాడుబావ

"చాల్లెండి,మీరాక్షసులూమీరూనూ!" అన్నది అక్క

"చూశావా, చిట్టి ? చూశావురా, బుల్లాడా ! కొంతమంది మనుషులు రాక్షసులకు మద్దతు చేస్తుంటే మనవాటి వాళ్ళం రాక్షసుల్ని ఎట్లా చంపగలం ?" అన్నాడు బావ.

"అక్కకూడా రాక్షసులకు మద్దత్తేనా ?" అన్నాడు బుల్లాడు

"అక్కకు రాక్షసులంటేకోపమేగాని మనసులో నమ్మకం లేదు. అందుకని మనం రాక్షసుల్ని చంపటం మానేస్తామా ?" అన్నాడు బావ.

"మానెయ్యం" అన్నది చిట్టి.

"చంపుతాం" అన్నాడు బుల్లాడు.

* * *

పొద్దూకంట. ఎవరిళ్ళముందు వాళ్ళు దీపాలు పెట్టుకుంటున్నారు. కొందరి వాకిళ్ళముందు పిల్లలప్పుడే మతాబాలూ, తాటాకు టపాకాయలూ, చిచ్చుబుడ్లూ కల్చడం మొదలుపెట్టారు వీధులంతా గంధకం పొగ కమ్ముకుంటున్నది.

"వీధులవెంట తిరిగివద్దాం వస్తారా?" అన్నాడు బావ

చిట్టీ, బుల్లాడు - బావ చెరోచెయ్యీ పట్టుకుని బయల్దేరారు.

"రోజూ ఇలాఉంటే బాగుండదూ?" అన్నది చిట్టి.

"రోజూ రాక్షసుల్ని చంపుతూ కూచుంటే ఇతర పనులుచేసుకోవద్దా ?" అన్నాడు బావ.

"టపాకాయలు దీపావళికే వస్తాయిగా రోజూ ఎలా కాల్చటం?" అన్నాడు బుల్లాడు

"అందరూ టపాకాయలు కట్టరాదు, దానికి లైసెన్సు కావాలి. టపాకాయలు కట్టేవాళ్ళు చాలా లాభంతీస్తారు." అన్నాడు బావ

"మనం రాక్షసుల్ని చంపితే వాళ్ళకు లాభం" అన్నాడు బుల్లాడు.

"కొందరు చాటుగా టపాకాయలు కట్టేస్తారు అదితెలిస్తే పోలీసులొచ్చి పట్టుకుపోతారు" అన్నాడు బావ

"పోలీసులే రాక్షసుల్నిచంపరాదూ?" అన్నది చిట్టి

"ఒక్క పోలీసులతో రాక్షసులు చావరు, దానికి అందరూ కలవాలి." అన్నాడు బావ

"అయ్యో! ఈ ఇంటో ఎవరూ టపాకాయలు కాల్చటంలేదే? చూడు. బావా, చీకటిగా ఎలా ఉందో?" అన్నాడు బుల్లాడు.

"వాళ్ళకింకా రాక్షసుల భయం పోలేదు. వాళ్ళకి డబ్బులేదు వాకిట్లో నిలబడ్డ ఆ పిల్ల చూడు. ఎంత కుళ్ళు గుడ్డలు కట్టుకుందో! అటువంటిపిల్లకు నరకాసురుడు చచ్చాడన్న సంతోషం ఏముందీ?" అన్నాడు బావ.

చిట్టిగాని, బుల్లాడుగాని ఏమీ మాట్లాడలేదు. మౌనంగా నడుస్తున్నారు.

బుల్లాడు అకస్మాత్తుగా ఆగి, "నేనోసారి ఇంటి కెళ్ళొస్తాను బావా, మీరిక్కడే ఉంటారుగాదూ?" అన్నాడు.

బావ 'ఎందు' కన్నాడు. బుల్లాడు పనుందంటూ ఇంటికేసి పరిగెత్తాడు.

దూరాన రోడ్డుమీద ఇద్దరు మనుషులు తోటాలు కాలుస్తున్నారు అందులో ఒకడి చేతిలో తోటా జారి రోడ్డుమీదపడి అన్నివేపులా పరిగెత్తసాగింది రెండోవాడి కాళ్ళసందున దూరి వాణ్ణి భయపెట్టింది

"ఆ అబ్బికి రాక్షసుల్ని చంపటం చేతకాదు" అన్నది చిట్టి గంభీరంగా.

క్షణక్షణమూ వీధి రంగులు మారుతున్నది. కాస్సేపు ఒక యింటిముందూ మరికాస్సేపు మరో యింటిముందూ కాంతి వెలుగుతున్నది మధ్య మధ్య పెద్దపెద్ద మోతలుకూడా వినిపిస్తున్నై

ఇంతలో బుల్లాడు పరుగెత్తుకుంటూ తిరిగొచ్చాడు. చేతిలో కొన్ని టపాకాయ లున్నై.

బుల్లాడు రొప్పుతూ, "ఇదిగో టపాకాయలు, ఆ అమ్మాయికిచ్చి రాక్షసులను చంపిద్దాం, ఏం?" అన్నాడు.

బావనోట మాట రాలేదు బుల్లాణ్ణి అక్కడే వాకిట్లో నిలబడిఉన్న పిల్ల దగ్గరికి పట్టుకెళ్ళి ఆ టపాకాయ లాపిల్ల కిప్పించాడు.

ఇంటోనుంచి జబ్బుతోవున్న పిల్ల తల్లి బయటికొచ్చింది. బుల్లాడికేసి కృతజ్ఞతతోచూసి కూతుర్ని, "కాల్చమ్మా కాల్చు!" అన్నది.

బుల్లాడు తెచ్చిన టపాకాయలు కాలుస్తుంటే కళా కాంతీ లేని ఆ బీదపిల్ల మొహం వికసించి ది, మతాబాల వెలుతుర్లో ఆ పిల్ల కళ్ళతోపాటు బుల్లాడి కళ్ళూ. చిట్టికళ్ళూ బావకళ్ళూ కూడా మెరిసినై.

నన్నయ తిక్కన మహాకవులు

కొన్ని వారి పోకడలు

శ్రీ పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి

నన్నయ కవితా సముద్రము అట్లాంటిక్ మహాసముద్రము. తిక్కన కవితా సాగరము పసిఫిక్ మహాసాగరము.

పై రెండు మహాబ్ధులలోను వేడినీటి ప్రవాహాలు, చలువనీటి ప్రవాహాలు, మంచుకొండలు మొదలగునవి ఎన్నియో కలవు. ఎఱ్ఱాప్రగ్గడ కవితా సముద్రము పై రెండు సముద్రములను గలుపు హిందూ మహాసముద్రము. ఇందులో హాట్‌వాటర్, కోల్డువాటర్, కరెంట్లు లేవుగాని తుపానులు హెచ్చు. ఎఱ్ఱన్నను విడిచి, నన్నయ - తిక్కన్నల 'హాట్ కోల్డు' వాటర్ కరెంట్లెట్లుండునో కొంచెము చూతము.

"మదమాతంగ తురంగ కాంచన
లసన్మాణిక్య గాణిక్య సం
పదలోలిం గొనివచ్చి యిచ్చి
ముదమొప్పం గాంచి దీవించి ర
య్యుదయాస్తాచల సేతు శీతనగ
మధ్యోర్వీపతుల్ సంతతా
భ్యుదయున్ ధర్మజు దత్సభాస్థితు
జగత్పూర్ణ ప్రతాపోదయున్."

ఉదయాస్తాచల సేతు శీత నగ మధ్యోర్వీపతులు మయసభలో ధర్మజుడు ప్రవేశించునాటికి ధర్మజునకు లోబడలేదు. ఈ కల్పనము సంస్కృత భారతమున మృగ్యము. నన్నయ ప్రభుడగు రాజరాజనరేంద్రునకు భారత దేశమంతయు కాదు, ఆంధ్రావనియంతయు నైన వశము కాలేదు. ఇక నెందుల కిట్లు నన్నయ చెప్పెను?

మన మిపుడు భరత ఖండమంతయు ఢిల్లీయందలి ప్రభుత్వమునకు వశమై యుండవలయుననిగదా చెప్పుచున్నాము. అది నన్నయ మహాకవి హృదయము ననే జన్మించెను. అతడు 'అవిరళ జపహోమ తత్పరుడు,' 'సంహితాభ్యాసుడు', మరియు 'వాగనుశాసనుడు,' అతడేమిచెప్పిన నట్లు జరిగి తీరును. ఇంద్ర ప్రస్థమున (ఢిల్లీ) నిపుడేర్పడిన భారతప్రభుత్వము నన్నయ మహర్షి మాటకు సూచికము కాదు గదా?

"…. ఋషీణాం పునరాద్యానాం
వాచ మర్థానుధావతి"

పై పద్యభావమనెడి వేడినీటి ప్రవాహమును నన్నపార్యాబ్ధి మనపై ప్రవహింప జేసి, భారతైక్యతను నేటికి తొమ్మిది వందలేండ్ల నాడే మనకు పురికొల్పెనని నాతలంపు.

తిక్కన కవితా సముద్రపు "కోల్డు వాటరు కరెంటున కొక నిదర్శనము.

"సింగం బాకటితో గుహాంతరమునం
జేడ్పాటుమై నుండి మా
తంగ స్ఫూర్జితయూధ దర్శన
సముద్యత్క్రోధమై వచ్చు నో
జం గాంతార నివాస ఖిన్నమతి
నశ్మత్సేనపై వీడె వ
చ్చెం గుంతీసుత మధ్యముండు
సమరస్థేమాభి రామాకృతిన్"

ఈపద్యం ఉత్తరగోగ్రహణకథాసందర్భమున ద్రోణాచార్యుడు చెప్పినది. కోల్డువాటర్ కరెంటు పైకి శాంతముగా కాన్పించి, లోనికి పోయినకొలది హెచ్చుగ ఘనీభూతమై భూమిని సమీపించినకొలది అడుగు భాగము పలుచగ నుండునని శాస్త్రజ్ఞులు చెప్పుదురు.

పై పద్యము మొదట చిన్న పదముతో నారంభింపబడి నడిమికి పెద్ద సమాసాలు చేరి కడపట చిన్న సమాసము కలదైయుండుటచే నిది కోల్డు వాటర్ కరెంటునకు సమానమంటిని. మరియు ఆ కరెంటు నడుమను 'తిమింగిలము' కూడ నొక్కొక్కప్పుడుండును. ఈ పద్యమున "స్ఫూర్జిత" పదమున్నది. దీని యర్థమేమో?

స్ఫూర్జిత శబ్దమునకు పిడుగు చప్పుడనియర్థము నిఘంటువులలో కలదు. ఈ యర్థమిట నెట్లుపొసగును? ప్రకాశించు అను అర్థమునే కవి తలంచియుండును.

ఇట్టి విశేషము లెన్నో ఇరువురి కవిత్వమునను జూపవచ్చును ఇద్దరుకవులు నొక్క పోలికను పోయిన రెండు పద్యముల నిట చూపుచున్నాను.

"వెలయంగ నశ్వమేధ [నిరుగడలన్
మ్ములు వేయును నొక్క సత్యమునకు
దులనిడి తూపగ సత్యము [పేర్మిన్"
వలనన ములుసూపు గౌరవంబున

—ఆదిపర్వం, 4-94

"వాజి మేధముల్ వేయొక్కవలనబెట్టి,
యలఘుసత్యంబు దక్కటి వలనియందు
నిల్పి, తులదూపగా సత్యనిష్ఠలోని
యర్థమున కెత్తువచ్చె నయ్యధ్వరములు"

—అను.పర్వం, 2-43

మొదటి పద్దియమున 'ములుసూపు' ఔచిత్యవిశేషమును దెలుపును. రెండవ పద్యము యథామాతృకగా తెనిగింపబడుట విశేషము

"చపలాక్షిచూపుల చాడ్పున కెడమిచ్చుఁ
జిక్కని చనుగవ జీరగోరు
నన్నువ కౌదీగయందంబు మదినిల్పు
జఘనచక్రంబుపై జలుపు దృష్టి,
అభిలాషమేర్పడ నట్లుండగా బలుక
వేడ్కతో మరుమాట వినగదివురు,
సతి ఘన లజ్జావనత యగు నక్కన్య
పైబడి లజ్జయు బాప గడగు,
నెంత శాంతులయ్యు, నెంత జితేంద్రియులయ్యు, గడు వివిక్తమైన చోట
సతుల గోష్ఠిఁజిత్తచలన మొందుదురెందు
గాము శక్తి నోర్వగలరె జనులు"

— ఆది, 3 ఆ.

"తన్వంగి మవ్వంపు దనులత నెసగెడి
నునుగాంతి వెల్లువ మునుగ బార,
కిసలయ హస్త కెంగేల నేపారు క్రొ
మ్మించను లేమెండ మిగుల బర్వ,
కమలాస్యముద్దుమొగంబు లే మెరుగులు
మొత్తంబు పరి చుట్టు ముట్టికొనగ,

ధవళాక్షి తొంగలి తరచు రెప్పల చెన్ను
కప్పను చీకటి గవియు చేర,
బెగ్గలం బంత కంతకు నగ్గలింప
నొదవుచెమటతో జిత్తంబు సెదరియెందు
మెలగ దలపేది యా సింహబలుడనంగు
పట్టి యాడెడు జంత్రంబు పగిదినుండె"

పై రెండు పద్యములలో మొదటిది పరాశరమహర్షి నావలో నేగుచు సత్యవతిం జూచినపుడు కల్గిన శృంగార చేష్టితములు- రెండవది కీచకుడు సుదేష్ణా మందిరమున ద్రౌపదిని జూచినపు డాతని కుద్భవించిన శృంగార వికారములు.

మొదటి పద్యమున నన్నయ, జితేంద్రియుడగు పరాశర మహర్షి కట్టి మనోవికారము కల్గుట యనుచితమని తలంచి, ఎట్టి యుత్కృష్ట గుణములుండినను మనోవికారము కల్గునని అర్థాంతర న్యాసముచే సమర్ధించి యున్నాడు.

రెండవ పద్యమున సోమయాజి జారుని ప్రవృత్తిలో నది యుండదుగాన జార స్వభావమునే సంపూర్తిగా వర్ణించినాడు

కాని నన్నయ పరాశర వర్ణనము సఫలీకృత శృంగారస్థాయియైనది. సత్యవతి కన్నియ- అనన్య- ఎట్లయిననేమి, పరాశరు సంగమమున కొడబడినది. పరాశరుడో, యువకుడు - బ్రహ్మచారి వారి కూడిక యుక్తముగానే పరిగణింపబడినది.

కీచకుని విచేష్టిత మట్టిది కాదు. జారుడు, బహు స్త్రీ సక్తుడు, కీచక జాతిజుడు (కీచకులు కలాలీ జాతివారని కొందరి తలంపు). ద్రౌపది అన్యపత్ని మహారాజ్ఞి, వృద్ధ కాన ద్రౌపదీ విషయిక కీచక చేష్టితాభివర్ణనమున నాల్గు దోషము లుద్భవించుచున్నవి.

(1) అమూలకము — సంస్కృత భారతమున కీచకుడు మోహించెననియే కాని విరాళి వర్ణనాదికములేదు.

(2) అనౌచిత్యము—యువతీ విషయికమై యువకునకు విరాళి ఔచిత్యమగును. ద్రౌపదికి పెండ్లినాటికే యున్నవి యిరువదేండ్లును, పిమ్మట పాంచాలపురిలో నొకయేడు, హస్తిపురిలో నైదేండ్లు, ఇంద్రప్రస్థాన ఇరువదిమూడేండ్లు, వనాజ్ఞాతవాసములలో పదుమూడేండ్లు - కాగా, ద్రౌపదిని కీచకుడు మోహించునాటికామె అరువదేండ్లు దాటిన అవ్వయై యున్నది. కొక్కోకాది శృంగారశాస్త్ర గ్రంధములు స్త్రీ పదునారేండ్లవరకు 'బాల', పిమ్మట ముప్పదేండ్ల దనుక 'యువతి', అనంతర మేబదేండ్ల పర్యంతము 'ప్రౌఢ', తదనంతరము 'లోల' సంజ్ఞలతో నొప్పుచుండుననియు లోలయందు శృంగార భావౌచిత్యము కల్గదనియు చెప్పియున్నవి. లోలయగు ద్రౌపది మొగము ముసలి మొగముగును గాని, ముద్దుమొగ మెట్లగును? కీచకునకు ముద్దు మొగముగా నుండెనేమో? లేక, సోమయాజి ఘంటమునకు కాన్పించెనేమో?

(3) ఉత్తమ వనితా విషయమై నీచు దొనర్చు ప్రయత్నములను వర్ణించుట 'అశ్లీలము' అని రసగంగాధరాది అలంకార శాస్త్రగ్రంథములు చెప్పుచున్నవి. 'రాజసూయ మహాధ్వరావభృథ

స్నాత' యగు ద్రౌపదిని కల్లుకుండల నడుమను కూర్చుండు కీచకుడు వలచె నని వర్ణించుట దోషము కాదా ?

(4) రసాభాసము — స్త్రీ పురుష లలో నొక్కరికే యనురాగ ముండి, అన్యుల కనురాగము లేక పోవుటను వర్ణించుట రసాభాసదోష మనబడునని కావ్యప్రకాశాది అలంకారశాస్త్ర గ్రంథ ములన్నియు జెప్పినవి. ఇట కీచకునికే గాని, ద్రౌపదికి కీచకునిపై వలపేది ? కీచకునకు ద్రౌపదిపై వలపుండినట్లు, దమయంతిపై కిరాతకునకును, సీతపై రావణునకును వలపుండినను, నన్నయ, శంభుదాసులు రసాభాసాది దోషభీతు లచే మూలాతిక్రమణముగా, శృంగార రసాతిశయముగా వర్ణింపలేదని తలం తును.

కాని కవిబ్రహ్మ ఇట నిరంకుశ ముగా యథేష్టముగా వర్ణించినాడనియే చెప్పవలయును.

★

చిత్రకళ

శ్రీ మాధవపెద్ది గోపాలకృష్ణ గోఖలే



చిత్రకళా. దీని ప్రయోజనం కొన్ని వేల ఏళ్ళకిందట గుహల్లో నివసించే మనపూర్వులకాలంనుండి ఈనాటి వరకు అనేక వింతవింత రూపాలను దాలుస్తూ

రావటం కనుపిస్తుంది.

కాలక్రమేణా కళలకు ఒక వ్యక్తి నుండి యింకొక వ్యక్తికి ఆలోచనలను భావాలను, భావోద్రేకాలను కలిగించే ఒక అద్భుతశక్తి వుందనీ, కళలద్వారా ఉత్తమ రసానందానికి మానవుడు చేరుకోగలడనీ వుత్తమ కళాకారులు గుర్తించారు.

మన పురాతన శిల్ప చిత్రకళల్ని పరిశీలిస్తే భిన్న భిన్న మత దృక్పథాలు కలిగివున్నా ఒక కళా యుగాన్నుండి యింకొక కళా యుగానికి మానవుణ్ని నాగరికుడిసిగా జేసే అభివృద్ధీ, ఆదర్శాలు, చరిత్రను సజీవంగా వుంచుతూ కనుపిస్తయి ఉదాహరణకు బౌద్ధ యుగంలో కళలవల్ల మానవాభ్యుదయం నాగరికతా ఎంత అభివృద్ధిచెందిందీ ఆ కళాయుగం పదివేల ఏళ్లు సజీవంగా బతికివుంటంతో స్పష్టంగా కనుపిస్తుంది.

అయితే కళలద్వారా మనపూర్వీకులు సాధించిన ఉత్తమ సాంప్రదాయాలు అభ్యుదయమార్గాలు యీనాటి మనచిత్ర కళలో లోపించటం ప్రతి కళాద్రష్ట ఎంతయినా విచారించవలసిందే.

దీనికి కారణం స్వేచ్ఛా వ్యాపార యుగం ప్రారంభమయినాక 200 ఏళ్ళ నుండి స్వలాభం, దమననీతి ఆదర్శాలతో కరడుగట్టిన పరప్రభుత్వం క్రింద బానిసలుగా పడివుంటమే నని మనం స్పష్టంగా గుర్తించాలి.

యీ పరిస్థితుల్లో షుమారు యాభై ఏళ్ళక్రిందట మన చిత్రకళల అధోగతిని గుర్తించి, తిరిగి ఒక నూతన కళా యుగానికి శంఖుస్థాపన చేసింది అబనీంద్రనాథ ఠాకూర్.

యీకృషిమూలకంగా వెలసిన శాంతి నికేతనం (కలకత్తా), బందరు ఆంధ్ర జాతీయ కళాశాల మొదలయినవీ ఇంకా కొద్దిపాటి గవర్నమెంటు కళాశాలల వల్ల మళ్ళీ చిత్రకళలు ప్రచారంలోకి వచ్చినై. అనేకమంది చిత్రకారులు తయారైనారు. ఇటీవల చిత్రకళా విమర్శలుకూడా చురుగ్గా సాగుతున్నయి.

అయితే మనది బానిసదేశం అవటం వల్ల నూతన కళాసృష్టికి ఎన్నయినా ప్రతిబంధకాలు లేకపోలేదు. కాని యీ బానిస శృంఖలాలను బద్దలుచేయటానికి చిత్రకారుని బాధ్యత ఎంత ఎక్కువగా వుందీ ప్రతి చిత్రకారుడూ గుర్తించి తీరాలి.

కాని యీనాడు మన చిత్రకారుల పోకడలు రెండు విధాలుగా వున్నయి.

ఒకటి ప్రాచీన కళావిశిష్టతలను మట్టుకే పొగడుకుంటూ తృప్తిపడి అవే నకలు పంధాలను నికృష్టంగా చిత్రిస్తూ నూతనకళాసృష్టి ప్రయోజనాలకు తిరుగుముఖాలు చూపటం. రెండవది డబ్బే ప్రధానంగా బానిసవృత్తిలో జీవించటానికి అలవాటుపడటం. యీ పైరెండు విధానాలవల్ల ఎవరయినా తాము చిత్రకారులమని ఆత్మవంచన చేసుకుంటున్నా వుత్తమ కళాసృష్టికి నిరోధకులుకావటం మట్టుకు నిజం.

అబనీంద్రనాథ ఠాగూర్ "ఏ కళా బోధకయినా ప్రాచీన సాంప్రదాయాలను

(మిగతా 36 పేజీలో)

అరుణతార పొడిచింది

శ్రీ 'రాంషా'

బోయీల్ మోసే పూలపల్లకీ!
కూలీల్ కట్టిన రాజభవనమూ!
రాజులు ఎక్కే సింహాసనమూ!
న్యాయం చెప్పే మునసబులారా!
స్వేచ్ఛను అణచే జైలధికారీ!
గుర్తించండోయ్ గుర్తించండి!

మీ బధిరాంధక అధికారంలో
అడుగున నలిగి, ప్రక్కకు అణిగి
రోదించే ఆ బానిసజీవుల
ఆక్రందన ఆర్తరావం
గుర్తించండోయ్ గుర్తించండి.

మీ బధిరాంధక అధికారంలో
స్వార్థంతో చేసిన మీ ద్రోహం
అణచిందీ అమాయకుల్ని.
రాచటీకం నాదేనంటూ
తలకోసే సైనికఖడ్గాల్
స్వతంత్రమే నాదేనంటూ
బంధించే ఇనుప గొలుసులూ,
అధికారం నాదేనంటూ
ఉరివేసే దండననీతీ,
మహారాజుల భూషణమంటూ
సామాన్యుని పీల్చే తురాయి
కొరడాలు, తుపాకిగుండ్లూ
ఇవ్వన్నీ రాజరికాలా?
—ఇవ్వన్నీ ఇకపై నిలవవు.

సామాన్యుని ప్రతీకారమిక
ప్రజ్వలమై జ్వాలల చిమ్మి
అధికారుల నిరోధకశక్తులు
తక్షణమే మారణహోమం
తక్షణమే మారణహోమం
చేస్తాయని గుర్తించండి.

ఎన్నెన్నో నామాల్ రూపాల్
ధరియించెను రాక్షసతత్వం
చీకటియై, పిశాచగణమై,
ఫాసిజమై, సామ్రాజ్యమ్మై
చెలరేగుట లింక భరింపం.
సామ్రాట్టుల దౌర్జన్యాలను
దూషించును దేవుడు, నరుడు!
బానిసలై కటకటలాడే
జాతులకే నెత్తురు పొంగెను;
చిరకాలపు తీరని కోరిక
నిరాశతో గుండెలు చీల్చెను—
కరుణించిన మానవ ప్రేమలు
భరియింపక నేల కూలినవి!
రెపరెపమండీ కరుణ కాలినది—
కన్నీరిక కార్చం వాటికి
రాకాసికి దండం పెడుతూ
స్తుతిచేస్తూ కూచోం ఇకపై
గర్జించిన తణుకుల నిదిగో
పూజించిన దయ్యాన్నిపుడే
తక్షణమే హోమం చేస్తాం.

తిరుగుబాటు చెలరేగిందిదిగో,
అదిగదిగో కోటలు కూలెను
అరుణతార పొడిచిందిక.
మానవుడా ! పోయిందేమిటి ?
బంధనములు, బందెలదొడ్డీ;
శాసనములు దండన లిక్షపై
లేవయ్యా ఓ మానవుడా !
మానవులే ఒకటై, సమమై
కులాల, తెగలన్, జాతుల తెంపీ
పరశురాములై 'రాజులత్రోసీ
ఆటనుకట్టీ', ప్రజాస్వాములై
భూక్షేత్రం పండిస్తారు.

[French Revolution ఇచ్చిన అనుభూతితో Shelly వ్రాసిన గీతంలో శతాంశం ఇచ్చిన బలంతో.]

చి త్ర క ళ

(34 వ పేజీ తరువాయి)

ఆధారంగా చేసుకొని కొన్ని కట్టుదిట్టాలను ఏర్పరుచుకోటం అవసరమేగాని వాస్తవ ప్రపంచంలోనికి స్వతంత్రుడైన చిత్రకారుడు ప్రవేశించినాక ఒక నూతన సృష్టిని సాధించి తీరాల్సిందే"నన్నాడు.

యీ అమూల్య సందేశాన్ని చిత్రకళాభ్యాసానికి పూనుకున్న ఏ వ్యక్తి అయినా ప్రాథమికదశలోనే అర్థం చేసుకోవలసిన బాధ్యత ఎంతయినా వుంది.

ఎలాజరగాలి ఈనూతనసృష్టి? అంటే మట్టుకు 'వాస్తవిక జగత్తు' నుంచేనని చెప్పాలి. ఎక్కువభాగం ఆర్థిక చిక్కులకు లోనైవున్న చిత్రకారులకు యింత కన్న వేరుమార్గం లేదు.

"ఒకచిత్రాన్నిగురించి నువ్వూ నేను ఏమనుకుంటున్నామనే దానికంటె ఎక్కువమంది ప్రజలు ఏమనుకుంటున్నారనే విషయానికి ప్రాధాన్యత నివ్వటం అభ్యుదయమార్గ"మని లెనిన్ మహాశయుడు చెప్పాడు.

ఇహ ఎక్కువమంది ప్రజలు ఏ చిత్రాన్నయినా ఎలా అర్థం చేసుకుంటారనే విషయానికొస్తే యీ నాటి వన జాతికి, సంఘానికి సంబంధించిన క్లిష్ట సమస్యలను జీర్ణించుకొని మన జాతిని ఉన్నత స్థానాలకు తీసుకుని వెళ్ళే సంకల్పంతో చిత్రకారులు కళాసృష్టికి పూనుకుంటే ప్రజలు యీ కళలను తమవిగా గుర్తించి కళాకారుల్ని సమీపించగలుగుతారు చరిత్ర సజీవమవుతుంది. ఇదే సర్వమానవ కళానందానికీ పునాదిరాయి

బలిదానం

[ఠాకూర్ 'Sacrifice' కు అనువాదం]

మూలం: **శ్రీ గురుదేవుడు** ★ తర్జుమా: **శ్రీ జగ్గయ్య**

—: పాత్రలు :—

రఘుపతి	— పూజారి	చందపాలుడు	— ఉపసేనాని
జయసింగ్	— పూజారి పెంపుడుబిడ్డ, దేవీభక్తుడు	మహామంత్రి	—
		గుణవతి	— మహారాణి
గోవిందుడు	— త్రిపురదేశపురాజు	అపర్ణ	— బీదబాలిక
నక్షత్రుడు	— రాజుతమ్ముడు	పరిచారిక	—
నయన్‌రాయ్	— సేనాపతి	పౌరులు	—

౧

[త్రిపురానగరిలో ఆలయప్రాంగణం
ప్రవేశం: మహారాణి గుణవతి]

గుణ : తల్లీ! కాత్యాయనీ! నేనేం అపచారంచేశాను? కడుపుకూటికై కన్నబిడ్డలను తెగనమ్ముకునే ముష్టివాళ్ళకీ, పరువుకోసం పసిపాపలను హత్యచేసే వ్యభిచారిణులకూ గంపెడుబిడ్డల్ని ప్రసాదిస్తావు. నేనో, మహారాణిని సర్వప్రపంచమూ నాపాదాలదగ్గర మోకరిల్లుతోంది! అయినా, నాబిడ్డను హృదయానికి హత్తుకుందామనీ, నాప్రాణానికి ప్రాణమైన పసికందును మనసారా కౌగిలించుకుందామనీ తపించిపోతున్నాను ఆపవిత్రమాతృత్వానికి దూరంకావడానికి నేనేం పాపం చేశానుతల్లీ! [ప్రవేశం: రఘుపతి] స్వామీ మాతృపూజావిషయంలో నేనెన్నడైనా అశ్రద్ధ చేశానా? నిషానియమాలలో మహారాజు అగ్నివంటివారే! అయినా, జగన్నాటక సూత్రధారిణి అయినతల్లి, యీగొడ్డటికం నానుదుట ఎందుకు వ్రాసిందిస్వామీ!

రఘు : తల్లి శక్తి స్వరూపిణి. ఆమె లీలలు విచిత్రమైనవి. మన సుఖదుఃఖాలు ఆమెకు లీలావిలాసాలు ఓర్పువహించాలి తల్లీ! ఇవాళ దేవి సంతృప్తికోరకు నీపేరిట ప్రత్యేకమైన బలి ఏర్పాటు చేద్దాం.

గుణ : కృతజ్ఞురాలనుస్వామీ! ఎర్రని మందారాలనూ. మదించిన బలిపశువులనూ యిదివరకే పంపాను ఈపాటికి వస్తూ ఉండాలి

[ప్రవేశం: మహారాజు, జయసింగ్, అపర్ణ]

జయ : ఏమి సెలవు మహారాజా!

గోవిం : జయసింగ్, ఈబాలిక అప్యాయంగా పెంచుకొంటోన్న మేకపిల్లను బలవంతంగా తీసుకువచ్చి చంపారట—నిజమేనా? తల్లి యిలాంటి కానుకల నంగీకరిస్తుందా?

(6)

జయ! మహారాజా! ఆలయ పరిచారకులు, నిత్య నైవేద్యంకోసం ఎక్కడెక్కడ పశువుల్ని తీసుకొని వస్తారో మా కెలా తెలుస్తుంది?....ఏడుస్తావెందుకమ్మా! తనకు తానై తల్లి స్వీకరించిన దానికొరకు కన్నీరు కార్చడం భావ్యమా?

అపర్ణ: తల్లీ! దానికి నేనే తల్లిని. నేను యింటికి రావడం కొస్త ఆలస్యమైతే, మేత మాని వీధివంకే దృష్టులు సారించి, అరుస్తూండేది. ఇంటికిరాగానే, దాన్ని ఎత్తి ముద్దాడి—యిద్దరమూ కలిసి అన్నం తినేవాళ్ళం. దానికి నాకంటె మరొక తల్లిలేదు.

జయ: మహారాజా! నా ప్రాణాన్నైనా వెచ్చింగి, ఆ మేకపిల్లను బ్రతికించడానికి వీలుంటే, సంతోషంతో ఆపనిచేస్తాను. కాని, తనకుతానై తల్లి స్వీకరించిన వస్తువును నేనెలా తీసుకురాగలను?

అపర్ణ: తల్లి స్వీకరించిందా? అబద్ధం అది తల్లికాదు రాక్షసి!

జయ: ఆ, ఆ, దైవదూషణ!

అపర్ణ: తల్లీ! ఒకానొక భిక్షుక బాలిక ప్రేమనిధానాన్ని దొంగిలించడమేనా నీ ధర్మం? అయితే, నిన్ను శిక్షించగల అధికారం ఎవరికుంది? ..ప్రభూ చెప్పండి.

గోవిం: ఏమని చెప్పను తల్లీ! నా కేమీ తోచటంలేదు.

అపర్ణ: ఇదిగో, యీ మెట్లపై దిరజాతే నెత్తుటి చారలు నా చిట్టివేనా? అయ్యో! చిట్టీ! ప్రాణరక్షణకై నీవు పరితపించి పోయినపుడు, నీ ఆక్రందనం, యీ బధిర జగత్తుగుండా నాహృదయాన్నెందుకు చేరలేక పోయింది?

జయ: (విగ్రహంవైపు తిరిగి) కాళీ మాతా! బాల్యంనుండీ నిన్ను నేను సేవిస్తున్నాను; అయినా నిన్ను అర్థం చేసుకోలేక పోయాను. దయఅనేది దుర్బలులైన మర్త్యులకేగాని, దేవతలకు లేదా? అపర్ణా! నాతోరా శక్తికొలదీ నీకోసం పాటుపడతాను. దేవతలు తృణీకరించినచోట మానవుడే తోడుపడాలి.

[జయసింగు, అపర్ణ నిష్క్రమణ

—౨—

[ప్రవేశం. రఘుపతి, నక్షత్రుడు, ఇతరులు]

అందరు: జయము జయము మహారాజా!

గోవిం: సావధాన! ఈ రోజునుండి ఆలయంలో రక్తపాతాన్ని శాశ్వతంగా నిషేధిస్తున్నాము.

మంత్రి: దేవికి బలి నిషేధిస్తున్నారా?

సేనాని: బలి నిషేధమా?

నక్ష: ఏమిటీ ఘోరం? బలి నిషేధించడమే?

రఘు: ఇది కలా నిజమా?

గోవిం: కలకాదు ఆచార్యా! దివ్య చైతన్యం. తల్లి, ఒకబాలిక రూపంలో నా కగుపించి, తానురక్తపాతాన్ని సహించలేనని చెప్పింది.

రఘు: యుగయుగాలుగా తల్లిరక్తపానం చేస్తున్నదే. ఈ ఆకస్మిక వైముఖ్యమెలా కలిగింది?

గోవిం: లేదు, ఆమె ఎన్నడూ రుధిర పానం చేయలేదు. ఆదినుండీ ఇందుకామె విముఖంగానే ఉన్నది

రఘు: రాజా! నిన్ను నేను హెచ్చరిస్తున్నాను. బాగా ఆలోచించుకో. శాస్త్ర విహితములైన ఆచారాలను మార్చడానికి నీ కధికారంలేదు

గోవిం: దైవానుదేశం శాస్త్రవిధికి అతీతమైనది.

రఘు: హూ. అవివేకానికి తోడు అహంకారం కూడానా? సిగ్గులేక, దైవసందేశం నాకు వినబడకుండా నీకు మాత్రమే వినిపించిందని చెప్పవచ్చావా?

నక్ష: నిజమే ఆచార్యులవారికి వినిపించకుండా, దైవసందేశం మహారాజుకే వినిపించడం విచిత్రంగా ఉంది!

గోవిం: దైవసందేశం జగత్తులో సర్వదా ధ్వనిస్తూనే ఉన్నది అహంభావంలో చెవులు పూడిపోయిన వారికి వినిపించక పోవచ్చు!

రఘు : నీవు నాస్తికుడవు! మత భ్రష్టుడవు!

గోవిం : శాంతించండి ఆచార్యా! పూజా సమయం ఆసన్నమైనది. వెళ్ళి—ఇకనుండీ జగన్మాత అర్చన కొరకై రక్తపాతం జరిపే వారికి దేశాంతరవాస శిక్ష విధింపబడుతుం దని ప్రకటించండి.

రఘు : ఇదే నీ అంత్య నిర్ణయమా?

గోవిం : అవును

రఘు : ఛీ! పాషండుడా! గర్వోన్మత్తుడవై, నీ రాజ్యంలో వెలసిన జగన్మాతను, నీ ప్రజలలో ఒకతెగా పరిగణిస్తున్నావా? నీ శాసనాలతో ఆమెను బంధించి, దోచుకోవాలని తలపోస్తున్నావా? నీకది సాధ్యంకాదు! జగన్మాత పాదోపాసకుడను. నేను ప్రకటిస్తున్నాను. ఎన్నటికి నీకిది సాధ్యంకాదు.

[నిష్క్రమిస్తాడు.

సేనాని : క్షమించండి ప్రభూ! మీకీ అధికారమున్నదా?

మంత్రి : ప్రభూ! మీఆజ్ఞ నుపసంహరించుకోడానికి సమయమింకా మించిపోలేదు.

గోవిం : సామ్రాజ్యంలో విస్తరించేపాప బీజాన్ని నిర్మూలించడానికి జాగుకూడదు.

మంత్రి : పాపం యింత దీర్ఘకాలం వర్ధిల్లగలదా? దేవిపాదసన్నిధిని వయోవృద్ధములైన యీఆచారాలన్నీ పాపభూయిష్టములనా మీఉద్దేశ్యం.?

[రాజుమౌనం

నక్ష : కాదు కాదు అవి పాపభూయిష్టం కాజాలవు.

మంత్రి : మనపూర్వులందరూ భక్తిప్రపత్తులతో యీఆచారాల ననుష్ఠించారు. మీరు వారిని అవమానింపజూస్తున్నారు.

[రాజు ఇంకామౌనం.

సేనాని : యుగయుగాలుగా స్థిరపడి పోయినవాటిని మార్చడానికి మీకుహక్కున్నదా ప్రభూ!

గోవిం : మీ ధర్మసందేహాలనిక కట్టిపెట్టండి. వెళ్ళి, రాజ్యం నలుదిక్కులా మా ఆజ్ఞను ప్రకటించండి.

మంత్రి : కాని ప్రభూ. మహారాణీవారు యీపూట పూజకై ప్రత్యేక బలిని పంపించారు ఆలయ ప్రాంగణాన బలి సిద్ధంగా ఉన్నది.

గోవిం. అయితే, వాటిని వెనక్కిమళ్లించండి

[నిష్క్రమణ

మంత్రి : ఉస్! ఇదంతా అయోమయముగా ఉంది

నక్ష : అయితే మనంకూడా బౌద్ధమతస్థులవలె మనుషుల్నీ, జంతువుల్నీ సమదృష్టితోచూసి, వ్యవహరించాలన్నమాట! ఏం విపరీతం!

[నిష్క్రమిస్తారు.

3

[ప్రవేశం; రఘుపతి; అర్ఘ్యపాద్యంతో జయసింగు అతణ్ణి అనుసరిస్తాడు.]

జయ : స్వామీ!

రఘు : ఇక్కడనుండి వెళ్ళిపో!

జయ : అర్ఘ్యపాద్యమిదిగో

రఘు : అక్కరలేదు.

జయ : మీపరీధానం!...

రఘు : దూరంగా తీసుకుపో!

జయ : నేనేమైనా అపచారం చేశానా తండ్రీ!

రఘు : అబ్బబ్బా! నన్నువిడిచివెళ్లు.... దుష్టశక్తులు విజృంభిస్తున్నాయి. అహంభావ వర్ధితమైన రాజపీఠం దైవపీఠాన్నే తలదన్నజూస్తున్నది! ఓ కలియుగ దేవతలారా. మీరుకూడా, పరిజనులవలె, శిరస్సులొగ్గి, రాజశాసనాలకు లొంగిపోతారా? మానవులూ, దానవులూ ఏకమై యీ ప్రపంచంలో దైవసామ్రాజ్యాన్ని నిర్మూలం చెయ్యడానికి నడుములుబిగిస్తే-దేవతలు స్వప్రతిష్ఠ కాపా

డుకోలేనంతటి దుర్బలులైనారా? దేవతలు శక్తిహీనులైనా బ్రాహ్మణులింకా శక్తిమంతులుగనే ఉన్నారు. ఈభయంకర బ్రాహ్మణ కోపాగ్నిలో రాజసింహాసనం కేవలమొక యింధనమై నశించగలదు... .. జయసింగ్! నాకు మతిభ్రమణం కల్గుతోంది.

జయ : ఏమి జరిగింది తండ్రీ!

రఘు : చెప్పటానికి నాకు నోరురావడం లేదు. తిరస్కృత అయిన అతల్లినే వెళ్ళి అడుగు

జయ : తిరస్కృతా? ఎవరిచేత?

రఘు ; మహారాజుచేత-

జయ : మహారాజు కాళీమాతను తిరస్కరించాడా?

రఘు ; అవును. క్షణికమైన సింహాసనాన్ని చూసుకొని నన్నూ, నన్నూ, సర్వశాస్త్రాలనూ, సర్వదేశాలనూ, సర్వకాలాలనూ. కడకు-అనంత కాలవాహినికధి దేవతయైన మహాకాళిని సైతమూ ధిక్కరించాడు.

జయ . మహారాజే!

రఘు . అవునవును! నీమహారాజే! నీకు ప్రియాత్రియమైన మహారాజే! ఓరి కృతఘ్నుడా! మనసారా నిన్ను ప్రేమించి పెద్దవాడిని చేశాను. కానినాకంటె నీకామహారాజే ప్రేమపాత్రుడైనాడు చివరకు

జయ : పసిబిడ్డ, తండ్రి ఒడిలో కూర్చుని నిండు జాబిల్లివంక చేతులు చాస్తుంది. స్వామీ! మీరు నా తండ్రి; మహారాజే జాబిల్లి .. అయితే, మహారాజు ఆలయంలో బలిని నిషేధించాడని నేను విన్నది నిజమే నన్నమాట! కాని, ఇందుకు మనం సమ్మతించలేము.

రఘు : సమ్మతించనివారికి దేశబహిష్కారమే శరణ్యం సుమా!

జయ : మాతృపూజకు అవరోధం కలిగే దేశాన్ని విడచి వెళ్ళడమే శ్రేయస్కరం. లేదు, నా కంఠంలో ప్రాణమున్నంతవరకూ దేవీ పూజకు విఘ్నం సంభవించడానికి వీల్లేదు. [నిష్క్రమిస్తారు]

౪

[ప్రవేశం. గుణవతి పరిచారిక, ప్రదేశం: అంతఃపురం]

గుణ : ఏమన్నావ్? మహారాణి పంపిన నైవేద్యాన్ని తిరగగొట్టారా? అంతసాహసం చెయ్యగలిగిన వాళ్ళెవరే యీ రాజ్యంలో? చెప్పు, ఎవరే ఆ నీచుడు?

పరి : అమ్మో నాకు భయమువేస్తోంది

గుణ : నేను అడుగుతున్నకూడా నీకు భయమే! ఎవరినిచూసి నీకా పిచ్చి భయం?

పరి . క్షమించండి.

గుణ : నిన్నటిరోజుకూడా వందిమాగధులు వేయివిధాల నన్ను ప్రస్తుతించారు, ఆచార్యులు ఆశీర్వదించారు, పరిజనులు నా ఆజ్ఞలను ఔదలదాల్చి ఆచరించారు కాని, యీ అనతికాలంలోనే పరిస్థితులెంత తారుమారైనాయి! దేవికి పూజానిషేధం, మహారాణికి తిరస్కార పరాభవం! అయ్యో! త్రిపురదేశం స్వప్న రాజ్యమై పోయిందా? పో. వెళ్ళు. ఆచార్యులవారి నిటు పిలుచుకొనిరా!

[పరిచారిక నిష్క్రమణ.

[ప్రవేశం: గోవిందుడు.]

గుణ : విన్నారా ప్రభూ! తల్లిపూజకై నేను పంపిన నైవేద్యాన్ని తిరగగొట్టారు.

గోవిం : అవును నాకు తెలుసు.

గుణ : మీకు తెలుసా? తెలిసీ, యీఅవమానాన్ని సహించారా?

గోవిం : అపరాధిపక్షాన, నేను నీక్షమాభిక్షమర్థిస్తున్నాను.

గుణ : ప్రభూ! మీహృదయం దయాతరంగితమని నేనెరుగుదును. కాని ఇదిదయ కాదు. దౌర్బల్యం. మీకు శక్తిచాలకపోతే, నేనే శిక్ష విధిస్తాను. అపరాధి యెవరో చెప్పండి.

గోవిం . నేనే దేవీ! నీకు బాధకలిగించడంతప్ప, నేనుచేసిన అపరాధంవేరులేదు!

గుణ: నాకేమీ అర్థం కావడంలేదు.

గోవిం. నేటినుండీ యీదేశంలో ఆలయాలలో జంతుబలి నిషేధింపబడింది.

గుణ ఎవరు నిషేధింపారు?

గోవిం. జగన్మాత!

గుణ. జగన్మాత ఎవరితో చెప్పింది?

గోవిం: నాతోనే!

గుణ. మీతోనా! హహహా! నాకునవ్వు వస్తోంది. సర్వలోకాలకూ అధినేత్రి అయిన తల్లి, త్రిపురదేశాధీశ్వరునితో, వచ్చి మొర పెట్టుకుంటుందా?

గోవిం. మొరపెట్టుకోవడంకాదు, తన వేదన అంతా వెళ్ళగ్రక్కింది.

గుణ: మహారాజా! మీఆధిపత్యం ఆలయ సీమకు ఆవలనే సుమా! అక్కడకూడా మీ అధికారం చెలాయింపచూస్తే, నిష్ఫలంకాక మానదు.

గోవిం. అధికారం నాదికాదు, తల్లిదే!

గుణ: మీనిర్ణయంలోనే మీకు విశ్వాసముంటే. మీరే దాన్ని రక్షించండి నన్ను కూడా ఎందుకు బాధిస్తారు? నాయిష్టం వచ్చిన రీతిగా నన్ను దేవీపూజ జరుపుకోనీయండి

గోవిం: ఆలయంలో జంతుబలి జరగనీయనని తల్లికి వాగ్దానం చేశాను; నేనుదాన్ని నెరవేర్చితీరాలి.

గుణ: వంద దున్నపోతులనూ, మూడు వందల మేకపిల్లలనూ బలియిస్తానని నేనూ తల్లికి వాగ్దానం చేశాను; నేను దాన్ని నెరవేర్చితీరతాను.

గోవిం: సరే

[తలపంకించి, నిష్క్రమణ.

[ప్రవేశం; రఘుపతి]

గుణ: గురుదేవా! నేను పంపిన కానుకలను తిరగగొట్టివేశారు!

రఘు: దీనాతిదీనుడైన ఒకానొక భిక్షకుని కానుకకూడా నీకానుకతో సమానమే తల్లికి. కాని మహారాణీ! ఆతల్లికే యిప్పుడు అవమానం జరిగింది. అధికార విషలిప్తమైన యీరాజబ్రువుని గర్వాతిశయం, దేవీ భక్తులపై నిప్పులు చెరుగుతూ, కాఱుమబ్బు పలె దైవప్రతిభనే కప్పివేయజూస్తున్నది.

గుణ: దీని పరిణామమెలా ఉంటుందో స్వామీ!

రఘు. స్వీయస్వప్నాలతో జగద్రచన సాగించే ఆతల్లికే తెలియాలి ఆవిషయం. కాని, ఒకటిమాత్రం నిజం. గర్వాతిరేకంచే, మాతృపీఠాన్ని మలినపరచాలని చూసే యీ రాజసింహాసనం, బద్దలై శూన్యంలో లయంకాక తప్పదు

గుణ: అయ్యో! రక్షించండి స్వామీ!

రఘు: హహహా! రక్షణ! భూ, భువర్లోకాలు రెండూ తన సామ్రాజ్యఖండాలనే అహంకృతితో, దైవ బ్రాహ్మణులు తన ముందు దాసోహమని తీరాలని విఱ్ఱవీగే రాజహంసకు పట్టమహిషికా రక్షణ! ఛీ! ఎంతఅవమానం! నిష్ఫలమైన బ్రాహ్మణ శాపం, అతణ్ణే అధోగతికి నెట్టుకుపోయే కలికాలం దాపురించింది (యజ్ఞోపవీతం తెంచబోతాడు.)

గుణ (వారిస్తూ) అంత సాహసం చెయ్యకండి స్వామీ!

రఘు. అయితే, బ్రాహ్మణాధికారాన్ని తిరిగి నిలబెట్టగలవా?

గుణ. అవశ్యం స్వామీ! ఇంకమీరువెళ్ళి పూజ ప్రారంభించండి. ఏవిఘ్నమూ జరగకుండా చూస్తాను.

రఘు. నీభక్తి ప్రపత్తులకు నాకెంతో ఆనందంగా ఉన్నదమ్మా! నీ ఒక్క చల్లని చూపుతో దేవికి పరాభవముతప్పింది; పవిత్రమైన బ్రాహ్మణ ధర్మమూ నిలిచింది. చిరకాలం వర్ధిల్లు తల్లీ!

[నిష్క్రమణ

గోవిం. (ప్రవేశించి) దేవీ! కుటిలమైన నీ భ్రుకుటి నా హృదయంలో నీలినీడలు పరుస్తోంది.

గుణ: అయ్యో! వెళ్ళిపోండి! యీ కొంపకు మరింత అనర్థకం తెచ్చిపెట్టకండి.

గోవిం: గృహిణి చిరునవ్వే సర్వానర్థ కాలకూ సమ్మెట పెట్టు. ఆమె ప్రేమే స్వర్గ సీమ!.. దేవీ!

గుణ: వెళ్ళిపోండి! అబ్బా! ఇక్కడకు రాకండి.

గోవిం: సరేదేవీ! నీవునన్ను ఆహ్వానించి నప్పుడే వస్తాను.

గుణ: (రాజుపాదములపైబడి) మన్నించండి ప్రభూ! స్త్రీ ప్రవృత్తిని మన్నించడం మరచిపోయేటంతటి కఠినులైనారా మీరు? నిరాకృతమైన ప్రేమ క్రోధంగా మారుతుందని మీకు తెలియదా ప్రభూ.

గోవిం. దేవీ! నిన్ను నమ్మకపోతే నాకు జీవితమే భారం ప్రియా! ఈ మేఘచ్ఛాయలు క్షణభంగురాలే సుమా! ఉజ్జ్వలమైన సూర్యరోచి ఒకటే నిత్యమైనది

గుణ. అవును ప్రభూ! మేఘాలు చెదిరిపోయేవే, నిత్యమైన సూర్యరోచిస్సు ఒకటే సార్వకాలికమైన సాంప్రదాయాలపై ఉజ్జ్వలంగా ప్రకాశిస్తుంది అందుచేతనే ప్రభూ! బ్రాహ్మణులకు వారి ఆశ్రమధర్మాలు నిలబడేలాగు, దేవికి అర్చన జరిగేలాగు, రాజాధికారం భూవలయంలో పరిమితమయ్యేలాగు, ఆదేశించండి.

గోవిం: దేవీ! విశ్వశ్రేయస్సుకు భంగం కల్గించడం బ్రాహ్మణధర్మం కాదు; భూలకోటి రుధిరం దైవపూజకు నైవేద్యంకాదు ఇక సత్యాన్నీ, ధర్మాన్నీ, సంస్థాపించడానికి రాజుకైనా, రైతుకైనా సమానమైన హక్కు ఉన్నది.

గుణ: ప్రభూ! మీపాదాలనంటి ప్రతిమాలుతున్నాను; నామాట వినండి. యుగయుగాలుగా పారంపర్యంగావచ్చే ఆచారాలపై రాజులకధికారంలేదు అవిసార్వజనీనమైనవి. అయినా, మీప్రజలందరితరపునా చేతులు కట్టుకొని మిమ్మల్ని వేడుకుంటున్నాను; నా మాటవినండి అయ్యో! ప్రేమమయి అయిన మీపట్టమహిషి ప్రార్థనలకు మీమనసు కరగడం లేదా? మీహృదయమంత కఠినమా, అయితే, వెళ్ళండి. మీ ఇష్టం వచ్చినరీతిగానే వ్యవహరించండి

[నిష్క్రమణ.

౨

[ప్రవేశం: రఘుపతి, జయసింగు, సేనాని]

రఘు: సేనాపతీ! తల్లిపట్ల నీకుగల భక్తిప్రపత్తులు అపారమైనవి.

సేనాని: మావంశానికది ఉగ్గుతో పెట్టినది స్వామీ!

రఘు. ఆపవిత్రభక్తియే నీకు తఱుగని ధైర్యం చేకూర్చునుగాక! అరివీర భయంకరమైన నీకరాళఖడ్గానికి నిగ్గులుకూర్చి దుష్టప్రాపంచికశక్తులను సమయింప జేయునుగాక!

సేనాని: ఆచార్యుల ఆశీస్సులు అమోఘమైనవి

రఘు: అయితే సేనాపతీ! నీసైన్యాలనన్నిటినీ సమీకరించి, దైవద్రోహులను నిర్మూలించాలని ఆదేశిస్తున్నాను.

సేనాని: ఎవరుస్వామీ! ఆదైవద్రోహి?

రఘు: మహారాజు!

సేనాని: మన మహారాజా?

రఘు: అవును. సైన్య సహాయంతో అతణ్ణి ఎదిరించాలి.

సేనాని: అది అధర్మం స్వామీ! మీరు నన్ను పరీక్షిస్తున్నారా ఆచార్యా?

రఘు. అవును, పరీక్షిస్తున్నాను. నీహృదయ యాథార్థ్యాన్ని తెలుసుకోడానికే పరీక్షిస్తున్నాను. సేనాపతీ! ఇంక సందేహానికి తావులేదు జగన్మాత నిన్ను శాసిస్తున్నది. ఈ ప్రాపంచిక బంధాలన్నీ సడలించుకోవాలి!

సేనాని: ఆచార్యా! నాకేసందేహమూ

లేదు. జగన్మాత నాకు నియోగించినధర్మాన్నే దృఢబుద్ధితో నెరవేరుస్తాను.

రఘు : సేనాపతీ! నీవు మహాయోధుడవు

సేనాని : స్వామిద్రోహం చేయమని నన్నే శాసిస్తున్నదా తల్లి? జగన్మాత భక్తులలో నేనంతటి అధమాధము ణ్ణయిపోయానా? అసలు జగన్మాత, మానవహృదయ విశ్వాసం పైననేగదా వెలుగుతూంది! ఆ విశ్వాసమే విడనాడమని నన్ను ప్రోత్సహిస్తున్నదా తల్లి? అయితే. ఇవాళ రాజద్రోహమూ, రేపు మాతృద్రోహమే సంభవిస్తుంది.

జయ. ఆహా! దివ్యవచస్సు!

రఘు : సేనాపతీ! మహారాజే మాతృద్రోహిగా పరిణమించినప్పుడు నీకు రాజద్రోహశంక దేనికి?

సేనాని : నన్ను తర్కంలోనికి దించకండి ఆచార్యా! నాకు ఒకే ఒకమార్గం తెలుసు. అది—సత్యం, విశ్వాసం! ఆచార్యా! ఈ దేవీ భక్తుడు ఆశవ్యపథాన్ని తప్పలేడు!

[నిష్క్రమణ

జయ : స్వామీ! మనంకూడా అతనివలెనే దృఢ విశ్వాసంతో మెలగుదాం. దైవకార్యాన్ని సాధించడానికి మనలోనే అజేయమైన శక్తి కెరలి వడుతుండగా, సైన్య సహాయ మాశించడమెందుకు? ఆలయ ద్వారాలను బారలుగా తెరవండి స్వామీ! భేరీ మ్రోగించండి! .. రండి! రండి! ఓ పౌరులారా! వచ్చి, సర్వభయహారిణియైన జగన్మాత నారాధించండి! రండి!

[ప్రవేశం : పౌరులు]

ప్రథముడు : రండర్రా, రండి! అమ్మోరి జాతరకు రండ్రా!

అందరు : జై కాళీమాతకు జై! (నృత్యం చేస్తూ పాడుతారు.)

జయ : అడిగో రాజభటులు, మహారాణి పంపిన బలి పశువులను తోలుకొస్తున్నారు.

అందరు : భవానీ మాతకూ జై! మహారాణికి జై!

రఘు : జయసింగ్, త్వరగా పూజా సన్నాహాలు చెయ్యి.

జయ : సర్వం సిద్ధంగానేఉంది స్వామీ!

రఘు : వెళ్ళి, నేను పిలుస్తున్నానని చెప్పి, యువరాజు నక్షత్రుణ్ణి తీసుకునిరా!

[జైసింగు వెళ్తాడు పౌరులింకా పాడుతూ ఆడుతుంటారు.]

గోవిం : ఆగండి! రఘుపతీ! మా ఆజ్ఞోల్లంఘనం చెయ్యడానికే సాహసిస్తున్నావా?

రఘు : అవును.

గోవిం : అయితే, దేశబహిష్కృతి తప్పదుసుమా!

రఘు : లేదు. నాదేశం యిది కాదు. ఎక్కడ రాజాధికారం రవ్వంతైనా వర్ధిల్లదో ఆదే నాదేశం!....ఓపౌరులారా! మీమీ కానుకలు తీసుకురండి! దేవినర్చించండి!

[భేరీ మ్రోగుతుంది.

గోవిం : ఆగండి! (పరిజనులతో) సేనాపతిని తీసుకొనిరా....రఘుపతీ! దైవ స్వామ్య రక్షణకోసం సైనికులను రప్పించే అవసరం కల్పిస్తున్నావు మాకు! అదిలజ్జాకరంకాదా? ఆయుధబలం మానవుని దౌర్బల్యానికి సూచనసుమా!

రఘు : ఓయి నాస్తికుడా! ప్రళయభీకరమైన శాపశక్తి బ్రాహ్మణులలో నశించిందనే అనుకుంటున్నావా? లేదు, లేదు. లోకమారకమైన తదగ్నిజ్వాలికలు నా హృదయాన్నుండి వెలికిదూకి నీసింహాసనాన్ని భస్మీపటలం చేయకమానవుసుమా! లేకపోతే, యీధర్మ గ్రంథాలనూ, నా బ్రాహ్మణాతిశయాన్నీ దైవంపేరిట ఆలయపీఠాల నధిష్ఠించే యీకల్పిత వస్తురాశినీ-సర్వమూ అగ్గిపాలు చేస్తాను!

[ప్రవేశం : సేనాపతి, ఉపసేనాని చంద్రపాలుడు.]

గోవిం సేనాపతీ! సైనికసహాయంతో, ఆలయంలో జంతుబలి జరగకుండా చూడండి,

సేనాని : క్షమించండి మహారాజా! దేవాలయంలో రాజసేవకుల కధికారంలేదు,

గోవిం: సేనాపతీ! మా ఆజ్ఞను విమర్శింపవలసినవాడవు నీవు కావు, మా ఆనతి నెరవేర్చడమే నీవిధి. నాటి ఔచిత్యానౌచిత్యాలు మాకు మాత్రమే సంబంధించిన విషయాలు.

సేనాని: ప్రభూ! నేను మీ సేవకుడను; కాని మానవుడననికూడా మరచిపోలేను. నాకు ఉద్యోగమూ, మతమూ రెండూ ఉన్నాయి. నాకు ప్రభువేకాదు. దేవుడుకూడా ఉన్నాడు.

గోవిం: అయితే, నీఖడ్గాన్ని చందపాలునికి సమర్పించు అతడే దేవాలయ పావిత్ర్యాన్ని కాపాడగలడు

సేనాని: చందపాలుని కెందుకు ప్రభూ? పూజ్యులైన మీపూర్వులీఖడ్గాన్ని మాపితృవ్యులకు ప్రసాదించారు దీనిని తిరిగి యివ్వవలసివస్తే, మీకే ఇచ్చివేస్తాను. ... స్వర్గలో విహరించే నా పితృపితామహుల సాక్షిగా, విశ్వాసభావ పునీతమైన యీ నా ఖడ్గాన్ని ప్రభూ! మీపాదాల చెంత సమర్పిస్తున్నాను.

[వెళ్ళిపోతాడు

రఘు: హహ్హా! బ్రాహ్మణ శాపఫలం ఇప్పుడే ఆరంభమైంది!

[ప్రవేశం: జయసింగు]

జయ: జంతువులు బలికి సిద్ధంగా వున్నాయి స్వామీ!

గోవిం: బలి?

జయ: ప్రభూ నాప్రార్థన మన్నించండి. మీరు మానవమాత్రులు దైవకార్యాన్ని నిరోధించడం శ్రేయస్కరంకాదు

రఘు: సిగ్గులేదా జయసింగ్? లేచిరా నేను నీ ఆచార్యుణ్ణి. నీస్థానం నాపాదాల దగ్గరనే కాని రాజు పాదాల వద్ద కాదు. మూర్ఖుడా! దైవపూజకు రాజానుమతి నర్థిస్తున్నావా? సరే పూజ. బలి మానివెయ్యి, ఈ గర్వ ప్రవృత్తికి ప్రతిఫల మేమిటో నీవే చూద్దువుగాని రా.

[అందరూ నిష్క్రమణ

౬

[ప్రవేశం: అపర్ణ]

అపర్ణ: జయసింగేడీ? లేడే యిక్కడ! ....అదెవరు?... నీవా? చలనంలేని ఓపాషాణ విగ్రహమా! ఒక్కమాటైనా ఉచ్చరించకుండా, నీవు మా సర్వస్వాన్నీ దోచుకోగలవు! మేము ప్రేమకోసం పరితపించిపోతాం, దానికోసం కడకు భిక్షుకులవలె మరణిస్తాం. అయినా, అది అయాచితంగా. నీ కక్కర లేకపోయినా, నీదగ్గరకే వస్తుంది. నీవు దానిని శ్మశానవాటిలోవలె, యీ ఆశాజగత్తుకు అందకుండా నీ లుబ్ధపీఠం క్రింద పాతిపెడతావు. జయసింగ్! దీనిదగ్గర నీవేమానంద మనుభవించగలవు? ఇది నీ కే సందేశం యివ్వగలదు? అయ్యో! నా హృదయం శోషిల్లుతోంది.

[ప్రవేశం: రఘుపతి]

రఘు: ఎవరు నువ్వు?

అపర్ణ: ఒక భిక్షుక బాలికను. జయసింగు ఎక్కడున్నాడో చెబుతారా?

రఘు: ఇక్కడనుండి తక్షణమే వెళ్ళిపో! జయసింగు హృదయాన్ని తల్లివైపునుండి మరల్చడానికే, నీవీ ఆలయంచుట్టూ తిరుగుతున్నావని నాకు తెలుసు. పో!

అపర్ణ: నేనంటే తల్లికి భయమా? అయ్యో! ఆదంటే నాకే భయం!

[వెళ్ళిపోతుంది

[ప్రవేశం: జయసింగు, నక్షత్రుడు]

నక్ష: నన్నెందుకు పిలిపించారు స్వామీ!

రఘు: రాత్రి, తల్లి నాకు కలలో సాక్షాత్కరించి, ఒక్కవారంరోజులలో నీవు రాజవౌతావని చెప్పింది నక్షత్రా!

నక్ష: ఆ, ఆ, ఎంతఅదృష్టం!

రఘు: అవును. నీవుతప్పక రాజు కాగలవు.

నక్ష: కాని నాకు నమ్మకంచాలడంలేదు స్వామీ!

రఘు : నీవు నాపలుకులు శంకిస్తున్నావా?

నక్ష : మిమ్మల్ని శంకించడం నా అభిమతంకాదు. కాని అది జరగదేమోనని నా అనుమానం.

రఘు : కాదు అది జరిగితీరుతుంది.

నక్ష . మీరెలా చెప్పగలరుస్వామీ !

రఘు : తల్లి రాజరుధిరాన్నివాంఛిస్తోంది.

నక్ష : రాజరుధిరమా?

రఘు : నీవురాజువుకాక ముందే, అది తెచ్చి తల్లికి సమర్పించాలి.

నక్ష : అదెక్కడదొరుకుతుందిస్వామీ?

రఘు : మహారాజు ఉన్నాడుగా—జయసింగు, కలవళపడకు—అర్థమైందా? రహస్యంగా అతణ్ని చంపి, ఆవేడి నెత్తురుతెచ్చి తల్లికర్పించు—జయసింగు, నీకు ధైర్యం లేకపోతే బయటకు వెళ్ళిపో

నక్ష : స్వామీ! అతడు నాసోదరుడు; నేనాతనిని ప్రేమిస్తున్నాను.

రఘు : కాని, నీకానుక అంతకంటె ఉత్కృష్టమైనదిసుమా !

నక్ష : ఆచార్యా ! నాకు రాజ్యమక్కర లేదు. ఉన్నదానితోనే తృప్తిపడతాను.

రఘు : ఇది జగన్మాత శాసనంసుమా నక్షత్రా ! నీకు గత్యంతరంలేదు. రాజకుటుంబంలోని రక్తంకోసం తల్లి అఱ్ఱులు చాస్తున్నది. అప్పుడు నీసోదరుడు జీవించాలంటే. నీవు మరణించాలి.

నక్ష : నన్ను రక్షించండిస్వామీ !

రఘు : మాతృశాసనం అమలుజరిగేవరకూ, నీకు జీవించడానికైనా, మరణించడానికైనా స్వేచ్ఛలేదని తెలుసుకో!

నక్ష : అయితే చెప్పండిస్వామీ! తల్లి ఆజ్ఞ నెరవేర్చే సాధనమేదో సెలవీయండి

రఘు : ఓపికపట్టు. సమయంరాగానే ఏమేమిచెయ్యాలో అంతా చెబుతాను. ఇంక నీవు వెళ్ళవచ్చు.

[నక్షత్రుడు నిష్క్రమణ

జయ : ఆ! నేను విన్నదేమిటి? తల్లీ కరుణామయీ! ఇది నీశాసనమా? అన్నను చంపమని తమ్ముణ్ణి ప్రోత్సహిస్తున్నావా? అచార్యా! ఇది మాతృమనోరథమని మీరెలా చెప్పగలరు?

రఘు : నాతల్లి నారాధించడానికంతకంటె వేరు సాధనంలేదు.

జయ : సాధనమా? సాధనాలెందుకు స్వామీ! తల్లీ! ప్రళయసన్నిభమైన నీశక్త్యాయుధాన్నొక్కసారి నీవే ప్రయోగించరాదా? దొంగచాటుగా నీకోరికలు తీర్చుకోవలసిన ఖర్మమేమిటి? అబ్బా! ఎంతపాపం

రఘు : పాపమంటే నీకేమి తెలుసును జయసింగ్?

జయ : మీఉపదేశమేగదా గురుదేవ్!

రఘు : అయితే పాపమంటే ఏమిటో మళ్ళా నేర్చుకో, వాస్తవమాలోచిస్తే పాపమనేదానికి అర్థమేలేదు. చంపడమంటే చంపడమే! అది పాపమనిగాని మరొకటి అనిగాని భావించడంభ్రమ. ఈభూరజస్సులో కోటానుకోట్ల ప్రాణులు గతించి, జీర్ణమైనాయని నీకుతెలియదా? అస్థిరమైనభూతకోటి జీవితచరిత్రను కాలదేవత నిత్యమూ రక్తాక్షరాలతో లిఖిస్తూనే ఉన్నది. వనసీమల్లో, జనపదాలలో, పక్షులగూండ్లలో, కీటకనివాసాల్లోసముద్రగర్భంలో, వ్యోమవీధుల్లో—సర్వత్రాఈమారణ కర్మసాగుతూనేఉన్నది. ఈ జగత్తులో ఏవస్తువుకైనా, ఏనాటికైనా వినాశనం తప్పదు. ఈవిశాల విశ్వంలోఅహరహమూ యీమారణహోమం కొనసాగుతూనేఉంది అందులో, అనంత కాలవాహిని కధిదేవతయైన భవానీమాత, అరుణారుణమైన జగజ్జీవరక్తంతో నింపిన రుధిర పాత్రికను చేతిలోధరించి, పిపాసార్ద్రమైన జిహ్వాగ్రాన్ని భయంకరంగాచాచి, వికటలాస్యం చేస్తోంది,

జయ : ఆపండి గురుదేవా! ఆపండి... అయితే, ప్రేమ బూటకమేనా? దయఅనేది కల్పితమేనా? సృష్ట్యాదినుండీ సత్యమైన పదార్థం ఒక్క ప్రళయమేనా? అయితే, సృష్టి ఎన్నడోనశించి పోవలసిందికాదా?

లేదు. గురుదేవా! మీరు నాహృదయంతో చెర లాడుతున్నారు అదిగో చూడండి! దేవి నన్ను ఆపహసిస్తోంది. రక్తపిపాసినివైన ఓజగన్మాతా! నారక్తాన్ని నీవుస్వీకరిస్తావా? ఈబాకుతో నావక్షస్థలం చీల్చి, నీకు ఆత్మ నైవేద్యం ఇవ్వనా? ఈనాజీవనాళాలలో ప్రవహించే వేడినెత్తురు నీకు ప్రీతి కూరు స్తుందా? తల్లీ! రక్తపిపాసినివైన తల్లీ!— పిలిచారా గురుదేవా? అవును. నాకుతెలుసు ఆవేదనాభరితమైన నాహృదయాన్ని చించి, తల్లికాళ్ళపై పడవేయాలని మీరు కోరుతు న్నారు అదే నిజమైన బలిదానం! కాని రాజ రుధిరమో... అయ్యో! ఆచార్యా! మన ప్రేమకోసం పరితపించే జగన్మాతకు మీరు రక్తప్రియత్వమాపాదిస్తున్నారు!

రఘు: అయితే, ఆలయంలో బలి మానివెయ్యి.

జయ: అవును మానివేద్దాం—వద్దు, వద్దు. గురుదేవా! మంచిచెడ్డలు నిర్ణయించ గలిగింది మీరు. హృదయ విధికీ, శాస్త్ర విధికీ ఎంతో తారతమ్యమున్నది క్షమిం చండి గురుదేవా! నా అజ్ఞానానికి మన్నిం చండి అయితే, తల్లి రాజరుధిరాన్ని కోరు తున్న మాటవాస్తవమేనా తండ్రీ?

రఘు: నాలో నీకు నమ్మకం నశించిందా నాయనా!

జయ: లేదు, లేదు. ఆచార్యా! మీలో నాకు విశ్వాసమే లేకపోతే, ప్రపంచమే లేదు.. అయితే, తల్లికి రాజరక్తం అంత ప్రియమైతే, నేనే దాన్ని తీసుకువచ్చి సమర్పి స్తాను. సోదరుణ్ణి సోదరుడు హత్యచేయడం సహించలేను స్వామీ!

రఘు: మాతృ మనోరథ మీడేర్చడంలో తప్పులేదు నాయనా!

జయ: లేదు ఏమాత్రం తప్పులేదు నేను దానిని సాధిస్తాను.

రఘు: కాని నాయనా! నిన్ను చిన్న ప్పటినుండీ, నా ప్రాణానికి ప్రాణంగా పెంచు కున్నాను. నీకేమైనా అపాయం సంభవిస్తే నే నోర్చలేనురా తండ్రీ!

జయ: మీకు నా యందున్న పవిత్ర ప్రేమ కళంకితం కావడం దుస్సహం గురు దేవా! యువరాజును అగమని చెప్పండి.

రఘు: . సరే! ఆలోచించి, రేపు చెపుతానులే!

[వెళ్ళిపోతాడు.

జయ: సంశయాత్మకమైన యోచనల కంటె, ఎంత క్రూరమైనా, కార్యాచరణమే వేయిరెట్లు మెఱుగు... గురుదేవా! నీవు సత్యం వచించావు! నీమాటలు ముమ్మాటికీ నిజం!! చంపడం పాపంకాదు! సోదరుణ్ణి చంపడం పాపంకాదు!! రాజును చంపడం పాపంకాదు!!!—సోదరులారా! మీరంతా ఎక్కడకు వెడుతున్నారు! నిశీపురయాత్రకా? అక్కడ స్త్రీలు నృత్యాలు చేస్తారా? అహ! ఈప్రపంచం ఆనందమయం! నృత్య విన్యా సాలలో మెలికలు తిరిగే యువతీ జనకరపల్ల వాలు మనోహరంగా ఉంటాయి? ఆహా! ఈ జనమంతా ఎంత సంతోషంతో సాగిపోతు న్నారు! వాళ్ళ కేరింతలకు దిక్కులు పిక్క టిల్లుతున్నాయి! నేనుకూడా వాళ్ళననుస రిస్తాను.

రఘు: జైసింగ్!

జయ: నీ వెవరవు? నేనీ జనసమూ హంలో కలిసిపోతాను. నన్ను నిరోధించ డానికి నీ వెవరవు? నీ దారిని నీవు పో?

రఘు: (తీవ్రంగా) జైసింగ్

జయ: నా దారి నిష్కంటకంగా ఉన్నది. భిక్షాపాత్రిక చేతిలో పట్టుకొని, భిక్షుక బాలిక ప్రియురాలుగా, నేను నడిచి వెడతాను. ప్రపంచ మార్గాలు కంటకావృతమని ఎవరన గలరు? ..చిట్టచివరకు గమ్యాన్ని చేర గలం. ఎక్కడ అధికారానికీ, అహంకృతికీ తావులేదో, ఎక్కడ జీవితక్లేశం విస్మృత మౌతుందో, ఎక్కడశాంతి-శాశ్వత ప్రశాంతి- విస్తరించి ఉంటుందో, ఆ మహాగమ్యాన్ని చేరతాం! అప్పుడీ నిరర్థకమైన శాస్త్రాలవల్ల ఆచార్యులవల్లా, ధర్మబోధనలవల్లా, ప్రయో జన మేముంటుంది?—ఆ, ఆ! గురుదేవ్!

గురుదేవ్, నేనే మన్నాను? నేనేదో కల గంటున్నాను. అదిగో! సత్య పదార్థం వలె అచలమూ, కఠినమూ అయిన ఆలయం శిఖరి!—తండ్రీ! మీ అభిమతమేమిటో సెలవీయండి! ఆ! ఔను. నేను దానిని మర్చిపోలేదు. (బాకుదూసి) ఇదిగో! ఈ బాకుతో కలిసి నిశితమయ్యేవరకూ మీ మాటలను నా మనస్సులో పదును పెడుతూనే ఉంటాను. ఇంకేమి అజ్ఞ ఆచార్యా?

రఘు : నాయనా, జయసింగు! నీపై నాకుగల ప్రేమ ఎంత అగాధమైందో చెప్ప లేకుండా ఉన్నాను.

జయ : వద్దు, గురుదేవా! ప్రేమను గూర్చి నాకుచెప్పవద్దు. ధర్మాన్ని గూర్చి మాత్రమే ప్రబోధించండి ఈ వెట్లు చేమలు వలెనే ప్రేమకూడా కేవలం బాహిరమైనది. ఆదికలలా కన్పించి అదృశ్య మౌతుంది. కాని ధర్మమో, మహాగ్రావంవలె అంతర బలంవల్ల అచంచలమైనది.

[నిష్క్రమణ

౭

[ప్రవేశం: గోవిందుడు, చందపాలుడు]

చంద : ప్రభూ! మీరు చాలా అప్రమత్తులై ఉండాలి

గోవిం : ఏమిటది చందపాల్? ఏమిటా హడావిడి?

చంద : మీకు ప్రాణహాని కల్గించాలని కుట్రపన్నుతున్నారు ప్రభూ!

గోవిం : ఎవరాకుట్రదారులు?

చంద : చెప్పడానికి జంకుతున్నాను ప్రభూ! యీదుర్వార్త మీకెలాభినిపించను? అయినాతప్పదు. యువరాజా నక్షత్రుడు ప్రభూ!

గోవిం : నక్షత్రుడా?

చంద : మీరక్తం తెచ్చిదేవికి సమర్పిస్తానని ఆతడు రఘుపతి వద్ద శపథంచేశాడు స్వామీ!

గోవిం : దేవికి సమర్పిస్తాననా? అయితే అందులో ఆతని తప్పేమున్నది? దైవకార్యంలో మానవుడు తన మానుషత్వాన్నే మరచిపోతాడు...... ఊఁ, నీవు వెళ్ళి నీపని చూసుకో.

[చందపాలుడు వెళ్ళిపోతాడు.

(రాజువిగ్రహంకేసి) తల్లీ! ఈపుష్పాలను స్వీకరించి, నీజంతుసంతానానికి శాంతిప్రసాదించు. అమ్మా! ఈలోకంలో బలహీనులు నిస్సహాయులైనారు. బలవంతులు క్రూరకర్ములైనారు. ఆశాపరులు దయారహితులైనారు; అజ్ఞానం అంధకారభూయిష్టమైంది; అహంకారం విచక్షణను విడిచి బలహీనులను కాలరాచి వేస్తున్నది, గర్వాతిశయంచే విచక్షణాజ్ఞానం నశించి, అత్మక్షోభంచేత దయాశూన్యులై—బలవంతులు బలహీనులను కాలరాచివేస్తున్నారు తల్లీ! నీకరాళఖడ్గాన్ని దూయవద్దు రక్తపానకాంక్షతో ఆశించవద్దు. అన్నపైకి తమ్ముణ్ణీ, భర్తపైకి భార్యనూ పురికొల్పకుతల్లీ! నేను ప్రేమించేవ్యక్తి చేతిలోనే నేను మరణించడం నీకభీష్టమైతే—అలాగేకానీ! పాపం పండనిదే ఎలావృద్ధిలైపోతుంది? తమ్ముని చేతిలో అన్న జీవితం అంతమైనప్పుడే, రక్తపిపాస, దేవతాస్వరూపం దిగవిడచి, పిశాచపిశాచ స్వరూపంతో ప్రత్యక్షం కాగలదు తల్లీ! అదే నీవాంఛితమైతే—నేను శిరసావహిస్తాను

[జయసింగు త్రోసుకు వస్తాడు.]

జయ : చెప్పుతల్లీ! నీకు నిజంగా రాజరుధిరంకావాలా? నీవే స్వయంగా అడుగు. నేను దానిని తెచ్చి సమర్పిస్తాను.

శబ్దం :

రా - జ - రు - ధి - రం - కా - వా - లి - !

జయ : మహారాజా! మీరు మరణానికి సిద్ధంగా ఉండండి.

గోవిం : ఎందుకీ పాపకర్మ, జైసింగు?

జయ : ఇప్పుడు తల్లిచెప్పిన మాటల్ని మీరు వినలేదా?

గోవిం: హ్హా హ్హా హ్హా! తల్లీ లేదు, ఏమీ లేదు. అదిచిరపరిచితమైన రఘుపతి కంఠం.

జయ: రఘుపతి కంఠమా? కాదు కాదు! నన్ను సందేహంలో దింపడానికి యత్నించకండి! పోనీ. అదిమాతృకంఠమైనా, ఆచార్యులకంఠమైనా ఒక్కటే!

[బాకుదూసి—క్రిందపారవేస్తాడు.

నీబిడ్డల మొఱాలకించుతల్లీ! ఈపుష్పాలను ఈకోమల కుసుమాలనే నైవేద్యంగా స్వీకరించు—రక్తాన్ని కోరకు తల్లీ! ఇదిగో, ఈ మందార పూవులుకూడా రక్తవర్ణంకలవే! నిజ సంతాన సంహారంతో వ్యధితయైన భూదేవి విచ్ఛిన్న హృదయంనుండి జనించినవీ పూలు. వీటిని స్వీకరించు తల్లీ!.... నీవు స్వీకరించి తీరాలి. నీ కోపాగ్నిని నేనెదుర్కొంటాను. నీకు రక్తనైవేద్యం జరగడానికి వీల్లేదు—అవిగో, నీ కన్నులలో కోపాగ్ని జ్వాలికలు! ఊం! నీ ఖడ్గాన్ని దూయ్! ప్రళయ రూపంతాల్చు!!....నాకు భయంలేదు! .. మహారాజా! మీరింక ఈ ఆలయాన్ని విడిచివెళ్ళండి

[గోవిందుడు వెళ్ళిపోతాడు.

అం! అం! అయ్యో! ఒక్కనిముషంలో నా సర్వస్వాన్నీ జారవిడిచాను! నా తల్లి! నా ఆచార్యుడు!!

రఘు: (ప్రవేశించి) ద్రోహి! నేను సర్వమూ ఆలకించాను. నీవు గురుద్రోహివి!

జయ: గురుదేవా నన్ను రక్షించండి.

రఘు: నీకే శిక్ష విధించాలో నాకు బోధపడడంలేదు.

జయ: నా ప్రాణాలు తీసివేయండి.

రఘు: కాదు, కాదు. ఇటువచ్చి. తల్లి పాదాలుతాకి ప్రమాణం చెయ్యి!

జయ: (అలాగే చేస్తాడు.)

రఘు: చెప్పు — అర్ధరాత్రిలోగా, రాజరుధిరం తెచ్చి తల్లికి సమర్పిస్తాను—అని ప్రమాణ చెయ్యి

జయ: అర్ధరాత్రిలోగా రాజరుధిరంతెచ్చి తల్లికి సమర్పిస్తాను.

[నిష్క్రమణ

రా

[ప్రదేశం: అంతఃపురం. ప్రవేశం గుణవతి.]

గుణ: చివరకు నేనే ఓడిపోయాను. నేనిలాగే కొన్నిదినాలపాటు పెడమొగంగా ఉంటే, వారు లొంగుతారనుకున్నాను. నా శక్తిలో నాకంత నమ్మకముండేది. నేనిపుడు వ్యర్థురాల నైనాను. కోపం ప్రదర్శించి దూరంగా తొలిగాను. కాని ప్రయోజనం లేకపోయింది. అదుదాని కోపం వజ్రకాంతి వంటిది. అది ధగ ధగ లాడగలదేగాని భగ్గున మండలేదు. నాక్రోధం, మహారాజులో ప్రబోధం కలిగించి, గర్వాపహరణం చేయగలదని భావించాను.

[ప్రవేశం: ధృవుడు]

గుణ: ఎక్కడకు వెళ్తున్నావ్?

ధృవుడు: మహారాజుగారు పిలిపించారు.

[వెళ్ళిపోతాడు.

గుణ: వీడు మహారాజు ప్రాణానికంటె అధికమైనవాడు. వీడు నా భావి సంతానాన్ని పితృప్రేమకు దూరంచేస్తున్నాడు; మహారాజు హృదయంలో వాళ్ళకుగల స్థానా న్నాక్రమించాడు! తల్లీ! భవానీ! నీ సృష్టి అనంతం! మహావిచిత్రం! నా కొక్క పసికందును ప్రసాదించు తల్లీ! నీ కేది కావాలంటే అది సమర్పిస్తాను. (నక్షత్రుడు ప్రవేశిస్తాడు.) యువరాజా! వెళ్ళిపోతావేం? నేను నిరాయుధనైన అబలను. నన్ను చూస్తే నీకు భయందేనికి?

నక్ష: వద్దు. నన్ను పిలవకండి:

గుణ: ఏం? ఇందులో తప్పేముంది నక్షత్రా?

నక్ష: వద్దు నాకు రాజటికం అక్కర్లేదు.

గుణ: ఏమిటా ఉన్మాదం?

నక్ష: మహారాజు వెయ్యేళ్ళు వర్ధిల్లాలి! నేను - నేను - యువరాజుగానే మరణించాలి.

గుణ: ఇప్పుడాప్రసక్తిదేనికియువరాజా?

నక్ష : ఏమీలేదు ... మీకేంకావాలో సెల వీయండి.

గుణ : నిన్నుకాదని మరొకడు యీ రాజ్యాని కధినేతకాబోతున్నాడు - వాడిని రూపుమాపు ! తెలిసిందా నక్షత్రా ?

నక్ష : లేదు. ఎవరాతడు ?

గుణ : వాడే ధృవుడు! వాడు మహారాజు దగ్గర ఎంతగోముగా పెరుగుతున్నాడో చూడ్డం లేదూ నువ్వు ?

నక్ష : అవును. నేనూ చాలాసార్లుఅలాగే అనుకున్నాను వాడితో ఆడుకుంటూ ఆడు కుంటూ ఒకనాడు మహారాజు తన కిరీటం తీసి వాడినెత్తిపై పెట్టడంకూడా చూశాను.

గుణ : కిరీటంతో చెలలాటలు ప్రమాద కరం సుమా! నీవుగనుక వాడిని నాశనం చెయ్యకపోతే, నీకే సర్వనాశనం తప్పదు! నక్షత్రా !

నక్ష : అవును ఇప్పుడేం చెయ్యాలి ?

గుణ : భవానీమాతకు బలియివ్వు. తల్లి రక్తపానానికై ఆక్రోశించడం నీ వెఱుగవా ?

నక్ష : అబ్బా ! ఆపని నాచేతగాదు తల్లీ!

గుణ : ఓయి మూర్ఖుడా ! తల్లి అభీష్టం నెరవేరకపోతే, నీకు క్షేమం ఉంటుందనే భావిస్తున్నావా ? ఆమెకు రక్తసమర్పణ జరిగితీరాలి చేతనైతే, ఆత్మరక్షణ చేసుకో.

నక్ష : కాని తల్లికి రాజరుధిరంకదా కావలసింది ?

గుణ : ఎవరు చెప్పారు నీకు ?

నక్ష : నిత్యమూ మాతృకైంకర్యంచేసే ఒకానొక పరమ భక్తుని ఆదేశమది.

గుణ : అయితే, మహారాజు కొలుకా బాలుడు తప్పక మరణించాల్సిందే. మహా రాజు కా బాలుడు ప్రాణానికంటే ఎక్కువైన వాడు. వాడిబలిదానంతో ప్రభువు ప్రాణం సురక్షితమౌతుంది.

నక్ష : అవును.

గుణ : ఇంక కాలయాపన చేయకు.... ఊఁ, పరుగెత్తు ..వాడాట్టేదూరంవెళ్ళకుండ డీ పాటికి....ఇదిగో, ఒక సంగతి ! వాణ్ణి మాత్రం నా పేరుమీదే బలియివ్వాలిసుమా !

నక్ష : అలాగే !

గుణ : నక్షత్రా ! ఇదివరకు నేనుపంపిన కానుకలు తిరుగగొట్టారు అందుకు నన్ను మన్నించమనికూడ తల్లిని ప్రార్థించు

[నిష్క్రమణ

౯

[ప్రవేశం - జయసింగు]

జయ - తల్లీ ! ఈ ప్రపంచంలో నీ ధ్వంసాకాండకు పాత్రం కాని ప్రాణి వక్కటైనా ఉన్నదా ? మినుకు మినుకుమనే ఆ దూరపు చుక్కల్లోనైనా నీ దివ్యతేజోలేశం విభాసిస్తుంటే,—నా ప్రశ్నకు సమాధాన మివ్వు. "నాయనా ! నేనిక్కడున్నాను"— అని ఒక్కసారైనా పలుకరాదా ?—లేదు. నీ వెక్కడా లేవు; నీ ఉనికి సర్వాబద్ధం ?... ఓ మహామాయా ! నిర్భాగ్యుడైన యీ జయ సింగును కరుణించి, నీసందర్శనభాగ్యం కల్గించు ! అయ్యో ! నీవృత్తాంతం కేవల మొక అభూత కల్పనమేనా ? నాప్రేమ సయితం నీశూన్యప్రకృతిలో జీవనసంచలనం కల్గించలేదా?. ఓయి మూర్ఖుడా ! ఇంత కాలమూ, ఎవరికోసం నీజీవితపాత్రలోని ఆఖరిబొట్టుకూడా వెచ్చించావు ?— ఈకల్పిత మైన, చలనంలేని, దయావిహీనమైన శూన్యం కోసమేనా ?

[అపర్ణ ప్రవేశిస్తుంది

అపర్ణా ! నిన్నీఆలయంనుండి తరిమి వేశారు: అయినా, నీవు పదేపదే తిరిగి వొస్తున్నావు. అవును. నీవు సత్యం !! సత్యాన్నెవ్వరూ బహిష్కరించలేరు !! మేమీ ఆలయంలో భక్తిశ్రద్ధలతో అసత్యాన్ని పూజిస్తున్నాం ! ఇది ముమ్మాటికీ అసత్యం ! కల్పన !.. అపర్ణా ! నన్ను విడిచివెళ్ళకు! ఇటువచ్చి నాప్రక్కనకూచో. ఎందుకంత విచారంగా ఉన్నావపర్ణా ? లేనిదేవుడికోసం విచారిస్తున్నావా ? కాని, యీ మానవలోకంలో

మనకు దేవునితో పనేమున్న దపర్ణా? దైవ భీతిని విడిచిపెట్టి, మనం పరస్పరమూ సాన్నిహిత్యం పొందుదాము. దేవతలు రక్త పిపాసులు. అక్కడ స్వర్గంలో హింసకిచ్చ గించే ప్రాణికోటి లేకపోబట్టే యీ దేవత లంతా, ఆ అమరవైభవాన్ని విడిచిపెట్టి, భూమికవతరించారు—లేదు, అపర్ణా! లేదు దైవవృత్తాంతం కేవల కల్పన.

అపర్ణ - అయితే యీఆలయాన్ని విడిచి నాతో రారాదా?

జయ : ఆ ఆలయాన్ని విడవడమా? అవును విడిచివస్తాను. అపర్ణా! తప్పక విడిచిపోవలసిందే కాని, నాఅంత్యప్రణామం చెల్లించకుండా ......ఉం, ఆ విషయమలా ఉంచు. అపర్ణా! నాకింకా దగ్గరకుజరుగు! యీజీవితాన్ని మాధుర్యంతోనింపి, మృత్యు వునుసైతం పరాజితంచేసే ఆదివ్యవచస్సును వినిపించు!!

అపర్ణ - హృదయం బరువెక్కినపుడు మాటలు పెకలవు జయసింగ్!

జయ - అయితే, నీ శిరస్సును నాగుండె లపై వ్రాల్చు. అపర్ణా! జీవన, మృత్యువు లనే యీ నిత్యతాద్వయి పరస్పరం ఐక్యం కానివ్వు — మరేమీ అక్కరలేదు! నేను వెళ్ళిపోవాలి

అపర్ణ - కఠినుడవు కాబోకు జయసింగ్! నా బాధ నీకు తెలియదా?

జయ - కఠినుడనా? ఇదా నీవు చివ రకు పలికినమాట? దైవం పేరిట వెలిసిన ఆ పాషాణ విగ్రహంవలె నేనూ కఠినుడ నేనా! అయ్యో అపర్ణా! నీవే గనుక దేవతవై వుంటే, నాహృదయాన్ని దహించే యీ అనలాన్ని గుర్తింపగలిగే దానివి. ఇప్పటికీ, నీవు నాపాలిటి దేవతవే. అపర్ణా!—

అపర్ణ - ఆం

జయ - కన్నబిడ్డను కౌగిలించే మాతృ మూర్తివలె, నీవు నిత్యమూ త్యాగమూర్తివై నన్ను చేరతావు. భగవంతుడు కూడా, ఆత్మ శక్తిని సృష్టి అంతటా ఒలకబోస్తూ అలాగే త్యాగమూర్తి కావాలి

అపర్ణ - రా, జయసింగ్! ఈ ఆల యాన్ని విడిచి, యిద్దరమూ కలిసిపోదాం.

జయ - అయ్యో! అపర్ణా! నన్ను రక్షించు. దయయుంచి నన్ను విడిచివెళ్ళు! నాకు జీవితంలో ఒకటే ఆదర్శమున్నది. దానిని విచ్ఛిన్నం చేయబోకు.—

[సంభ్రమంతో నిష్క్రమిస్తాడు.

అపర్ణ - యీ నాబాధ కంతులేనట్లున్నది. నా శక్తి నశించింది. నా హృదయం పగిలి పోతోంది.

[నిష్క్రమిస్తుంది.

౧౦

[ప్రవేశం - రఘుపతి, నక్షత్రుడు]

రఘు - ఆ పిల్లవాణ్ని ఎక్కడ దాచావు యువరాజా?

నక్ష - పూజా ద్రవ్యాలున్న గదిలో దాచాను - వాడు పాపం, ఏడ్చి ఏడ్చి నిద్ర పోయాడు. తిరిగి నిద్ర లేచాడంటే, వాడి నాపడం నా శక్యంకాదు ఆచార్యా!

రఘు - నా దగ్గరకు వచ్చినప్పుడు జయ సింగు కూడా అంతే వుండేవాడు - నాకింకా జ్ఞాపకమున్నది —వాడు కూడా ఇలాగే ఏడ్చిఏడ్చి అలసి తల్లి పాదాలదగ్గర నిద్రపోయాడు! కన్నీటిచారలు చెరిగిపోని వాడి పాలబుగ్గల మీద దీపకాంతి మందంగా వెలిగింది— సరిగ్గా, యిలాగే ఆనాడు కూడా మబ్బు పట్టింది.

నక్ష - ఆలస్యం చేయకండి స్వామీ! వాడు నిద్ర మేలుకోకముందే, పని పూర్తి చేయాలి. వాడి ఆక్రందనం బాకు పోటులా నా హృదయాన్ని కోసివేస్తుంది.

రఘు - వాడు నిద్రలేస్తే, నేను తిరిగి నిద్ర పుచ్చుతానులే.

నక్ష - మీరాలస్యంచేస్తే, సర్వమూ మహా

రాజుకు తెలిసిపోతుంది. సాయం సమయాన మహారాజీ కుఱ్ఱవాడికోసం వెతుకుతుంటాడు.

రఘు - నక్షత్రా! తల్లిపట్ల విశ్వాసం వహించు. బలివస్తువు స్వయంగా తల్లి చేతుల్లోనే చిక్కింది. ఇంకా ఎలా తప్పించుకు పోగలదు?

నక్ష - కాని, చండపాలుడు వేయి కళ్లతో కనిపెడుతున్నాడు స్వామీ!

రఘు - తల్లికంటేనా?

నక్ష - ఆ! ఎవరో నడిచినట్లు నీడలగుపిస్తున్నాయ్.

రఘు - అది నీ భయచ్ఛాయ మాత్రమే.

నక్ష - అదిగో! ఎవరో మాట్లాడినట్లు లేదూ?

రఘు - అది నీ హృదయస్పందనమే సుమా! యువరాజా! అధైర్యపడకు. పరమ పవిత్రమైన యీ ద్రాక్షాసవం పానంచేద్దాం రా. మనసులో ఉన్నంతకాలమూ కార్యభారం దుస్సహంగానూ, భయావహంగానూ తోచక మానదు; కాని క్రియలో అత్యల్పంగా పరిణమిస్తుంది. మేఘాలు చూడు!-ఎంత దట్టంగా భయంకరంగా వ్యాపించినా, చిట్టచివరకు చిన్నచిన్న వానచినుకులుగా కరిగిపోతాయి! యువరాజా! ఈ పని కెంతసేపు కావాలి? 'ఉఫ్' అని ఊదితేచాలు, ఈ జీవజ్యోతి తొలకరి మెరుపువలె నిమిషంలో సమసిపోగలదు. దానితో మహారాజు గర్వం బదాబదలు కాక తప్పదు - మాట్లాడవేం నక్షత్రా!

నక్ష - మనం తొందరపడుతున్నాం గురుదేవా! రేపురాత్రివరకూ ఈ కార్యాన్ని ఆపివేయగూడదా?

రఘు - నేటిరాత్రికూడా రేపటి రాత్రి వంటిదే; అంతకంటె శుభకరమేమో కూడా.

నక్ష - అదిగో, ఆ అడుగుల చప్పుడు వినండి

రఘు - నాకేమీ వినపడడంలేదు.

నక్ష - అదిగో - ఆ వెలుగు చూడండి.

రఘు - ఆఁ! మహారాజు! అయ్యయ్యో మనమెంత ఆలస్యం చేశాం?

[భటులతో, రాజు ప్రవేశం

గోవిం - వీళ్ళను బంధించండి (రఘుపతితో) నీవేమైనా చెప్పుకోవలసి ఉన్నదా?

రఘు - లేదు.

గోవిం - నీ అపరాధాన్ని అంగీకరిస్తున్నావా?

రఘు - అపరాధం! అవును. సహజ దౌర్బల్యానికి లోనై మాతృపూజా విషయంలో ఆలస్యంచేయడమే నాఅపరాధం. అందుకు తల్లే నన్ను శిక్షిస్తుంది. నీవు కేవలం నిమిత్త మాత్రుడవు.

గోవిం - రఘుపతీ! న్యాయశాస్త్రాను సారం, నాసైనికులు నిన్ను దేశబహిష్కృతుణ్ణి చేస్తారు. ఎనిమిదేండ్లు నీవు ప్రవాస జీవితం గడపాలి.

రఘు - రాజా! నా జీవితంలో ఎన్నడూ తోడి మానవుణ్ణి దీనంగా యాచించి యెరుగను. నేను బ్రాహ్మణుణ్ణి, అగ్రకులస్థుణ్ణి అయినా. ఒక్కరోజు వ్యవధి యీయమని దీనంగా నిన్ను ప్రార్థిస్తున్నాను.

గోవిం - మంచిది.

రఘు - (అపహాస్యంగా) నీవు రాజాధిరాజవు నీ రీపీ, నీ ఔదార్యమూ అగణ్యమైనవి. నేనో నీముందు కేవలమొక కీటకాన్ని! క్షుద్రకీటకాన్ని!! [వెళ్ళిపోతాడు.

గోవిం - నక్షత్రా! నీ దోషాన్ని అంగీకరిస్తావా?

నక్ష - నేను దోషినే ప్రభూ!— ఏ మొహంతో మిమ్మల్ని క్షమాపణ వేడుకోను?

గోవిం - యువరాజా! నీ హృదయం ఆర్ద్రమైనదని నాకుతెలుసు. కాని. నీకీ దుర్బోధనలుచేసిన వారెవరో చెప్పు.

నక్ష - దోషమంతా నాదేప్రభూ! ఇతరులెవ్వరూ ఇందుకు బాధ్యులుకారు. నన్ను క్షమించండి మహారాజా!

గోవిం - లే, నక్షత్రా! — ఈ వృధాపరిదేవనంవల్ల ప్రయోజనం లేదు. న్యాయశాస్త్రమే న్యాయమూర్తి కనుసరణీయం.

పరిజనులు - ప్రభూ! ఇతడు మీ సోదరుడు - మన్నించండి.

గోవిం - కాని నేను రాజునన్న విషయం కూడా విస్మరింపరానిది — నక్షత్రా! త్రిపుర రాజ్యపు సరిహద్దుల కావల, నదీతీరాన నిర్మింపబడిన సౌధంలో — నీవు ఎనిమిదేళ్ళ ప్రవాస మనుభవించాలి— ఇది మా శాసనం. ... (నక్షత్రుని చేతులుగ్రహించి) సోదరా! ఈశిక్ష నీకేగాదు, నాకుగూడా! ప్రాసాదంలో నీవు లేనివెలితి — నిత్యమూ వేయిఋంపాల కోతవలె నా హృదయాన్ని చీల్చివెయ్యక మానదు. నాయనా! దైవం నిన్ను రక్షించుగాక.

[అందరూ నిష్క్రమణ

౧౧

[ప్రవేశం - రఘుపతి, జయసింగు.]

రఘు - నా అహంకారం భగ్నమైంది. నా బ్రాహ్మణత్వమే అవమాన కళంకితమైంది. నాయనా! ఇంక నేను నీ కాచార్యుణ్ణి కాను. నిన్నటివరకూ, నిన్ను శాసించగల అధికారం నాకుండేది. కాని, యీ రోజున నీ అనుగ్రహాన్నే అర్థించవలసిన గతి పట్టింది నాకు. రాజాధికారాన్ని సైతం తృణీకరించడానికి నా కధికారమిచ్చిన ఆ దివ్యజ్యోతి నాలో ఇప్పుడారిపోయింది. దీపకళికనైతే మరల మరల వెలిగించగలంగాని, రాలిపోయిన నక్షత్రాన్ని తిరిగి సాధించలేముగదా? నేనిప్పుడా పతిత నక్షత్రంవంటివాణ్ని.. జీవితం క్షణభంగురమైనది ... అయినా, ఆ జీవిత వ్యవధికొఱకే దీనాతి దీనుడనై మహారాజును ప్రార్థించవలసి వచ్చింది. జయసింగ్! ఈ ఒక్కరోజూ వృధా కానీయకు. రాజ రుధిరంతో దీనాంగన నేత్ర గోళాలలో అగ్నిదీప్తులు తీర్చిదిద్దు ... పలుకవేం, జయసింగ్! ఆచార్యుడిగా నీవద్ద నేడు నాకు స్థానం లేకపోయినా, పెంచిన మమకారానికైనా, నీకు పని వప్పగించడానికి నాకు హక్కులేదా? ఆహా! భిక్షలలోకెల్ల ప్రేమభిక్ష మిక్కిలి దౌర్భాగ్యకరమైనది.. ఇంకా మౌనమేనా నాయనా? అయితే! ఇదిగో చిన్నప్పటినుండీ నా అరచేతులలో పెరిగిన నీ పాదాలముందు మోకరిల్లుతాను జయసింగ్!

జయ - తండ్రీ! అసలే పగిలిపోయిన హృదయాన్ని మరింత బాధించకండి. దేవి రాజ రుధిరాన్నే వాంఛిస్తోంటే నేనిప్పుడే తెచ్చి ఆమెకు సమర్పిస్తాను. నేను నా ఋణం యావత్తూ తీర్చుకొంటాను. నా రాకకు కనిపెట్టుకొని ఉండండి. ఇప్పుడే వస్తాను.

[వెళ్లిపోతాడు

రఘు - అహా! ఈనాటికి భైరవీమూర్తి. మేలుకొన్నది. అదిగో! ఆమె భయంకర శాపధ్వానాలు నగరి నాలుగు దిక్కులా బొబ్బరిస్తూ, చెలరేగినాయి! క్షుధాగ్నికీలలతో కాళపిశాచాలు విజృంభించి, ఫెళాఫెళార్భాటాలతో యీ శిధిల ప్రపంచ వృక్షశాఖలను విఱిచి వేస్తున్నాయి తల్లీ! ఇంతకాలమూ నీభక్తులను పరీక్షించావా? లేతల్లీ! లే! సర్వసమర్థమైన నీ హస్తంతోనే ప్రళయ సన్నిభమైన నీ శక్త్యాయుధాన్ని ఎక్కుపెట్టు- ఎవరిదా, అడుగుల చప్పుడు?

[ప్రవేశం - అపర్ణ

అపర్ణ - జయసింగేడీ?

రఘు - ఛీ, శకునపక్షీ! పో (అపర్ణ పరిగెత్తుతుంది.) కాని, జయసింగ్ తిరిగి రాడేమో! కాదు, కాదు అతడన్నమాట చెల్లించుకు తీరతాడు. జై భవానీమాతా!. మధ్యలో ఏదైనా అవాంతరం సంభవిస్తే?— అంగరక్షకులచేత చిక్కి అపాయంకలిగితే? జై రుద్రమూర్తీ! - జగన్మాతా! నీ ప్రతిష్ఠ భగ్నం కానీయకు - నీ విరోధులు నిన్నుచూసి అపహసించనీయకు. తల్లీ! నీ పుత్రులే అవమానభారంతో నీ శత్రువులముందు శిరసు లొగ్గి నిలబడవలసివస్తే - యీ అనాధప్రపంచంలో ఇంకెవరు నీ దివ్యప్రతిభను వ్యక్తీకరింపగలరు?—అదిగో, అడుగుల చప్పుడు!- ఇంత త్వరగావస్తాడా? విఫలుడై రావడం లేదుగదా! లేదు, లేదు. అదియెన్నటికీ

జరగదు. తల్లీ! కాపాలినీ! నీ అనుగ్రహ మంటే ఎంతసేపు కావాలి! (జయసింగు సంభ్రమంతో ప్రవేశం) రక్తమేది జయసింగ్?

జయ - ఇదిగో, నా దగ్గరే ఉన్నది. నా చేతులు వదలండి. దేవికి స్వయంగా రక్త నైవేద్యం సమర్పించనీయండి (విగ్రహాన్ని సమీపించి) సకల చరాచర జగత్తునూ మాతృప్రేమతో పోషించి పెంచే ఓ లోక మాతా! నీకు రాజరుధిరం కావాలా?— నేను క్షత్రియుణ్ణి, నా పూర్వులు మూర్థాభిషిక్తులు. నా నాళాలలో రాజరక్తమే ప్రవహిస్తున్నది తల్లీ! దీనిని స్వీకరించి, నీ రక్త పిపాస శాశ్వతంగా చల్లార్చుకో! (పొడుచుకొని, క్రింద పడతాడు.)

రఘు - జయసింగ్! అయ్యో! జయ సింగ్! ఎంత పాపిష్ఠి పనిచేశావ్? జయ సింగ్! తండ్రీ! నన్ను క్షమించు నీవే నా హృదయ సర్వస్వానివి. తిరిగి నా హృదయ పీఠాన్ని చేరుకో. నీబదులు నేను మరణిస్తాను రా నాయనా!

[ప్రవేశం - అపర్ణ]

అపర్ణ - నా కిదంతా అయోమయంగా ఉంది. జయసింగేడీ? ఎక్కడున్నాడు?

రఘు - అపర్ణా! రా తల్లీ! రా! నీ ప్రేమైకస్వరంతో ఒక్కసారి జయసింగ్‌ను పిలువు. నీ ప్రేమగీతంతో వాడికి ప్రాణం పొయ్యి తల్లీ! వాడిని నీతోనే తీసుకుపో. వాడు బ్రతికితే నా కంతేచాలు (అపర్ణ లోనకు ప్రవేశించి, మూర్ఛిల్లుతుంది. రఘుపతి నెత్తిబాదుకుంటూ) నా జయసింగ్‌ను నాకు తెచ్చి యివ్వు! యివ్వు! యివ్వు! (నిలబడి, విగ్రహాన్ని నిర్దేశించి) చూడు, ఎలా చూస్తూందో! కేవలం శిలాప్రతిమ! కళ్లూ, చెవులూలేని పాషాణ ప్రతిమ! శోక వ్యాకులమైన యీ ప్రపంచమంతా నీ ఆలయ ప్రాంగణాన ఆక్రందిస్తోంది. అమాయిక మైన సుకుమార హృదయాలెన్నో నీ-కర్కశ పాదాలక్రిందపడి నలిగి, నశించిపోతున్నాయి- నా జయసింగును నాకు తెచ్చియివ్వు! యివ్వు! ఛీ! ఎందుకీ వృథాక్రందనఘోష? మన ప్రార్థనలన్నీ అరణ్యరోదనలై యీ శూన్యంలో — మనబుద్ధి భ్రమాజనితములైన శిలాప్రతిమలతో నింపివేయాలని వ్యర్థప్రయ త్నాలుచేసే యీ శూన్యంలో—కరిగిపోవడం కంటే వేరు ప్రయోజనంలేదు ఈ శిలా ప్రతిమలు నశించాలి! శిలారూపంలో అవత రించి, యీ ప్రపంచాన్ని దుఃఖమయంచేసే- యీ కల్పితమూర్తులు నిర్మూలం కావాలి!

[విగ్రహాన్ని పెకలించి, పారవేస్తాడు.

[ప్రవేశం: గుణవతి

గుణ - భవానీమాతకు జై!— అయ్యో! దేవియెక్కడ?

రఘు - దేవి లేదు.

గుణ - అమెను చూపండి ఆచార్యా! నేను నా కానుకలు తీసుకొనివచ్చాను. తల్లి క్రోధాగ్నిని చల్లార్చడానికై నా హృదయ రక్తాన్ని నివేదనగా తీసికొనివచ్చాను. మహా రాణి ఆడినమాట తప్పదని ఋజువుచేస్తాను. ఆచార్యా! చెప్పండి! దేవి యెక్కడున్నది?

రఘు - ఎక్కడా లేదు.

గుణ - అదేమిటి ఆచార్యా! దేవి ఇన్నాళ్ళనుండీ ఈ ఆలయంలోనే ఉన్నది గదా?

రఘు - దేవి! ఈ ప్రపంచంలో ఎక్క డైనాసరే నిజమైన దేవీ మూర్తి గనుకఉంటే యీ కళంకాల నన్నిటినీ సహించి ఊరుకో గలదా?

గుణ - అయ్యో! నన్ను బాధించకండి. నిజం చెప్పండి ఆచార్యా! దేవిలేనే లేదా?

రఘు - లేదు.

గుణ - అయితే, ఎక్కడున్నది?

రఘు - శూన్యం! కేవలం శూన్యం!

[అపర్ణ ఆలయం బయటకు వెళ్తుంది]

అపర్ణ - తండ్రీ!

రఘు - "తండ్రీ"! — ఎంత తియ్యగా పిలిచావు తల్లీ! మరణించిన నా పుత్రుడు నీ

కంఠంలో నిలిచి పిలుస్తున్నట్లుగా ఉంది. తల్లీ, ఆహా!

అపర్ణ - ఈ ఆలయాన్ని విడిచి వెళ్ళిపోదాం రా తండ్రీ!

[ప్రవేశం - రాజు]

గోవిం - దేవి లేదేం?

రఘు - లేదు. ఎక్కడా లేదు.

గోవిం - ఆ! ఈ నెత్తు రెక్కడిది!

రఘు - రాజా! నిన్ను ప్రేమించిన నా జయసింగు నేడు ఆత్మబలిదానం చేసుకున్నాడు.

గోవిం - ఆత్మబలిదానమా? కారణం?

రఘు - మానవ రక్తపానానికై ఆక్రోశించే అసత్యపదార్థాన్ని రూపుమాపడానికి.

గోవిం - ఆహా! జయసింగు ధన్యజీవి. మృత్యుంజయుడు — ఇదే నా ప్రేమకుసుమాంజలి

గుణ - ప్రభూ!

గోవిం - ఏమిదేవీ!

గుణ - ఇంకతల్లిలేదా?

గోవిం - లేదుదేవీ! ఆమె యీకఠిన శిలాగారాన్ని బద్దలు చేసికొని—స్త్రీహృదయపీఠంపై వెలిసింది!

అపర్ణ - రాతండ్రీ!

రఘు - రాతల్లీ! రా! ఇంతకాలానికి నేను నిన్ను గుర్తి పగలిగాను. నాతండ్రి, జయసింగు, నిన్నునాకు ప్రసాదించిపోయాడు! రాతల్లీ!

విద్యుత్ - చరిత్ర

శ్రీ డి. ఎ. ఎ. ఎస్. నారాయణరావు

ఒకప్పుడు తన కండరశక్తిమీద, పశుశక్తిమీద మాత్రమే ఆధారపడిన మానవుడు క్రమేపీ వాయు ప్రవాహం, నీటి ప్రవాహాలలోని చలనశక్తిని ఉపయోగించుకోవడం నేర్చుకొన్నాడు. శాస్త్రాభివృద్ధి మూలంగా ఉష్ణశక్తిని యాంత్రిక శక్తిగా మార్చగలగడంతో మానవుని నాగరికతలో పెద్ద విప్లవం వచ్చింది. బొగ్గు, చమురు మొదలైన పదార్థాలను మండించడం మూలంగా వచ్చిన ఉష్ణాన్ని తనకు కావలసిన పనికి ఉపయోగించే యాంత్రికశక్తిగా మార్చుకోవడం మొదలుపెట్టాడు ఆ తరువాత ప్రకృతిలో విద్యుచ్ఛక్తినిపుట్టించి, దానిని అనేక విధాలుగా ఉపయోగించుకోవడం నేర్చుకున్నాడు. ఇప్పుడు పట్టణాలలో ప్రతి ఇంటా విద్యుచ్ఛక్తి ఉపయోగింపబడుతూంది. పల్లెలలో కూడా ప్రవేశిస్తూంది. మానవునికి అవసరమైన పనులనెన్నో అతి సుళువుగా చేసికోడానికి వీలు కలుగచేస్తూంది. కాంతి నివ్వడం, పంకాలు తిప్పడం. వేడి నివ్వడం మొదలైన చిన్నచిన్న పనుల కేకాక, కర్మాగారాల్లో యంత్రాలను నడపడం, రైళ్ళను నడపడం మొదలయిన పెద్ద పనులు చేయడానికికూడా ఈవిద్యుచ్ఛక్తి ఉపయోగింపబడుతోంది. దీని సాయంతో యంత్రాలను నడపడంలో ఎంతో సౌకర్యముంది. మన దేశంలో విద్యుదుత్పత్తి ఎక్కువగా జరగడంలేదు. అందువలన దీని ఉపయోగం అంత ఎక్కువగా లేదుకాని, పారిశ్రామికాభివృద్ధి పొందిన పాశ్చాత్య దేశాలలో ఇది ఎంతో ఎక్కువగా ఉపయోగపడుతూంది. మానవ జీవిత విధానంలో ఇది ఒక పెద్ద మార్పుతెచ్చింది.

విద్యుత్తును ఉపయోగించుకోవడం, విద్యుత్తు ఒకచోటినుండి యింకొకచోటికి ప్రవహించేటట్లు చెయ్యడం తెలియకపోయినా, చలనంలేని విద్యుత్తును గురించి చాలా కాలంనుండి పాశ్చాత్య దేశస్థులకు తెలుసును రెండు పదార్థాలమధ్య రాపిడి కలుగచేసి, ఆ రెండింటిని వేరుచేసినపుడు, ఆ రెండింటిలో ఏదైనా చిన్న తేలికైన కాగితపు వుండలను ఆకర్షిస్తుందని చాలాకాలం నుంచీ తెలుసును ఈ విషయం మొదట ఎవరు కనిపెట్టారో చెప్పలేము కాని 16 వ శతాబ్దంలో నివసించిన విలియము గిల్బర్టు అను నతడు రాపిడి తరువాత విడిన పదార్థాలు విద్యుత్తు అనే దానితో ఆవేశింప బడ్డాయని, అందువలన కాగితపు వుండలను ఆకర్షిస్తున్నాయని అన్నాడు. ఈ విషయానికి

విద్యుత్తు అన్న పేరును ఇచ్చినవాడతడే. అతడు ఇంగ్లాండు దేశపు మహారాణి అయిన ఎలిజబెత్తుకు డాక్టరుగా వుండే వాడు. అయస్కాంతత్వము లోనూ, విద్యుత్తును గురించీ అనేక పరిశోధనలు చేశాడు.

గాజు కడ్డీలను, ఇబనైటు కడ్డీలను పిల్లి చర్మంతో కాని, సిల్కు గుడ్డతో కాని రాచి విద్యుత్తును పుట్టించే వారు మొదటిలో. తరువాత ఏ రెండు వస్తువులను రాపిడి చేసినా ఇలాగ విద్యుత్తు పుడుతుందని గ్రహించారు శాస్త్రజ్ఞులు. కాని కొన్ని పదార్థాలమీద ఆ విద్యుత్తు నిలవకుండా ప్రవహించి పోతుందని, కొన్నింటిమీద మాత్రమే నిలుస్తుందని గ్రహించారు ఉదాహరణకి రాగి, ఇత్తడి మొదలయిన లోహపు కడ్డీలు విద్యుత్తును తమగుండా ప్రవహింప చేసివేస్తాయి. అందుచేత వాటి మీద విద్యుదావేశం నిలవదు. గాజు, ఇబనైటు, కట్టి మొదలయిన పదార్థాల కడ్డీలు విద్యుత్తును ప్రవహింపనీయకుండా తమ మీద ఆపుకుంటాయి

ఇలా రాపిడివలన ఉత్పత్తిఅయి ప్రవహించకుండా విద్యుత్ నిరోధక పదార్థాలమీద ఆగేచలనరహితమైన విద్యుత్తు గురించి 18 వ శతాబ్దంలో అనేక పరిశోధనలు జరిగాయి ఈ పరిశోధనల వలన రెండు పదార్థాలు రాపిడి అనంతరం విడినపుడు అందులో ఒకటి ఒక రకము విద్యుత్తుతోను, ఇంకొకటి ఇంకొకరకం విద్యుత్తుతోను ఆవేశింపబడతాయని గుర్తించారు. వాటికే ధన విద్యుదావేశము, ఋణవిద్యుదావేశము అని పేర్లు పెట్టారు. అంతేకాకుండా ఇలా రాపిడిని అనేకమార్లు కలుగజేసి, ప్రతిసారివచ్చిన విద్యుదావేశాన్ని ఒక చోట పోగుచెయ్యడం నేర్చుకొన్నారు. అలా ఎక్కువ విద్యుదావేశం కలిగిన పదార్థాన్ని ముట్టుకొంటే షాక్ ఇస్తుందని తెలిసికొన్నారు.

చలనములేని విద్యుదావేశం గురించి చేసిన పరిశోధనలు విద్యుత్తును గురించిన జ్ఞానాన్నిచ్చాయే కాని, విద్యుత్తుని ఉపయోగించుకోడానికి పనికి రాలేదు విద్యుత్తు ప్రవహిస్తున్నపుడు వచ్చే ఫలితాలే ఎక్కువగా ఉపయోగిస్తాయి. విద్యుత్ప్రవాహం (Electric current) యొక్క ఫలితాన్ని మొట్ట మొదట గుర్తించినవాడు గాల్వనీ అను వైద్య శాస్త్రజ్ఞుడు. విద్యుత్ప్రవాహాన్ని గుర్తించే పరికరణానికి ఆ తరువాత గాల్వనోమీటరు అని పేరు పెట్టారు. అలాగ ఇతడిపేరు విద్యుచ్ఛాస్త్ర విద్యార్థులకు చిరపరిచితమై పోయింది.

ఈ గాల్వనీ ఇటలీ దేశస్థుడు. ఇతడు తన జన్మస్థానమైన బొలోనాలోనే ఎనాటమీ ప్రొఫెసరుగా ఉండేవాడు. ఇతడు విద్యుత్ప్రవాహంగురించిచేసిన పరిశోధన అనుకోకుండా ఛాన్సువలన జరిగింది.

కప్పల నరాలను లాగడంవలన దాని కండరములు ఎలా ప్రవర్తిస్తాయి అనే విషయంమీద పరిశోధనలు చేస్తున్నాడు, ఒక కప్పనుకోసి బల్లమీద పెట్టాడు. ఆ దగ్గరలో రాపిడివలన విద్యుదావేశాన్ని పుట్టించే యంత్రం ఉంది. ఇతడి అసిస్టెంటు ఒక లోహపు కడ్డీతో కప్ప నరాన్ని ఒకదానిని ముట్టుకోడం సంభ

వించింది. వెంటనే ఆ కప్ప కండరం సంకుచితమయింది. ఈవిషయం చాలా ఆశ్చర్యాన్ని కలుగచేసింది. దీనికీ విద్యుత్తుకీ సంబంధముండి తీరుతుందని గాల్వనీకి తట్టింది చాలా కప్పలనుకోసి లోహపుతీగెలద్వారా తన తోటలో వ్రేలాడదీశాడు, మెఱుపులు వచ్చినపు డల్లా వాటి కండరాలు ఎక్కువగా సంకుచితమయేవి మెఱుపులు విద్యుత్తు సంబంధమయిన వని అదివరకు నుండీ తెలుసును.

అందుచేత గాలిలోని విద్యుత్తు అలా కండరాలను సంకుచిత పరచిందని గుర్తించాడు. అతటితో ఊరుకోలేదు. ఈ విషయాన్ని గురించి అనేక రకాలుగా 11 సంవత్సరాలపాటు పరిశోధనలు చేశాడు. చివరకు పైవాటి కంటె అద్భుతమైన విషయాన్ని కనుగొన్నాడు. రాపిడివలన విద్యుత్తును పుట్టించే యంత్రమూ, మెఱుపులూ లేకుండానే, కప్ప కండరాలను సంకుచిత పరచగలిగాడు. కప్పను ఒక ఇనుప పళ్లెంమీద ఉంచి, దాని నరానికి ఒక ఇత్తడి తీగను తగిల్చాడు. ఆ తీగ రెండవ చివరను పళ్లెమునకు నొక్కగానే కప్ప కండరాలు సంకుచితమయ్యాయి చుట్టుపట్ల ఎక్కడా విద్యుత్ యంత్రాలు లేకపోయినా ఇలాగ రెండు భిన్నలోహాలను కప్ప కండరం నరాలద్వారాకలపడంవలన కప్పకండరం సంకోచిస్తూంది. కనుక కప్ప శరీరం లోనే ఏదో ఒక కొత్తరకం విద్యుత్తు ఉంది. అదే లోహపు తీగలద్వారా నరంనుండి కండరానికి ప్రవహిస్తూ సంకోచాన్ని కలిగిస్తూంది అని అనుకున్నాడు. ఈకొత్తరకం విద్యుత్తు కప్ప శరీరంలోనే ఉంది కనుక ఇది జంతు సంబంధమైన విద్యుత్తు అన్నారు కొందరు గాల్వనీ తన పరిశోధనలన్నీ ఒక పెద్ద వ్యాసంక్రింద 1791 లో ప్రచురించాడు

గాల్వనీ పరిశోధనలను వోల్టా అనే ఇంకొక ఇటాలియను శాస్త్రజ్ఞుడు కొనసాగించాడు. ఇతడు పావియా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసరుగా ఉండేవాడు. విద్యుదావేశములగురించి అంతకు ముందే పరిశోధనలు చేస్తూవుండేవాడు గాల్వనీ కప్పలమీదచేసిన విద్యుత్ప్రయోగాలను గురించిన వ్యాసం ప్రచురించగానే ఇతడుకూడా ఆ విషయంమీద ప్రయోగాలుచేశాడు. భిన్న లోహాలతో కప్పను తాకినపుడు, ఆ లోహాలవలననే విద్యుత్తు పుట్టిందనీ అంతేగాని అది కప్ప శరీరంలోలేదనీ ఇతడు అన్నాడు. కప్ప శరీరంలో ఉన్న కొన్ని ద్రవాలతో రెండు భిన్న లోహాలు సంపర్కానికి రావడంద్వారా విద్యుత్తు పుడుతూందని ఇతని వుద్దేశం. మనిషి నాలికమీద రెండు భిన్నలోహపు తీగెలను ఉంచి, వాటి చివరలను కలిపినపుడు కూడా విద్యుత్తు పుట్టడంవలననే జిల్లుమనే భావం కలుగుతుందని చెప్పాడు. ఆ తరువాత జీవ సంబంధమయిన ద్రవాలు అవసరంలేకుండానే ఇతర ద్రవాలలో లోహపు కడ్డీలను ముంచడం ద్వారా విద్యుత్తును పుట్టించగలిగాడు ఇతడు.

ఒక కప్పులో ఉప్పునీటిని పోసి, అందులో రెండు భిన్న లోహపు కడ్డీ

లను ముంచడం ద్వారా విద్యుత్తును పుట్టించాడు. కొన్ని కడ్డీలు యీ ఫలితాన్ని ఎక్కువగా చూపుతాయి కొన్ని తక్కువగా చూపుతాయి వివిధ రకాల కడ్డీలమీద అనేక ప్రయోగాలుచేసి ఆ వివిధ లోహాలను అవి ఇవ్వగల విద్యుత్తును బట్టి ఒకవరుసలో యేర్పరిచాడు వేరు వేరు పాత్రలలో రెండేసి కడ్డీల చొప్పున ఉంచి ఒకదానికొకటి కలిపి, ఈ ఫలితాన్ని బహుళీకృతం చేయవచ్చునని చూపెట్టాడు.

ఈ పాత్రలలోని చివరి కడ్డీలను కలిపినపుడు విద్యుత్తు ప్రవహిస్తుంది విద్యుత్ప్రవాహాన్ని చాలాసేపు ఇవ్వగలిగిన పరికరణం వచ్చింది ఈ విధంగా. రాపిడివలన పుట్టే విద్యుదావేశం అతి స్వల్పం. దానినెక్కువగా ఒకచోట పోగుచేయగలిగినా దానిని ఒక లోహపుతీగెతో ముట్టుకుంటే క్షణికంగా విద్యుత్ప్రవాహాన్నిచ్చి అంతమైపోతుంది. కాని వోల్టా పరికరిణంలో అలాకాకుండా, విద్యుత్ప్రవాహాన్ని చాలాసేపు ఇవ్వగల శక్తివుంది. వోల్టా పరికరణంలో కొన్ని రసాయనిక మార్పులవలన ఇలా విద్యుచ్ఛక్తిపుట్టి, విద్యుత్ప్రవాహాన్ని కలుగజేస్తూంది. వోల్టా పరిశోధనలు యూరపు అంతటా విస్మయాన్ని కలుగజేశాయి. పారిస్‌లో సైన్సు ఎకాడమీ అతడిని తన పరిశోధనలమీద ఉపన్యాసమిమ్మని ఆహ్వానించింది ఆ ఉపన్యాసంద్వారా వోల్టా నెపోలియను బోనపార్టి గౌరవానికి పాత్రుడయ్యాడు ఈ విద్యుత్పరికరణాన్ని కనిపెట్టినతరువాత వోల్టా ఏమీ పరిశోధనలు చెయ్యలేదు. 1804 లో అతడు తన యూనివర్సిటీ ప్రొఫెసరు షిప్పునుండి విరమించదలచుకొన్నాడు.

కాని అప్పటికి ఇటలీని జయించిన నెపోలియను అందుకొప్పుకో లేదు "వోల్టా తన ఉద్యోగంనుండి విరమించడానికి నేను ఒప్పుకోలేను. ప్రొఫెసరుగా అతడికి పని ఎక్కువగా ఉంటే, ఆపనిని తగ్గించాలి అతడు ఏడాదికి ఒకటే ఉపన్యాసం ఇవ్వవచ్చును. అంతేకాని అతడి పేరు యూనివర్సిటీ ఉద్యోగస్థుల పట్టికను డి తప్పించడానికి నేనుఒప్పుకుంటే అది యూనివర్సిటీకి అప్రతిష్ట" అని అంటూ నెపోలియను అతడిని ఆఉద్యోగంలోనే వుంచాడు నెపోలియనుకు విజ్ఞానశాస్త్రముమీద ఉండే అభిమానం తెలుస్తుంది దీని వలన, కాని అలా కొంతకాలమున్నాక, చివరిస వత్సరాలలో వోల్టా ఉద్యోగం వదలి, తన స్వగ్రామములోనే జీవితంగడపి, 82 వ ఏట మరణించాడు.

ఇలాగ గాల్వనీ, వోల్టాల పరిశోధనలు విద్యుత్ప్రవాహాన్ని కలిగించడానికి తగిన పరికరణాన్ని ఇచ్చాయి. ఈపరికరణం నిర్మించడం అతిసులభమైన పని కనుక ప్రతిదేశంలోనూ దీనిని నిర్మించి, విద్యుత్ప్రవాహంమీద శాస్త్రజ్ఞులు అనేకవిధాలైన పరిశోధనలు చేశారు చాలమంది దీనిలో అభివృద్ధి తెచ్చి వోల్టా పరికరణం కంటె మంచి వానిని నిర్మించారు వీటికి విద్యుద్ఘటాలు (ఎలెక్ట్రిక్ సెల్స్) అని పేరు. ఇటువంటి విద్యుద్ఘటాలలో ఒకరకమే

మన బేటరీలైట్లలో విద్యుత్ప్రవాహం ద్వారా కాంతి నిస్తున్నాయి

18 వ శతాబ్దం చిట్టచివరి రోజులలో ఇలాగ విద్యుత్ప్రవాహాన్నివ్వ గలిగిన విద్యుద్ఘటం వచ్చింది 19 వ శతాబ్దం మొదటిలో అభివృద్ధిపొందింది. అక్కడి నుంచి విద్యుత్ప్రవాహ ఫలితాలగురించి అతిజోరుగా పరిశోధనలు జరిగాయి. విద్యుద్ఘటం నుండి వచ్చే విద్యుత్ప్రవాహాన్ని కొన్ని ద్రవాల ద్వారా పంపి, వాటిని విభజించారు. నీటిని తొలిసారి ఉదజని, ఆమ్లజని అనే వాయువుల క్రింద విభజించారు. ద్రావకాలను విద్యుత్తుద్వారా విభజించడం విషయములో సర్ హంఫరీ డేవీ అను నతడు ఎక్కువగా పరిశోధనలు చేశాడు. తరువాత ఫేరడే ప్రయోగాలు ప్రసిద్ధిచెందినవి ఈ ప్రయోగాల మూలంగానే ఇప్పుడు కొన్ని ఖనిజాలనుండి మూల పదార్థాలను వేరుచెయ్యడం, విద్యుత్తు ద్వారా కళాయిపెట్టడం వెండి బంగారు పూతలు పుయ్యడం మొదలైన పనులు వీలవుతున్నాయి

విద్యుత్తుకీ అయస్కాంతత్వానికీ ఎక్కువగా సంబంధముంది. అయస్కాంతత్వమన్నది వెయ్యిసంవత్సరాల నుంచీ తెలుసు. విలియము గిల్బర్టు అయస్కాంతత్వములో కూడా చాలా విషయాలు స్థాపించాడు విద్యుదయస్కాంతత్వముల మధ్య సంబంధాన్ని చూపినవాడు ఆయిర్ స్టెడ్ అను డేనిష శాస్త్రజ్ఞుడు ఆతడు యూనివర్సిటీలో నక్షత్ర, భౌతిక, వైద్యశాస్త్రములను అభ్యసించాడు అంతేకాకుండా వేదాంత విషయములందు శ్రద్ధచూపుతూ, 22 వ యేట వేదాంతముమీద వ్యాసము ద్వారా డాక్టరేటు డిగ్రీ సంపాదించాడు. మొదటిలో మందుల షాపులో ఉద్యోగిగా ఉంటూ తీరికకాలంలో భౌతికశాస్త్ర పరిశోధనలు చేసేవాడు కాని ఆ పరిశోధనలలో కొంత పేరు గణించాక కోపెన్ హేగెనులో ఫిజిక్సు ప్రొఫెసరుగా నియోగింపబడ్డాడు.

వోల్టా సెల్ తో వచ్చే విద్యుత్ప్రవాహం గురించి పరిశోధనలుచేస్తూ ఒకతీగగుండా విద్యుత్ప్రవాహ మున్నప్పుడు, దాని దగ్గరగాఉన్న అయస్కాంతపు సూది తనకు మామూలైన ఉత్తర దక్షిణ దిక్కునుండి కదులుతుందని చూపెట్టేడు. తీగలో విద్యుత్ప్రవాహమున్నపుడు, దానిచుట్టూ ఒక అయస్కాంతపు క్షేత్రముండడమే దీనికి కారణం అదేసూదిని తనమామూలుదిక్కునుండి మరల్చుతుంది. ఈ విషయం వెంటనే అనేకమంది శాస్త్రజ్ఞుల దృష్టి నాకర్షించింది. కొన్ని నెలలలోనే ఎన్నో ముఖ్యమైన విషయాలుకనుగొనబడ్డాయి.

ఆంపియరు, ఓమ్అను శాస్త్రజ్ఞులపరిశోధనలు చాలా ముఖ్యమైనవి. విద్యుత్ప్రవాహాన్ని కొలిచే పరికరణాలు ఈ సూత్రంమీద ఆధారపడే నిర్మింపబడ్డాయి. విద్యుత్ప్రవాహం మూలంగా ఉక్కు (steel) కడ్డీలను అయస్కాంతాలుగా మార్చడానికివీలయింది. ఇలాగ పెద్ద అయస్కాంతాలను తయారు చెయ్యడానికి వీలయింది, అంతేకాకుండా మంచి ఇనుము (soft iron) చుట్టూ ఒక తీగె చుట్టి, దానిలో విద్యుత్ప్రవా

...న్ని పంపినపుడు, ప్రవాహమున్నంత సేపూ ఆ ఇనుపకడ్డీ అయస్కాంత ముగా మారుతుంది. ప్రవాహం ఆగిపో గానే కడ్డీయొక్క అయస్కాంతత్వం పోతుంది దీనిని విద్యుదయస్కాం తము (electro magnet) అంటారు దీనిమూలంగానే విద్యుత్ప్రవాహం వలన గంటలు కొట్టించడం, టెలిగ్రాములు పంపడం మొదలైనవి వీలయినై. విద్యుత్ప్రవాహం యొక్క ఉపయోగా లలో చాలా అదికలిగించే అయస్కాంత క్షేత్రంవలననే వీలవుతున్నాయి.

ఓమ్ అనునతడు విద్యుత్ప్రవాహానికి వేరు వేరు తీగలు గలిగించే నిరోధాన్ని (resistance) గురించి పరిశ్రమలు చేసి ఒక సూత్రాన్ని ఇచ్చాడు. ఒకేఒక విద్యు ద్బలానికి (voltage) నిరోధం ఎక్కు వయినకొద్దీ విద్యుత్ప్రవాహం కొలత తగ్గుతుందని చూపెట్టాడు. విద్యుత్ప్రవా హానికి, బలానికి నిరోధానికి గల సంబం ధాన్ని ఒక సూత్రంలో ఇచ్చాడు. విద్యుత్తు నిరోధమును గురించినఅభిప్రా యాన్ని తెచ్చినవాడు ఇతడే.

వాట్ అనునతడు విద్యుత్ నిరోధ మును కలిగించే తీగెలగుండా విద్యుత్తు ప్రవహించినపుడు వేడి పుడుతుందని చూపెట్టాడు. ఆ వేడిని కొలిచి అది విద్యుచ్ఛక్తికి సమాన మని చూపెట్టాడు. ఎక్కువ నిరో ధాన్ని కలిగించే తీగలను ఉపయోగిం చడంద్వారా క్రమేపీ ఎలెక్ట్రిక్ హీటర్లు, ఎలక్ట్రిక్ లైట్లు వచ్చేయి. వీటిలో ఉండే వల్లా ఎక్కువ నిరోధం కలిగిన తీగెలు. వేడి ఎక్కువగా పుడుతుంది. ఆ వేడి మరీ ఎక్కువై తాపక్రమం 1500 డిగ్రీలపైకి పోయినపుడు, ఎలక్ట్రిక్‌లైట్లు వస్తున్నాయి. ఓమ్, వాట్ శాస్త్రజ్ఞుల పరిశోధనలే ఇలాగ విద్యుత్తు ఉపయోగ పడడానికి దారితీసేయి.

విద్యుచ్చరిత్రలో మైకేల్ ఫేరడే పరిశోధనలు అతి ముఖ్యమైనవి విద్యుత్తు ఎక్కువగావుపయోగపడడానికి పరిశ్రమలలోకి వెళ్ళగలగడానికి అతని పరిశోధనలే కారణము. విద్యుచ్ఛక్తిని ఎక్కువగా పుట్టించగల డైనమోకు, విద్యుత్తువల్ల యాంత్రికశక్తిని గలిగించే మోటారుకు, అతని పరిశోధనలే మూలము.

మామూలు చిన్న ఎలెక్ట్రిక్ సెల్స్‌తో ఒక యంత్రాన్ని నడప డానికి 1837వ సంవత్సరంలో ప్లానులు వేస్తే, ఆవిరి యంత్రంతో నడపడం మూలంగా అయే ఖర్చుకి 60 రెట్లు ఖర్చు అవుతుందని తేలింది. పరిస్థితులు అలాగే ఉంటే, విద్యుత్తు మానవుని నిత్యజీవితంతో సంబంధం లేకుండా, శాస్త్రజ్ఞుల పరిశోధనాగారములలోనే ఉండిపోయేది కాని ఫేరడే పరిశోధ నలు విద్యుచ్ఛక్తిని విపరీతంగాను చవక గాను పుట్టించడానికి అవకాశాలు కలుగ చేసాయి కనుక విద్యుత్తు మన నిత్య జీవితంలోకి రాగలిగింది. అందుచేత ప్రస్తుత విద్యుత్పరిశ్రమకంతా ఆధార భూతుడు ఫేరడే అని అనడంలో అతి శయోక్తిలేదు

లండను నివాసి అయిన ఒక కంసాలి మూడవ కొడుకు ఫేరడే. చిన్నతనంలో ఒక స్కూలులో కొద్దిగా విద్యనేర్చు

కొన్నాడు కాని ఆర్థిక పరిస్థితులవలన యూనివర్సిటీ విద్యనుపొందే అవకాశం లేకుండా పదమూడవ ఏటనే ఒక పుస్తకాల వర్తకునివద్ద ఎప్రింటిస్‌గా చేరవలసి వచ్చింది. మొదటిలో నాలుగేళ్ళపాటు వార్తాపత్రికలను పంచిపెట్టడంలో నియోగింపబడ్డాడు. ఆ తరువాత పుస్తకాల బైండింగు నేర్చుకొన్నాడు. ఆ కాలంలో బైండింగుకొరకు వచ్చిన శాస్త్ర సంబంధమయిన పుస్తకాలు అతడిని ఆకర్షించాయి. వాటిని చదువుతూ ఉండేవాడు. దానితో అతడిలో శాస్త్రజిజ్ఞాస రేకెత్తింది. తీరిక కాలంలో శాస్త్ర పఠనంచేస్తూ, శాస్త్రోపన్యాసాలు వింటూ జ్ఞానాన్ని సంపాదించుకొని, రాయల్ ఇన్‌స్టిట్యూషన్‌లో సర్ హంఫరీడేవీ దయవలన లేబరేటరీ అసిస్టెంటు పని సంపాదించుకొన్నాడు కాని త్వరలోనే తన శక్తి సామర్థ్యాలద్వారా డేవీకి శిష్యుడై, సహకారియై, చివరకు డేవీ స్థానాన్నే ఆక్రమించుకొన్నాడు. రాయల్ ఇన్‌స్టిట్యూషను ప్రొఫెసరుగానే చివరి వరకూ ఉండి, 1858 లో పనినుండి విరమించాడు. విక్టోరియా మహారాణి ఇతడికి ప్రసాదించిన ఇంటిలో జీవిత శేషాన్ని గడిపి, 65వ యేట మరణించాడు. కుశాగ్రబుద్ధితో అతి ముఖ్యమైన పరిశోధనలు చేసిన ఇంతటి మేధావంతుడికి చివరి రోజులలో కొంత మందమరపు వచ్చిందంటే విధికృతము ఎలాగుంటుందో ఊహింపలేమన్నమాట.

ఒక అయస్కాంతక్షేత్రంలో ఒక తీగను ఉంచి, ఆ తీగలోనికి విద్యుత్ప్రవాహాన్ని పంపినట్లయితే, తీగమీద ఆ అయస్కాంతక్షేత్రం కొంత బలం (force) కలిగి వుంటుంది. ఎందుకంటే తీగలో విద్యుత్ప్రవాహం ఉన్నప్పుడు దాని ననుసరించి ఒక అయస్కాంతక్షేత్రం వచ్చింది. దీనికీ మొదటిక్షేత్రానికీ ఉన్న సంఘర్షణ మూలంగా ఆ తీగమీద మొదటిక్షేత్రం కొంత బలం కలిగిఉంటుంది. దానివలన ఆ తీగ కదిలేటట్లు చేయవచ్చును. ఈ బలంద్వారా విద్యుత్ప్రవాహాన్నీ మోయుచున్న ఆ తీగను గుండ్రంగా తిరిగేటట్లు చేయగలిగేదు ఫేరడే. ఇలాగ విద్యుత్ప్రవాహంనుండి తీగయొక్క చలనం తేగలిగాడు ఇదే తరువాత ఎలక్ట్రిక్ మోటారు నిర్మాణానికి పునాదిఅయింది.

ఎలక్ట్రిక్ మోటారులో ఒకపెద్ద అయస్కాంతముంటుంది. దాని క్షేత్రంలో ఉన్న ఒక తీగచుట్టగుండా విద్యుత్తును పంపడం మూలంగా, ఆ తీగచుట్ట గిర్రున తిరుగుతుంది. ఈ సూత్రము మీదనే పంకాలు తిరుగుతాయి, విద్యుత్తు వలన యంత్రాలు, ట్రాములు నడుస్తాయి.

విద్యుత్ప్రవాహంతో అయస్కాంత క్షేత్రం పుడుతుందని ఆయిర్‌స్టెడ్ పరిశోధనల మూలంగా అందరికీ తెలిసినదే. విద్యుత్తుతో అయస్కాంతత్వమును పుట్టించినపుడు, అయస్కాంత త్వముతో విద్యుత్తును పుట్టించలేమా, లేకఒక చోట విద్యుత్ప్రవాహంతో ఇంకొకచోట విద్యుత్ప్రవాహాన్ని పుట్టించలేమా అనే సమస్య తట్టింది ఫేరడేకి. పుట్టించవచ్చుననే ఆశకల్గింది. దానికొరకై తీవ్రంగా పనిచేశాడు. రెండు తీగచుట్టలను ఒకదానిప్రక్క నొకటి పెట్టాడు.

మొదటిదానిలోనుండివిద్యుత్ప్రవాహాన్ని పంపుతూ, రెండవదానిలో విద్యుత్తు పుడుతుందేమోనని చూశాడు. ముందు ఏమీ అగపడలేదుకాని జాగ్రత్తగాచూస్తే మొదటి తీగలో ప్రవాహం స్థాపించబడి స్థిరంగా ఉన్నప్పుడుగాక, అది మొదలైనప్పుడు అంతమైనప్పుడు రెండవ తీగలో కొద్దిగా విద్యుత్తు క్షణికంగా ప్రవహిస్తుందని తెలిసింది. దీనికి విద్యుదయస్కాంత ప్రేరేపణ (electro magnetic induction) అని పేరు. ఒక తీగలో విద్యుత్ప్రవాహపు మార్పులు రెండవ తీగలో విద్యుత్తుని ప్రేరేపించాయి.

ఒక తీగను అయస్కాంతక్షేత్రంలో ఉంచి ఆక్షేత్రాన్నిమారిస్తే చాలు. ఆ తీగలో విద్యుత్తుపుడుతుందని తరువాత గ్రహించాడు. లేక అయస్కాంతక్షేత్రములో ఒక తీగను కదల్చినా లేక త్రిప్పినాకూడా విద్యుత్తు పుడుతుంది ఇలాగ విద్యుదయస్కాంత ప్రేరేపణ ద్వారా విద్యుచ్ఛక్తిని ఎక్కువగా పుట్టించవచ్చునని ఫేరడే కనుగొని మార్గాన్ని చూపాడు. ఈపరిశోధనలమీద ఆధారపడే విద్యుత్తును పుట్టించే డైనమో యంత్రం వచ్చింది. ఈయంత్రంలో బలమైన అయస్కాంతక్షేత్రంలో తీగలు చుట్టబడిన ఒక సిలిండరు గిఱ్ఱునతిరుగుతూ ఉంటుంది. దానితోపాటు ఆ తీగలు అయస్కాంతక్షేత్రంలో తిరగబట్టి వానిలో విద్యుత్తు పుడుతుంది. క్షేత్రంతీక్ష్ణతనుబట్టి, తీగలుతిరిగే వేగాన్నిబట్టి, వానిసంఖ్యనుబట్టి విద్యుత్తును ఎంతేనా ఎక్కువగా పుట్టించవచ్చును.

ఇలా ఎక్కువగా విద్యుత్తును పుట్టించడానికి వీలయింది కనుకనే, విద్యుత్తును పట్టణాలకూ పరిశ్రమలకూ సరఫరా చేయడానికి వీలయింది. విద్యుదయస్కాంత ప్రేరేపణను 1831 లోనే ఫేరడేకనుగొన్నా, 1870 తరువాతనే డైనమో ఎక్కువగా విద్యుచ్ఛక్తిని సరఫరాచేసే స్థితిలోకి వచ్చింది.

ఫేరడేకనిపెట్టిన విద్యుదయస్కాంత ప్రేరేపణ వలననే ట్రాన్సుఫార్మరు, ఇండక్షనుకాయిలన్నవి వచ్చాయి. ఒక తీగచుట్టచుట్టూ ఇంకొక తీగచుట్టబడి ఉంటుంది. రెండవచుట్టలో ఎక్కువ చుట్లు వుంటాయి. మొదటిదానిలో ఆల్టర్నేటింగు కరెంటును పంపినట్లయితే రెండవచుట్టులో విద్యుత్తు ప్రేరేపింపబడుతుంది. రెండవ దానిలో చుట్లు ఎక్కువ చేయడంమూలాన్న దాని చివరల వుండే విద్యుద్బలం (voltage) మొదటదానిలోకంటె చాలా ఎక్కువ చేయవచ్చును. ఈట్రాన్స్ఫర్మర్లున్నవి ఇలాగ విద్యుత్తును తక్కువ వోల్టేజి నుండి ఎక్కువవోల్టేజికి మార్చగలవు. విద్యుత్తును ఒకచోటినుండి ఇంకొక చోటికి పంపడంలో ఇవి ఎక్కువగా ఉపయోగపడుతున్నాయి, అంతేకాక వీటి మూలంగానే ఎక్కువ వోల్టేజివీలయి, ఎన్నో కొత్తపరిశోధనలకు దారితీసింది. ఎక్సురేలను తయారుచేయడానికి 50 వేలు మొదలు లక్షవోల్టుల విద్యుత్తును ఉపయోగించాలి. ట్రాన్స్ఫర్మర్లవల్లనే అదివీలయింది.

మైకేల్ ఫేరడే పరిశోధనలు ఇలాగ విద్యుత్పరిశ్రమకంతా పునాదిలయినవి.

ఫేరడేవిద్యుద్యుగ నిర్మాతఅని చెప్ప వచ్చును ఇంగ్లీషు ప్రధానమంత్రి విలియంపిట్ . నీపరిశోధన ఉపయోగ మేమిటి,అని ఫేరడేను ఒకమారు అడిగాడట 'త్వరలోనేమీరు ఒక కొత్త పన్నును విధించడానికి వీలుకలుగ చేస్తాయి' అని జవాబిచ్చాడట ఫేరడే. అలాగే అయింది

ఫేరడే కాలంతరువాత ఆల్టర్నేటింగు కరెంటుమీద పరిశోధనలు యెక్కువయాయి. ఆల్టర్నేటింగు కరెంటు అన్నది ఒకమారు ఒకవేపు, ఇంకొక మారు యెదురుదిక్కులోను ప్రవహిస్తుంది అలా సెకండుకి ఎన్నోమార్లు మారుతుంది మనకు పట్టణాలలోవచ్చే ఆల్టర్నేటింగు కరెంటు సాధారణంగా సెకండుకి 50మార్లు ఇలా దిక్కును మార్చుకుంటుంది. ఆల్టర్నేటింగు కరెంటువిషయమైన పరిశోధనలవలన కొన్ని ప్రత్యేక పరిస్థితులలో విద్యుత్సంబంధమైన అలలు బయలుదేరుతాయని తెలిసింది.

మేక్స్వెల్ శాస్త్రజ్ఞుడు సిద్ధాంత పూర్వకంగా ఇటువంటి ఉద్దేశాలకు దారి తీశాడు. హెర్ట్జ్ అనునతడు ఆ విద్యుత్తు సంబంధమయిన అలలను ప్రాయోగికంగా 1888 లో చూపెట్టాడు. అవి కాంతివేగంతో చుట్టుపట్ల వ్యాపిస్తాయని చూపెట్టాడు. హెర్ట్జ్ జర్మను దేశస్థుడు. ఒక టెక్నికల్ స్కూలులో ఉపాధ్యాయుడుగా వుంటూ ఈ ముఖ్యమైన పరిశోధనలు చేశాడు. విద్యుత్సంబంధమయిన మార్పులను అయస్కాంత సంబంధమైన మార్పులు కూడా ఎప్పుడు అనుసరిస్తూవుంటాయి. కనుక ఈ అలలలో రెండు రకముల మార్పులూ వుంటాయి. వీటిని విద్యుదయస్కాంతపు టలలు (Electro magnetic waves) అంటారు ఇవే తరువాత మార్కొనీ చేతులలో వృద్ధిపొంది వైర్‌లెస్ (తీగల అవసరం లేకుండా) తంతులు పంపడానికి వీలు కలుగచేశాయి. ఆ తరువాత ఫ్లెమింగు శాస్త్రజ్ఞుడు రేడియో వాల్వును ప్రవేశపెట్టడం మూలంగా రేడియో బ్రాడ్‌కాస్టింగుయొక్క విపరీతమైన అభివృద్ధికి దారితీశాయి.

విద్యుచ్ఛక్తిని సాధించడంమూలంగా పదార్థాన్నిగురించిన జ్ఞానంకూడా విపరీతంగా వృద్ధిపొందింది. పదార్థము విద్యుత్కణ నిర్మితమని తేలింది. క్రూక్స్, తాంప్సన్ శాస్త్రజ్ఞులు అతి తక్కువ ఒత్తిడిలో వున్న వాయువులకు విపరీతమైన ఒత్తిడిగల విద్యుత్తును ప్రయోగించి, ఎలక్ట్రాను లనే విద్యుత్కణాలు రావడం కనుగొన్నారు.

19 వ శతాబ్దంచివరలో, ఆ తరువాత ప్రయోగాలవలన ఈ కణాలు పదార్థంయొక్కపరమాణువులలోనివని తేలాయి. పరమాణువులన్నీ ఎలక్ట్రాను, ప్రోటాను, న్యూట్రాను లనబడే మూడు మూలకణాల సమ్మేళనమువలన వచ్చాయి. ఎలక్ట్రానులన్నవి ఋణవిద్యుత్కణాలు, ప్రోటానులు ధన విద్యుత్కణాలు, పరమాణువు మొత్తంమీద సమానసంఖ్య గల ప్రోటాను, ఎలక్ట్రానులను కలిగి వుండడంమూలంగా పైకి విద్యుత్‌రహితంగా అగపడుతుంది.

ఇలాగ విద్యుత్తును గురించిన పరిశోధనలు విద్యుత్ప్రవాహం మానవ జీవితంలో అనేక విధాలుగా దీపాలకు, పంకాలకు, రైళ్ళు నడపడానికి, పారిశ్రామిక యంత్రాలు నడపడానికి, తంతి వార్తలు పంపడానికి, రేడియో బ్రాడ్ కాస్టింగుకు, ఎక్సుకిరణాల నివ్వడానికి ఉపయోగపడడమే కాకుండా, ద్రవ్యం యొక్క అంతరార్థాన్ని తెలియచేశాయి. ద్రవ్య స్వరూపం యీ పరిశోధనల మూలంగా తెలియబట్టే, ఒక మూలపదార్థాన్ని ఇంకొక మూల పదార్థంలోకి మార్చగలగడం, ద్రవ్యాంతర్భాగం (పరమాణువు) లోనుండి శక్తిని తేవడం మొదలైన పనులు యీ మధ్య వీలయాయి.

భావుకత్వం

శ్రీ అయల సోమయాజుల నృసింహ శర్మ



'నామరూపాత్మకం జగత్" అన్న ప్రతీతి సత్యమైనది నామరూపాలు ఒకే జ్ఞానం యొక్క సూక్ష్మశాఖాభేదాలు

మనం ఒక విషయాన్ని ఎదుటివాడికి తెలుపుతాం అప్పుడు మన బుద్ధిలో ఉన్న విషయాన్ని మాటతో చెప్తాము

అంటే బుద్ధిలో జ్ఞానంగా ఉన్న విషయమే మాటలలో శబ్దరూపంగా ఉంది. ఎదటివాడు ఆ శబ్దాలని విని ముందు శబ్దరూపంగా గ్రహిస్తాడు. తరువాత అది వాడిబుద్ధిలో మళ్ళీవిషయరూపాన్నే చెందుతుంది. మన బుద్ధిలో ఉన్నప్పుడు విషయం ఎలా ఉంటుందో అలాగే ఎదటివాడి బుద్ధిలోకూడా ఉంటుంది. అంచేత విషయం చెప్పేటప్పుడు శబ్దరూపంతోటీ, గ్రహించేటప్పుడు విషయాకారంతోటీ, ఉంటుంది. ఇలాగే ఒక వస్తువును చూసేటప్పుడు ఆవస్తురూపం నామాభిన్నంగానే మనకి స్ఫురిస్తుంది. అలాగే శబ్దం వినేటప్పటికి అది అర్థాభిన్నంగానే బుద్ధిలో స్ఫురిస్తుంది. కాబట్టి పెద్దలు విశ్వం నామరూపాత్మకం అని అన్నారు.

ఇది లోకవాస్తవికరూపం ఇందులో సుఖదుఃఖాలు వాస్తవము అనే జ్ఞానం ఉండడంచేత సుఖదుఃఖాలుగా అనుభవింపబడుతున్నాయి. స్వప్నకాలంలో సుఖదుఃఖాలు అలాగే అనుభవింపబడతాయి. కాని స్వప్నాంతమందు జాగ్రదవస్థలో స్వప్నంస్మరణరూపాన్ని చెంది ఆనందప్రదమవుతుంది. మనుజుల్లో అనుభవించేటప్పుడుసుఖదుఃఖాలుసుఖదుఃఖాలే. కాని స్మరణలో విలక్షణానందాన్ని కల్పిస్తాయి. బాగా కష్టపడ్డవ్యక్తి తనకష్టాలను వినిపిస్తాడు. ఎదటివాడు ఓపికతో విని సానుభూతిచూపితే విలక్షణానందాన్ని పొందుతాడు. అంచేతే ప్రతివ్యక్తి ఎవరితోనైనా అనుభూతమైన కష్టాన్ని చెప్పుకుంటాడు. అలా చెప్పడంలో విలక్షణానందం ఉంది. నల్గురితో మాట్లాడనివాళ్ళు, అత్యధికార వర్గానికి చెందిన వాళ్ళు ఈ సుఖంలేక వాచిపోతారు

కష్టాన్ని చెప్పుకోడంలో ఆనందం ఎం దుకు కలుగుతుంది అంటే, చెప్పుకున్న ప్పుడు అది స్మరణ మాత్రమేకాని అక్కడ అనుభూతిలేదు. అక్కడ అనుభూతి స్మరణానుభూతి మాత్రమే అవుతుంది. వాస్తవానుభూతిలో ఉన్న ట్లే స్మరణలో సాత్వికభావాదుల స్ఫురిస్తున్నాయి. ఏడ్వవచ్చునుకూడా కాని అందులో ఆనందం గోచరిస్తూనే ఉంటుంది. ఇది మనుష్యని జీవితంలో స్వప్న, జాగ్రదవస్థలకంటె విలక్షణానుభవం. మనుజుడు మనోరథ రాజ్యాపలనచేస్తాడు. అంటే ఊసుపోకకి తనక అసంభవమని నిశ్చయజ్ఞానమున్నా ఏవో విషయాలను మనస్సులో ఊహించ కొని దానిమీద ఊహాసౌధాలు నిర్మి స్తాడు. ఈ సంకల్పాలు అసత్యాలు సాగవుఅనే దృఢజ్ఞానమున్నా ఊహించి ఆనందించడం మానడు. ఇది మను ష్యని జీవితంలోవిలక్షణానందం. నిర్వి షయకంగా ఆలోచించడం బ్రహ్మానం దం. వీటన్నిటికి విలక్షణమైనది కావ్యా నందం.

కవి, ప్రకృతి సృష్టికంటె విలక్షణ మైన నామరూపాల్ని సృజిస్తాడు. ప్ర కృతిసృష్టిలోలేనివి ఎవరూసృజింపలేరు కాని కవిసృష్టి కేవలం కల్పితం. కవి తన అనుభవాన్ని, ఊహని నామస్వరూ పంగా రచించి రూపరూపంగా భావకుని చేత స్మరింపజేసి ఆ స్మరణలో మన ద్వారా ఆనందాన్ని కలిగింపచేస్తాడు. వ్యవసాయదారుడు అనేక సస్యాలుపెట్టి

నట్లు కవి రసానందాన్నిస్తాడు. ఇందులో మన వ్యాపారంకూడా కొంత ఉంటేనే గాని అనుభవింపలేము. ఇందులోఉండే నామరూపాలు అంటే శబ్దార్థాలు కాల్పని కాలు, స్మృతిరూపాలు అయిఉంటాయి. ఈ స్మృతి సజాతీయస్మృతిగాని సహజ స్మృతి కాదు. సజాతీయస్మృతి అంటే అది అనేక రకాలుగా ఉంటుంది.

ఉదాహరణకి :

"దుష్యంతుడు రాజు. అతడు రధం మీద వేషధారియై వెళతాడు." ఈ విష యాన్ని కవి చిత్రించినప్పుడు సామాజి కుడు నిజమైన దుష్యంతుడ్నిగాని, వాని రధాన్నిగాని చూడలేదు. కానిసజాతీయు లైన రాజుల్ని రధాల్ని చూసాడు దేశ కాల పరిస్థితులవల్లనైన మార్పులు గ్రహించాడు. అంచేత వాటి పరిచయా న్నాధారంగా చేసుకొని ఒక రాజవ్యక్తిని రధాదులని స్మరించాడు ఈ స్మరణ సజాతీయస్మరణ అవుతుంది. అనను భూతవిషయాలనికూడా అనిర్వచనీయ సాజాత్యంచేత భావకుడు ఏదోవిధంగా తన బుద్ధిస్థంగా విషయాన్ని చేసుకుం టాడు. అంచేత భావుకహృదయంలోకవి కల్పిత నామరూపాలు సజాతీయస్మరణ రూపాలు.

ఈ నామరూపాలు అభిరుచిని బట్టి భావకుని స్థితినిబట్టి మారుతాయి. భాగవతకృష్ణుడు భుజకీర్తులతో టోపీతో ఉంటే నాటక కృష్ణుడు నాగరికుడవు తాడు. సినీమాలో మరో విధంగా ఉంటాడు. ఈ మార్పు దేశకాల భావుకాది భేదంచే సిద్ధిస్తుంది. ఆనందం కేవల భావుకత్వం మీద ఆధారపడి ఉంటుంది. ఈ వేషాదికము ఉద్దీపకము మాత్రమేగాని ఉద్బోధకం కాదు కాబట్టి ఇది అంత అతిముఖ్య శ్రేణిలోకిరాదు. ఈ కావ్యస్మరణ, స్వప్నస్మరణ రూపంలో ఉన్నట్లు వాస్త వికం కాదు అనే జ్ఞానంతో వుంటుంది. మనోరధ రాజ్యపాలనంలో ఉన్నట్టు సంకల్ప వికల్పాలకి భావనకి స్థానమవు తుంది. అనుభూత విషయాలని స్మరణ రూపంలో స్ఫురింపజేసి ఆ ఆనందాన్ని కూడా కలుపుకుంటుంది. ఈ విధంగా వాసనారూపంగా కూడా వుంటుంది. కవి కల్పిత నామరూపాలు కావ్యం అనే పేరుతో ఆనందాన్ని కలిగిస్తాయి నామ రూపాలే శబ్దార్థాలు. లక్షణతత్వవేత్తలు శబ్దార్థాలే కావ్యం అని చెప్పారు.

1. "త దదోషౌ సగుణౌ సాలం కారౌ శబ్దార్థౌ కావ్యం"

2. "తదదోషౌ శబ్దార్థౌ సగుణావన లంకృతీ పునః క్వాపి"

3. "నిర్దోషం గుణవత్కావ్య మలంకారై రలంకృతం" రసాన్వితం ....అని.

వీటిలో "శబ్దార్థౌ" కావ్యం.... అని లక్షణకోటిలో చేర్చి మిగిలినవి విశేషణ కోటిలో చేర్చి లక్షణాన్ని లఘువుగా మార్చారు. విశేషణకోటిలోఉన్న పదాలు సహజంగా వ్యర్థమయి శబ్దార్థాలు ఆనంద జనకాలు కావాలి, అన్న విషయాన్ని స్ఫురింపచేస్తాయి. స్పష్టంగా ఆనంద జనకాలనకుండా ఇలా చెప్పడంలో విశేషముంది. ఆనందోద్బోధ కవి ప్రతిభ నాశ్రయించి ఉంటుంది. గుణదోషాది వివేకం వ్యుత్పత్తినాశ్రయించిఉంటుంది.

సహజమైన ప్రతిభయందు కవిని లాక్షణికుడు హెచ్చరించడం కంటె వ్యుత్పత్తి విషయాల్లో హెచ్చరించడం ఉచితం. అందుచేత కావ్యశోభను పెంపొందించే గుణసహితత్వ దోషాభావత్వాలని వివేచించారు. అంచేత విశేషణకోటిలో ఉన్నపదాలు దిఙ్మాత్రంగా స్వపదార్థాన్ని నిర్వచించి చమత్కార జనకత్వమందే పర్యవసానాన్ని చెందుతాయి. కంఠతా చెప్పకపోయినా "లోకోత్తరానందజనక శబ్దార్థాలుకావ్యం" అని ధ్వన్యాచార్యులు సూచించారు.

నవీనులు (పండితరాయలు) శబ్దముమాత్రమే కావ్యంఅన్నారు. వీరు శబ్దార్థాలు కావ్యంఅన్నవారి మతాన్నిలా అధిక్షేపించారు. "కావ్యం చదివాను; అర్థంకాలేదు; కావ్యం విన్నాను" అనే ప్రయోగాలున్నాయి ఇందులో చదువుట, వినుట శబ్దానికి చెందుతాయిగాని అర్థానికికాదు. అర్థం తెలియలేదుఅంటే కావ్యంవేరు, దానిఅర్థంవేరు అని స్పష్టమవుతూంది. ఇంతేకాక శబ్దార్థాలు రెండూ కావ్యమంటె "ఏకోనద్వా" వను వ్యవహారంలాగ "శ్లోకవాక్యేన కావ్యం" అనే వ్యవహారం కలుగుతుంది ప్రత్యేక పర్యాప్తమంటే ఒకపద్యంలో కావ్యద్వయ వ్యవహారం కలుగుతుంది కాబట్టి శబ్దార్థాలు కావ్యంఅనడం యుక్తంకాదు. ఇంతేకాక శబ్దార్థాలు కావ్యంఅనడానికి తగిన ప్రమాణమూలేదు. ఇలాగే వేద వ్యాకరణాలు కేవల శబ్దవాచకాలని చెప్పారు.

అయితే శబ్దం కావ్యమా, శబ్దార్థాలు కావ్యమా అన్నది చర్చనీయమయింది. కావ్యశబ్దానికి శబ్దార్థాలర్థమా? శబ్దమే అర్థమా? అని చర్చించడానికి లోకం, శాస్త్రం రెండు ప్రమాణాలు. లోకంలో "కావ్యం చదివాను" "కావ్యం బోధపడింది" అనే శబ్దాన్ని అర్థాన్ని రెండింటినీ తెలిపే వ్యవహారాలున్నాయి. ఏం చదువుతున్నావంటె "రఘువంశం" అంటాడు. అప్పుడు రఘువంశ కావ్య శబ్దానికి శబ్దార్థాలు రెండూ అర్థమే. ఇలా లోకవ్యవహారంలో కావ్యం అంటే శబ్దార్థాలు రెండూ కలసి అన్న ప్రతీతి ఉంది. ఒక్క శబ్దంగాని, ఒక్క అర్థంగాని అర్థమయినప్పుడు లక్షణాన్నంగీకరిస్తే, యుక్తంగా ఉంటుంది. ఇది లోక విషయం.

ఇక శాస్త్రప్రమాణం చూదాం పాణిని "తదధీతే, తద్వేద," అనే సూత్రం రచించారు. వ్యాకరణం చదివినా, తెలిసికొనినా అనే అర్థంలో "వైయ్యాకరణి" అనే రూపం దీనివల్ల సిద్ధిస్తుంది. దీనివల్ల వ్యాకరణ శబ్దానికి శబ్దార్థములు రెండూ కలిసి అర్థము అని పాణిని తలచినట్లు రూఢమవుతుంది. దీని వ్యాఖ్యానా లీ విషయాన్ని సూచిస్తాయి. భాష్యకారులు ఇక్కడ శబ్దార్థములు రెండూ వ్యాకరణాదిశబ్దార్థములు అని చెప్పారు ఋక్కులుచదువుతున్నారు అన్నప్పుడు అక్కడ ఋక్ శబ్దానికి శబ్దార్థము లర్థమైనా శబ్దమాత్రమందు లక్షణ అని వివరించారు దీనివల్ల శబ్దార్థాలు కావ్యం అని స్పష్టమవుతుంది.

కాళిదాసుకూడా "వాగర్థా వివసం

పృక్తౌ" అని శబ్దార్థా లవిభాజ్యాలని సూచించాడు. శబ్దమే కావ్యార్థం, అనే శరీరం అంటే శబ్దాలంకారాలే అలంకారాలు కావాలిగాని అర్థాలంకారాలకి అలంకారత్వం సిద్ధింపదు

అంచేత శబ్దాలు కావ్యం అనడమే సమంజసం.

ఇక్కడమరోసందేహంస్ఫురిస్తుంది. శబ్దార్థములు కావ్యశరీరాలైతే జీవితం వ్యంగ్యవైభవం" అన్నట్లు అర్థభేదమైన జీవితమైన వ్యంగ్యార్థం శరీరమైన శబ్దార్థాల్లో చేర్చినట్లవుతుంది.

ఇక్కడ జీవితం ప్రధానమైనది అని అర్థంగాని ప్రాణం అని కాదు. ఉపమానం కొంతవరకే గ్రహించాలి గాని ఊరికే పొడిగించకూడదు ముఖం చంద్రుడిలా ఉందీ అంటే సూర్యకిరణం పడకపోతే వెలగదు భూమి చుట్టూ తిరుగుతుందిఅని పొడిగించి సాదృశ్యం చెప్పలేము గదా! అలా పొడిగిస్తే కావ్యాంగానికి రక్తమాంసాలుమొదలైన వాటికీ వేటితో ఔపమ్యంచెప్పి సరి పెట్టారు? ఇంతేకాక "విభాతిలావణ్యమివాంగనాసు" అని నేత్రాద్యవయవ సౌందర్యం కంటె ఆభరణ సౌందర్యం కంటె సహజమైన లావణ్యం శరీరాన్నాశ్రయించి స్త్రీకి ఎలా భాసిస్తూందో, ధ్వనికావ్యంలో అలా భాసిస్తుంది అనే చెప్పారు. లావణ్యం ఆంతరమైన ఆత్మ పదార్థంకాదు అంచేత ధ్వని జీవితము అని చెప్పడం, కేవలం ప్రధానమైనది అని చెప్పడానికి అని తెలుస్తుంది.

అయితే అర్థం ఆనందాన్నిస్తుంది గాని శబ్దం ఆనందాన్నిస్తుందా? ఆనందజనకమైనది కేవల మా అర్థమేనా, శబ్దం కూడా అవుతుందా? కేవలం అర్థమే ఆనందజనకమైతే ఆనందప్రదములైన శబ్దార్థములు కావ్యం అన్న లక్షణం ఎలా సరిపోతుంది? అని అడగవచ్చు.

శబ్దార్థాలు రెండూ ఆనందాన్ని కలిగిస్తాయి. అర్థం అధికంగా అయితే కొంచెం తక్కువైనా శబ్దంకూడా ఆనందాన్ని కలిగిస్తుంది అర్థం తెలియక పోయినా వేదం చదువుతూ ఉంటే ఆనందం కలుగుతుంది సంగీతంతోచదువకపోయినా అర్థం తెలియకపోయినా కొన్ని పదాలు ఆనందాన్ని కలిగిస్తాయి. తల్లి నాన్నలు అన్న పదంకంటె తల్లిదండ్రులు అన్న పదం చాల శ్రవణానందంగా ఉంది. శ్రవణానందమే కాని హృదయానందం కాదు అనకూడదు. ఆనందించే శక్తి హృదయానికే గాని శ్రవణానికి లేదు. తద్వారా ఈ అనందం కలుగుతూంది. మాధుర్యం అనే గుణం పద వాక్య రచనారసముల నాశ్రయించి ఉంటుంది అని ఆలంకారికులు చెప్పారు. శబ్దమాధుర్యం ఆనంద జనకం అని ఆలంకారికులు చెప్పారు శబ్దం వరకూ ఎందుకు? కొన్నివర్ణాలు ఆనంద జనకాలు - అని వివరించారు. కఠినాక్షరాలు వీరాదులలో ఉత్తేజకాలయి ఆనందాన్నిస్తాయి. మృదువైన అక్షరాలు శృంగారంలో ఆనందానిస్తాయి కాబట్టి, ఆ అక్షరాలతోకూడిన పదరచన ఆ ఆ రసాలలో ఉండాలి అనికూడా చెప్పారు.

అనందాన్నభివృద్ధిపరచేశక్తి శబ్దానికి ఉన్నట్టేభంగపరచేశక్తికూడఉంది.అర్థం గంభీరంగా ఉండి ఆనందజనకమైనా

విరుద్ధాక్షరఘటన పానకంలో పుల్లలా విఘ్నం కలిగిస్తుందని పండితుడు వ్రాశాడు. కాబట్టి శబ్దానికి ఆనందంతో సంబంధం ఉంది శబ్దం ఆనందాన్నుద్రేకింప జేస్తుంది. అర్థం ఉద్బోధింపజేస్తుంది. కాబట్టే శబ్దార్థాలు కావ్యం అనడమే సమంజసం.

ఆనందింపజేయడానికి కవికి ప్రతిభ ఎలా ఉండాలో సామాజికుడికి ఆనం దించడానికి అలా ప్రతిభవుండాలి అంటే ప్రతిభ రెండు విధాలు. కవి గత ప్రతిభ, కారయిత్రీ ప్రతిభ. సామాజిక ప్రతిభ భావయిత్రీప్రతిభ. ఈ ప్రతిభలు వ్యక్తికి సహజాలు. ఒకప్పుడు యీ ప్రతిభలు విలక్షణమైన వ్యుత్పత్త్యభ్యాసాలచేత కూడా సిద్ధిస్తాయి. ఈ రెంటిలో ఏఒక్కటైనా ఉన్నవాడు ధన్యుడు. రెండూ ఉంటే వాడు ధన్యతముడు. కావ్యరచనకి ఎలా 'శాస్త్రజ్ఞాన ముండాలి' అన్న నియమం లేదో, సామాజికుడికి అలాగే శాస్త్రజ్ఞానం ఉండ నక్కరలేదు. శాస్త్రజ్ఞానం ఉన్నా ఎలా కవి కాలేడో అలాగే రసికుడూ కాక పోవచ్చును. అంచేత శాస్త్రజ్ఞానం వేరు. కవి వేరు. భావుకుడు వేరు. ఈమూడు లేక ఏరెండైనా కవిని ఒక్క వ్యక్తిని ఆశ్రయింపవచ్చు. వాడు దివ్యుడు. లోకాతీతుడు.

భావయిత్రీ అనే ప్రతిభ లేనివాడు కావ్యానందాన్ని అనుభవింప లేడు. ఆనందం సామాజిక నిష్ఠం. ఆనందింప చేసే సామగ్రినిమాత్రం కావ్యం భావుకునకు అర్పిస్తుంది. ఆనందం కావ్య నిష్ఠము అంటే సహృదయుడు కాని వాడికికూడా ఆనందం కలగాలి. కావ్యం రసవత్తరము అన్నదగ్గర లక్షణ నంగీకరించి రసం సామాజికనిష్ఠం అనడమే యుక్తం. "బీరకాయ వేడి" అన్నప్పుడు బీరకాయ కాలుతుంది అనే భావం కలగదు అది తింటే వేడిచేస్తుంది అని స్ఫురిస్తుంది. అలాగే ఈ కావ్యచర్వణ వల్ల ఆనందం కలుగుతుంది అని లక్షణ చేత అర్థాన్ని వివరించాలి.

శబ్దార్థాలు ఎలా ఆనందాన్ని కలిగిస్తాయి అని అనుకోనక్కరలేదు.

పిల్లలు మట్టిగుఱ్ఱాలు, ఏనుగులు బొమ్మలు పెట్టుకొని వైభవంతో వివాహము జరిపిస్తారు. ఇది వాళ్ళ బొమ్మల పెళ్ళి ఆట. వాళ్ళకి ఆ బొమ్మలు సత్యం అనే జ్ఞానం లేదు. కాని వాళ్ళ భావనా బలంచేత మనస్సుకి ఆనందం కలుగుతుంది. అది సత్యభ్రాంతి, అంచేత ఆనందం కలుగుతూంది అని చెప్పలేం ఆ బొమ్మలు బొమ్మలేగాని యదార్థమైనవి కావు అనే జ్ఞానం వాళ్ళలో ఉంది. కాబట్టి అది భ్రాంతిచే పుట్టిన ఆనందం కాదు. భావనచేత చిత్తంలో ఆ ఆనందము కలుగుతుంది. అలాగే కవి భావకుడికి తగిన విభావాది సామగ్రినిస్తాడు. ఆ సామగ్రిని భావకుడు భావనచేసి, ఆనందాన్ని పొందుతాడు. రసం కావ్యనిష్ఠంకాదు కాబట్టి రసధ్వని అన్నచోట కూడా లక్షణ నంగీకరించాలి అంటే కావ్యంలో కవిచిత్రించిన విభావాదిసామగ్రిని భావనచేస్తే సామాజికునకు ఆనందము కలుగుతుంది. ఆ ఆనందానికే రసవ్యవహారం. అది స్థాయిత్వాన్ని చెందకుంటె భావమవుతుంది.

అభేదజ్ఞానం ఉంటేనేగాని రససిద్ధి లేదు. సామాజికుడు నాయకా ద్యభేద బుద్ధిని పొందాలి అని కొందరి యాశ యము.

శృంగారాదులలో నాయకా ద్యభేద బుద్ధి ఉన్నట్టు భాసించినా బీభత్సరస ములో ఈ అభేదబుద్ధి సరిపోదు. భీభ త్సలో సామాజికుడు ఆలంబనవిభావ మైన శ్మశానాదులతో అభేదాన్ని చెంద డము అసంభవం. అంచేత అక్కడ రససిద్ధి లేదనాలి. కాబట్టి అభేదకల్పన అయుక్తం. ఇంతేకాదు.

అదెయిదె వచ్చెవచ్చె నంసాధిపు
దాడియటంచు బాశెముల్
బెదరి బరీదులేగునెడ బెంపరి
ఖానులు వెన్కముందుగా
గదిసి హయాళినెక్కి - హయ
కంధరముల్ పొడగానకప్పుడే
చదిపిరి వాజి మస్తముల శత్రు
లటంచు భ్రమింతురెంతయున్.

ఈపద్యంలో నాయకునందుశృంగారం ప్రతినాయకునందు భయానకం వర్ణిస్తూ వుంటే ప్రతినాయకుని సైన్యమందుండే సైనికుల వికృతచేష్ట, హాసాన్ని కలి గిస్తూంది. అభేదజ్ఞానమే రససిద్ధికి హేతువుఅంటే సామాజికునకు వీరరసం కలగాలి. అలా కలగలేదు. కాబట్టి అభేదజ్ఞానం రససిద్ధికి కారణంఅనడం యుక్తంకాదు. ఇక్కడ ద్రష్ట,పురుషుణ్ని కల్పించి వానితో అభేదంచెందాలిఅంటే ఆ కల్పనా గౌరవంకంటె సహృదయ ప్రత్యక్షప్రమాణసిద్ధమైన పద్ధతేయుక్తం. సాహిత్యం ప్రత్యేకశాస్త్రం. దానికి సహృ దయుల హృదయానుభూతి ప్రమాణం.

ఇంతేకాక దృశ్యకావ్యాల్లో నాయికా నాయకుల శృంగారాభినయాన్ని చూస్తే, సామాజికుడికి లోకంలో దంపతులను చూచినప్పటివలె వీరు శృంగారవంతులు అనే జ్ఞానం కలగుతుంది. కాని, అభేద జ్ఞానం కలగదు. సజ్జనులకి లజ్జ, ఇతరులకి అనురాగాపహరణము అసూయమొద లైన భావాలు కలుగుతాయి కాని అభేద జ్ఞానం కలగదు నాయికా నాయకులు భావనా విషయములయినప్పుడు భావం మాత్రమే భావింపబడుతుంది. అదే స్థాయిత్వాన్ని చెంది రసమవుతుంది. భావనలో ఉండే శృంగారం నాయికా నాయకులందున్న శృంగారము కాదు. అది భావనయందుండే శృంగారం కాబట్టి లౌకికంకాదు.

ఇంకోమాట-రససిద్ధికి అభేదజ్ఞానం ఉండాలి అంటే స్త్రీ పురుష సామాజికు లలో భిన్నానుభూతులకు భిన్నం గానే అభేదజ్ఞానం కలగాలి స్త్రీ స్త్రీతోటి పురుషుడు పురుషునితోటి అభేదాన్ని చెందాలి. పురుషుడు నాయకునితో అభే దాన్ని చెంది స్త్రీ పాత్రను భావనలో సృజించి రతిననుభవించాలి. అలాగే స్త్రీ పురుషపాత్రను భావంలో సృష్టించు కోవాలి. ఈ కల్పనా గౌరవాలు, అనను భవసిద్ధాలు, అయిన మార్గాలు తొక్కడం కంటె సహజంగా భావనచేత రససిద్ధి అని ఒప్పుకోవడం సహృదయత్వమని పిస్తూంది.

ఇంకా ఏకత్ర అనురాగం వర్ణింపబడే రసాభాసలో ఈ అభేదజ్ఞానం బొత్తిగా సిద్ధించదు. స్త్రీ పురుషసామాజిక భేద

మున్నప్పుడు మరి ఈమార్గం హాస్యా స్పదంగా ఉంటుంది.

లోకంలో ఉండే నామరూపాలనే ఓవి భావకునికి మనోనుకూలంగా ఉండే టట్టు పదార్థజాలాన్ని సమకూరుస్తాడు. సామాజికుడు ఆ పదాలచేత స్ఫురించే విషయాలని భావన చేస్తాడు ఇక్కడ ఊహావిషయాలైన నామరూపాలు భావన చేత అలౌకికా లవుతాయి. ఇప్పుడు దేశ కాల వయోవస్థాది జనితమైన రస ప్రతి బంధజ్ఞానాలన్నీ ఈ భావనచేత తిర స్కృతాలయి రసోన్ముఖత సిద్ధిస్తుంది. అలాటి అలౌకిక భావభావనచేత భావా నుభూతి సామాజికునకు కలుగుతుంది క్షణికమైన చిత్తవృత్తిని చెదరనీయ కుండా ఈ భావాలు స్థాయిత్వాన్ని చెందించితే రసమవుతుంది.

తన యిష్టం వచ్చినప్పుడు సామాజి కుడు కావ్యపరనాదులచేత ఈ కావ్యా నందాన్ని అనుభవింపవచ్చును. అలాగే విరమింపవచ్చును. అంచేత కావ్యా నందం రసభ్రాన్తిమాత్రం కాదు ఈ అనుభూతిలో ఉండే రసం స్వీయం కాదు. ప్రత్యక్షానుభవంలో లేదు.

తాను కూర్చున్న రైలు నడవకుండా నిలిచి ఉంటుంది. ప్రక్కనున్న రైలు నడుస్తూ ఉంటుంది, అప్పుడు యీ యథార్థజ్ఞానం ఉన్నా ప్రయాణీకుడికి తన రైలు కదులుతూంది అనే ఊహ జని స్తుంది. అది సత్యంగా భాసిస్తుంది. అది భ్రాన్తికాదు ఎంచేతంటే యథార్థ జ్ఞానం ఉంది కొబట్టి. ఆ జ్ఞానం ఎలా కలుగుతుందో అలాగే సామాజికునకు రసం భాసిస్తుంది. ఇది యథార్థ సత్యం కాదు భ్రాంతీకాదు. ఊహాసత్యం.

కొబట్టి భావకుని భావనాశక్తి కావ్యా నుభూతికి ముఖ్యకారణము అని చెప్ప వచ్చు. శబ్దార్థోపస్థితి చాలని భావుకునికి ఆ ప్రతీతి కలగటానికి వ్యాఖ్యానం అవ సరం అవుతుంది. భావుకత్వం వికసిం పనివారికి భావాన్ని విపులపరచి భావన కనుకూలంగా చేయడం కూడా వ్యా ఖ్యాతల పని. ఈ పద్ధతిలో నడిచిన వ్యాఖ్యానాలే వ్యాఖ్యానాలు మిగిలినవి పాండిత్య స్ఫోరకాలు. ఆ వ్యాఖ్యానాలని వివరించడం-శాఖాచంక్రమణం ఎందుకు?

"కలలో పాలుత్రాగడం దొప్పలో ఎందుకు, బంగారు గిన్నెలో కానీ" అన్నట్టు ఊహావిషయాలయిన నాయికా నాయకులు లోటుపాట్లకి స్థానం కాకుండా ఉత్తములుగా ఉండాలి; ఆదర్శ వ్యక్తు లుగా ఉండాలి అని తలచి మనుష్యాతీత ప్రజ్ఞలతో గమ్యస్థానం మనుజున కది అని తెలుపుతూ కొందరు ఆదర్శపాత్ర లని సృజిస్తారు మానవ స్వభావాను కూలంగా పాత్రలుంటే భావుకుని భావనా శక్తి కుంటువడదు. అంచేత రసప్రతీతి సులభమవుతుంది అంచేత స్వతస్సి ద్ధంగా మనుజుడికి ఉన్న లోపాలుకూడా చూపించాలి. అప్పుడు పాత్ర స్వభావ సిద్ధంగా ఉండి భావుకునికి భావనానుకూ లంగా ఉండి రసప్రతీతిని కలిగిస్తుంది. కొబట్టి రసానుకూల్యం కొరకు సహజ వ్యక్తిని సృజించాలి. అందులో ఉండే లోపాలకి తగిన కష్టాల్ని చూపుతూ లోకాన్ని ఆ లోపాలు లేకుండా ఉండేట్టు సవరించుకోవలసినది అన్న ఉపదేశం

దీనివల్ల కలుగుతుంది అని కొందరి ఆశయం.

వాస్తవంగా కవి అలౌకిక నాయకుణ్ణి గాని లౌకిక నాయకుణ్ని గాని సృజించ లేడు. ఏదో ఒకపాలు హెచ్చుఉంటుంది. ఆ బాహుళ్యంచేత ఆదర్శ నాయకుడు, సహజనాయకుడు అనే విభాగం. ఆదర్శ నాయకుడి గుణాలు కొన్ని మనుష్య మాత్రుడికి అనుసరింప శక్యం కాకుండా ఉంటాయి, కృష్ణుడు రాముడు మొద లైనవారి గుణాలు మనకు పూజ్యాలు; కొన్ని మాత్రమే అనుసరణీయాలు, కొన్ని స్తవనీయాలు. మనుజుడికి సాధ్యంకానిది లేదనే ఉత్సాహవంతు లకు సాధ్యం అవుతాయి అంటే సరే, అలాటివారు అరుదు. కాని కొన్ని గుణాలు మనకు ఆదర్శాలుగా ఉంటాయి కాబట్టి వారు ఆదర్శ నాయకులవుతారు.

సహజ చిత్రణలో గుణ దోషాలు నాయకునందుంటాయి గుణాలు ఆద ర్శాలవుతాయి. దోషాలు పరిత్యాజ్యా లవుతాయి

లోకంలో ఉన్న వ్యక్తికి ఊహలో ఉన్న అధర్మం జీవిత పథంలో ఎలా పనిచేస్తుందో వ్యక్త పరుస్తాను.

మనస్సు ఒక్క-క్షణంకూడా స్థిరంగా ఉండదు. చంచలత్వంరాని స్వభావం ఒకే విషయాన్ని మాటిమాటికి స్ఫురింప చేస్తే ఏకాగ్రత కలుగుతుంది. అలా ఏకాగ్రతచెందిన విషయాలు మనస్సులో వాసనారూపంగా ఉంటాయి. మనుజుని నిత్య జీవనం వాని సంకల్పాలమీద ఆధారపడి ఉంటుంది. అంటే వాసనా బలంచేత వచ్చే సంకల్పాలే కార్య రూపంగా మనుజుడు ఆచరిస్తాడు. అం చేత మనుజునిబుద్ధికి మాటి మాటికి మంచి సందేశాలను అర్పించి వాటి వాసన దృఢపరచాలి. మనుజుడు ఒక పని చేసి, నాకిలా తోచింది నేచేసాను నా యిష్టం. అని అంటాడు. కాని వస్తుతః వాసనారూపంచేత వచ్చిన సం కల్పాలే నావి అని మనుజుడు అను కుంటాడు. వాటిని యథేచ్ఛగా మార్చు కునే శక్తి స్థితప్రజ్ఞులకే ఉంటుంది. తదభ్యాసకులకు కొంత ఉంటుంది అం చేత మనుజునిబుద్ధికి మంచిసంకల్పాలు కలిగించి వాటిని దృఢపరచడానికి మాటిమాటికి బోధిస్తూ ఉండాలి. అప్పుడు ఆ సంకల్పంవాని మనస్సులో వాసనారూపంగా ఉంటుంది. అలామంచి సంకల్పం స్థిరపరచడానికి, సహవాసము, లోకానుభూతి, శిక్ష,ఉపదేశము, కావ్యం సహకారులవుతాయి. ఈ మంచి సంక ల్పాలు మత, రాజకీయ, సాంఘికాలుగా విభజింపవచ్చు. ఇవన్నీ దేశకాలవయోవ స్థాదులచేత మారుతూ ఉంటాయి,

ఇప్పుడు మంచి అనుకొన్నది మరో అప్పుడు చెడ్డకావచ్చు. ఇప్పుడు చెడ్డఅను కొన్నదిమరో అప్పుడు మంచికావచ్చు. ఒకసంఘం మంచి అనుకున్న విషయం మరో సంఘానికి చెడ్డకావచ్చు. మను జుడిలో ఉన్న భావంకంటె సాంఘిక భావం స్థిరమైనది. ఉత్తమమైన మను జుని భావాలే సంఘానుమతిని పొంది సాంఘికభావాలవుతాయి. ఒక మను జుడిభావం పరివర్తితమై సంఘాన్ని మారిస్తే సాంఘికభావంకూడా మారు తుంది. ఏది సహజస్థితో దాన్ని సంఘ

ముగాని వ్యక్తిగాని దేశకాలాదులుగాని మార్చలేవు. దానికి మార్పు లేకపోవ డమే సహజం. ఇలాటిది భావం అని అనిపించుకోదు దాని విషయంవేరు దాని ప్రస్తావనకిది సమయంకాదు. మను జుడు ఉన్నతస్థానాన్ని చెందాలి అంటే ఉన్నతభావాలుండాలి. అవి సాంఘికంగా పరిణమించాలి అప్పుడు మనుజుడే కాక సంఘంకూడా ఉన్నత స్థానాన్ని పొందుతుంది. విశ్వమానవకళ్యాణాన్ని చూడకుండా చిన్న సంఘాలను వాటి భావాలను మనుజుడు వ్యక్తపరిస్తే అది సాంఘిక ఘర్షణలకు, అధఃపతనాలకు కారణమవుతుంది. ఇందులో ఒకటి తాత్కాలికంగా అభివృద్ధిలోఉన్నా ఘర్షణ నాశాన్ని కలిగిస్తుంది. ఆనాశం ఉన్నతి మార్గాన్ని మళ్ళీ అన్వేషించి సరియైన మార్గంలో వెళితే గమ్యాన్ని చేరుతుంది. లేకపోతే మళ్ళీ పూర్వ పద్ధతులనే పొందుతుంది

ఈ విశ్వమానవకల్యాణం అనే మహదాశయంలో జాతి, మత, రాజకీయవిషయాలు లీనమయిపోతాయి ఆ మహదాశయసిద్ధికి సూత్రమేది? అని పెద్దలు వెతికి మార్గాలను చూస్తున్నారు. అది సిద్ధింపనంతసేపు లోకానికి శాంతి లేదు. ఉండదు ఆ సూత్రాలను మను జుల భావాలలో స్థిరపరచాలి. అంటే ఉపదేశాలతోపాటు కావ్యంకూడా ఉప యోగిస్తుంది.

విశ్వమానవ కళ్యాణానికి ఉపయో గించే భావాలను కవి కావ్యనాయకునందు స్ఫురింపజేస్తాడు, ఆ భావాలనే మాటి మాటికి తన కావ్యంలో వ్యక్తపరుస్తాడు. భావకుడు వాటినే భావనచేస్తాడు అలా మాటిమాటికీ భావన చెయ్యడంచేత ఆ భావాలు సామాజికుడి హృదయంలో వాసనారూపంగా స్థిరమవుతాయి. బుద్ధిలో స్థిరమైన సకల్పాలే జీవిత పథంలో రాజ్యం చేస్తాయి కాబట్టి ఆ ఉన్నత భావాలు సామాజికుణ్ణి జీవిత పథంలో ఆభావాలపద్ధతినే నడిపిస్తాయి కాబట్టే కావ్యం మనకి ఆదరణీయ మయింది కవి పూజ్యుడై గురుశ్రేణిలో చేర్చబడ్డాడు ఈ విధంగా ఆదర్శ చిత్ర ణం లోకోపకారక మవుతుంది

రెండవది సహజచిత్రణం- ఇందులో పాత్రలు కొంచెం సహజాతీతాలే గాని బాహుళ్యంచేత వ్యవహారం. ఈనాయకు నందుండే గుణాలు ఆదర్శమైనవి కొన్ని ఉండవచ్చు. అవి ఆదర్శాలై లోకోపకా రకములవుతాయి వాడిలోవుండేలోపాల వల్ల వాడుపడేబాధ సామాజికుని హృద యానికి గోచరించి లోపాలనుండి వాని మనస్సును నివృత్తింప చేస్తుంది. అంటే మొదటిరకంలో ఉపదేశించే కావ్యాలు ప్రవృత్తిమార్గాన్నీ, రెండవరకం నివృత్తి మార్గాన్నీ సూచిస్తాయి. ఈ నివృత్తి మార్గంకంటె ప్రవృత్తిమార్గం ఉత్తమ మని ప్రాచీనులఊహ. ఈ రెంటినీ మేళవించి కవి రచన సాగించవచ్చు రాముని రీతిని ప్రవర్తించాలి, రావణుని వలె ప్రవర్తింపరాదు, అని రెండుపద్ధ తులనూ కలిపికూడా చిత్రింపవచ్చు

ఈపద్ధతి కావ్యం కావ్యానందానికే కాక లోకోపకారానికి అన్నప్పుడే సిద్ధి స్తుంది.

కావ్యానందానికి కావ్యానందమే

ప్రయోజనములంటే. బొమ్మలపెళ్ళిళ్ళ ఆటకంటె ఇందులో విశేషంలేదు మనో రధ రాజ్యపాలనకంటె ఇందులో విశే షం లేదు.

మనస్సు ఏకాగ్రతకలిగించి నిష్ఠకి మార్గాన్ని చూపుతుంది. అది మోక్షానికి కారణం. అంచేత రసోపాసకులు మోక్షాన్ని పొందుతారుఅని కొందరగ వచ్చు - అది వితండవాదం.

పాచికలు మొదలైనవాటిలో కూడా ఏకాగ్రత కలుగుతుంది కావ్యంలోఉన్న ఏకాగ్రతకాని, వ్యసనాల్లోఉన్న ఏకాగ్రత కాని, ఇవన్నీ సవిషయకాలు. అంచేత ఇవి నిష్ఠకిమార్గాన్ని చూపలేవు నిర్విష యకమైన ఏకాగ్రత నిష్ఠ ఔతుంది. సవిషయక నిష్ఠలో విషయం విభిన్నమే ఔతుంది. అంటే సజాతీయమైన సంక ల్పాలు అనేకాలు వరుసగా భాసించి అవన్నీ ఒకటే అన్న భ్రాంతిని కలిగి స్తు-ది. కాని అవి వేరువేరుసంకల్పాలు సినిమాలో అనేక చిత్రాల స్పందం ఒక చిత్రంగా కనిపించినట్లు, అనేకభావాలు సజాతీయాలై ఒక భావంగా కనిపిస్తాయి. అంచేత వీటికి స్థిరత్వమే లేదు. నిష్ఠకి అవకాశం లేదు. ఇక బ్రహ్మానందం అంటే అందులో ప్రపంచవిషయాతీత మైన వస్తువు ఆలంబనం. దాన్ని ఆలం బనంగా చేసి కొన్న నిస్సంకల్పస్థితే నిష్ఠ. అదే మోక్షప్రదం. కావ్యం సంకల్ప బహుళం. అంచేతే కావ్యా నందం మోక్షానందం కాదు. దానికి దీనికీ హస్తిమశకాంతరము. కావ్యా నందమే బ్రహ్మానందమైతే బ్రహ్మ విద్యలు, ఉపాసనలు, కర్మలు ఇవన్నీ మూటకట్టవచ్చు. ఇంతే కాదు. జ్ఞాన మార్గావలంబకులకు ఈ ప్రపంచయాతనే కష్టంగా ఉండి విషయసన్యాసంచేయడం కష్టమైతే కావ్యప్రపంచమనే ఇంకొక ప్రపంచం, వాళ్ళకి అంటకట్టడం పరిహా సాస్పదమవుతుంది. ఉపాసకులు "కావ్యపఠనము కూడ మానవలెను." అనిపెద్దలు చెపుతారు. "కావ్యాలాపాంశ్చ వర్జయేత్" అన్న నిషేధం ఉపాస కులకు చెందుతుంది. (ఆలంకారికులు దుష్టకావ్యవిషయం అని అంటారు.) కాబట్టి కావ్యానందం బ్రహ్మానందం ఎప్పటికీకాదు. ఈ రెంటికీ సంబంధం లేదు. కావ్యానందం బ్రహ్మానందం వంటిది, అన్న మాటలు అర్ధవాదములు కావ్యం కావ్యానందాన్ని కలిగిస్తూ ఇతర ప్రయోజనాలని సాధిస్తే అది ఉత్తమం అని చెప్పవచ్చు కొన్ని కావ్యాలు కావ్యా నందానికే ఉపయోగిస్తే అవి మనోరధ రాజ్యపాలనంలా ఆనంద పర్యవసా యులు.

కాబట్టి కావ్యం మేలుబంతి. దానిని చూచి సామాజికుడు తన ప్రవర్తనని దిద్దుకుంటాడు ఇదేకాక కావ్యానికి ప్రయోజనా లనేకాలున్నాయి దీన్ని ఆలంకారికులు ఇలా వివరించారు.

కావ్యం యశసే, అర్థకృతే
వ్యవహారవిదే శివేతర క్షతయే
సద్యఃపర నిర్వృతయే
కాన్తా సమ్మితతయోపదేశయుజే.

"కావ్యం యశసే" కావ్యం కవికి, భావుకునికి కీర్తిని కలిగిస్తుంది. కవి ఉపదేశకుడు కాబట్టికీర్తివంతుడవుతాడు. నిర్మల ప్రవర్తనకలవాడు కీర్తివంతుడు.

ధనంచేతగాని ఉత్సాహముచేతగాని విశ్రుతుడు ప్రతిష్ఠావంతుడు. కవిసత్యభావాన్ని ఉప దేశిస్తాడు. సామాజికుడుప్రవర్తిస్తాడు. కాబట్టి వీరికియశస్సు కలుగుతుంది. సత్ప్రవర్తనకే వృత్తము అనిపేరు. ధర్మం వేరు, వృత్తంవేరు ధర్మంఅంతర సంస్కారం. పరానిందితము, పరోపకారకము, లోకసిద్ధము అయినది వృత్తము. ఈవృత్తాన్నే కావ్యంలో ఇతి వృత్తం బోధిస్తుంది. ఈ వృత్తానికే మర్యాదస్థితి ధారణ మొదలయినపేర్లు. దీనివల్ల శాంతి కలుగుతుంది కాబట్టి కావ్యం కీర్తికి శాన్తిస్థాపనకు ఉపయుక్తం

"అర్థకృతే"

లోకంలో ధనానికి కావ్యం ఉపయోగిస్తుంది. ఇదిలోకంలో స్పష్టం, కవులు తద్వారా ధనాధికులుకావచ్చు.

"వ్యవహారవిదే"

దేశ కాలాదుల వల్లనైన మార్పు లోకంలో సహజం. ఆలోకభంగిమను కావ్యంద్వారా గ్రహింపవచ్చు. యుక్తాయుక్త విచారణను తెలిసి సంచరింపవచ్చు. ఈవిధంగా లోకవ్యవహారాలలో సిద్ధహస్తుడై ప్రతిష్ట నొందవచ్చు.

"శివేతరక్షతయే"

ఎంత విచక్షణుడైనా మనుజునిబుద్ధి ప్రమాదాయత్తం కాబట్టి, అప్రతర్క్యములైన ఆపదలురావచ్చు వాటిని ఎదుర్కోడం, ఆపదలోంచి తప్పించుకునే మార్గాన్ని అన్వేషించడం మొదలైన విషయాలలో కావ్యం సహకారక మవుతుంది. అంటే ధైర్యాన్నిబోధించి వివేచనాశక్తిని కావ్యం యిస్తుంది అదే ఆపదలనుండి ఉద్ధరిస్తుంది. కావ్యంలో కష్టాన్నెదుర్కొనే మార్గాలు సూచిస్తే అవి నిత్యజీవనంలో ఉపదేశాన్నిస్తాయి.

"సద్యః పరనిర్వృతయే" తక్షణం అలౌకికానందాన్ని చేకూరుస్తుంది. ఇది బ్రహ్మానందం మాత్రంకాదు.

"కాన్తాసమ్మితతయోపదేశయుజే"

స్త్రీఆనందాన్ని కలిగిస్తుంది. తన కోరికను వాచ్యంగా చెప్పక వ్యంగ్య ధోరణిలో సూచించి ప్రయోజనసిద్ధిని పొందుతుంది. ఆరీతినే కావ్యం ఆనందాన్నిస్తుంది. దానితోపాటు సదుపదేశాన్ని గ్రహింపచేసి జీవిత మార్గంలో ఆవిధంగాసంచరింపచేస్తుంది. సతి భర్తని ఉచితమార్గంలో ప్రవర్తింప జేసినట్లు కావ్యం ఆనందాన్ని కలిగించి ఉచితమార్గంలో ప్రవర్తింప జేస్తుంది.

పై పద్ధతి ఆలంకారికుల నిష్కర్ష

కావ్యం లోకప్రయోజనాన్ని కలిగించడానికిగాని, ఆనందాన్నివ్వడానికిగాని సామాజికునిలో సునిశితమైన భావనా శక్తి ఉండాలి. అదే కావ్యానందాన్ని కలిగిస్తుంది. అది సహజమైనదే. కాని ఆ ప్రతిభ కలగడానికి వ్యాఖ్యానాలు వ్యుత్పత్తి విలక్షణాభ్యాసంకూడా కారణాలవవచ్చు. సహృదయుడు ఈ భావయిత్రీ శక్తిని విజృంభింప చేసుకోడానికి ప్రయత్నించాలి.

పేద రైతు

శ్రీ కొండూరి నరసింహం

శ్రీమంతుఁడై మించి భూమినిచ్చిన దాత - మూడుపాళులపంట ముందె గొనఁగ
పెట్టుబడులను బెట్టు పెద్దయ్య ధనికుఁడు - వడ్డి సడ్డీలంచు నడ్డుపడగ
కాగితాలను వ్రాసి కరుణించు కరణమ్ము - చిల్లర గా కొంత చెల్లగొట్ట
పలుపాట్లనందిన పశుగణం బాహార - ముగ, కొంతకాజేసి బిగువుచూప
గడియ గడియకు ప్రాణమ్ము కటకటపడి - పంచ భూతాలకై మేను బలినిబెట్టి
అస్థిపంజర మాత్రమీ అవనిమిగుల - హీనతన్ బొందు నీరైతు కెట్లు బ్రతుకు?

పద్దు వ్రాసియును ఏప్రొద్దు కన్పింపవు - నీ యూహయే మంచు నీల్గునొకడు
ఆకుమళ్ళకు నీళ్ళనడిగినావే గాని - మామూళ్ళ మాట లేమను నొకండు
యుద్ధాగ్నినంతయు నొక్కపెట్టున నార్ప - ఫండ్సునిమ్మని వెంటబడు నొకండు
ఏర్పరించగరాని ఏ సంస్థకంచునో - చందాలకని వచ్చి సణుగు నొకడు
ఒకటి రెండును గావు సర్దుకొననెంచ- ఊపిరిన్ దీయు సమయమే ఉండబోదు
ఏదొ శాపమునొందుట నిట్టి జన్మ - తనకు వచ్చెనటంచును తలచు రైతు.

తను పెంచుకొన్నట్టి పెను సస్యజాలమ్ము - పెరవారి యింటిలో పెట్టుబోత
తనుపాట్లు బడుకొన్న ధరణిపైఁగల హక్కు - ఎదిరిచేతులయందె యెత్తిపేత
తను పిండుకొన్నట్టి ధవళ గోక్షీరమ్ము - ఇతరుల గొంతులో నించురాత
తను జూచుకొన్నట్టి దర్పాదరమ్ములు - మరియొక పాదాల మట్టిపూత
పూట పూటకు పొరుగింట పుట్టుబడులు - కంచుదేవుళ్ళకెప్పు మ్రొక్కించు గీత
ఎన్నొ శ్రమలకు బాలైన హీనమతికి - పాటియయ్యెను స్థిరమైన నోటిమూత.

సత్యపదార్థమ్ము సన్మానమును జేయు - సచ్చరిత్రుడు హరిశ్చంద్రు డతడు
పరుల కుపకృతియంచు భావించి తనుసౌఖ్య - చింత జేయనియట్టి శిబియతండు
ధర్మసంరక్షయే తాత్పర్యమని యెంచి - దర్పమున్ జూపు మాంధాత యతడు
దేశాభివృద్ధికై దీక్షబూనుక భూమి - బంగారు పండించు బ్రహ్మ యతడు
అతని భిక్షయె జీవాల కగును భుక్తి - అతని హస్తమె సృష్టికి నాశ్రయమ్ము
అతనికరుణయె జగతికి అమృతమగును - అతడులేనిదె లోకమే అంతమగును.

గ్రంథ సమీక్ష

'అపనింద' నాటకం

రచయితలు : సుంకర సత్యనారాయణ
వాసిరెడ్డి భాస్కరరావు

వెల : 1—2—0
ప్రజాశక్తి ప్రచురణాలయం — బెజవాడ

ఈనాటకం మధ్యతరగతి ప్రజల కోసం ఉద్దేశింపబడిందని రచయితలు తెల్పారు. మధ్యతరగతి ప్రజల్లోఉన్న ఛాందసభావాలుపోయి విప్లవోత్తేకమైన సంస్కరణ భావాలు ప్రచారం చేయడమే - బహుశా రచయితల లక్ష్యమని నమ్ముతున్నాను. అటువంటపుడు వితంతువివాహం, అంతర్వర్ణవివాహం, ప్రచారమగుతున్న విషయాలే కాని, — సాంఘికంగా క్రొత్తవేమీగావు. అంతర్వర్ణవివాహాలు ఇంకా బాగా ప్రచారానికిరాని విషయం అంటారేమో, సాంస్కృతికంగా వెనుకబడిన కులాల్లోనూ, నై తి క ం గా జీవితపథాన్ని వక్రంగా నడిపిన వారిలోనూ - కొంతవరకు పాశ్చాత్య విద్యాభిలాషుల్లోనూ ఈ అంతర్వర్ణవివాహాలు తప్పనిసరిగా జరుగుతున్నాయి.

పోనీ అలా చూచుకొన్నా వితంతు వివాహానికి ఉద్యుక్తురాలైన పార్వతిని సమర్థించనైనా సమర్థించారుకారు ఆమె పతిత అయిపోయింది.

అపనింద చదివితే ప్రతి కుటుంబంలోనూ, ఆడబిడ్డపోరు ఉంటుందనుకొంటారు. ఎందుచేతనంటే నూటికి తొంభైపాళ్ళు అలా జరుగుతూవుంది కాబట్టి, అలాగే ఆ అపనిందనే చదివేవారే ఏమనుకుంటారంటే సవతితల్లి సుశీల ప్రసాద్ యెడల "సవతి తల్లి" ప్రేమ చూపుతుందేమోనని! అటువంటిభావం కల్గించేదానిలా సుశీలను సృష్టించలేదు. వాస్తవానికి విరుద్ధ స్వభావము కలదానిగా సుశీలను సృష్టించడం విప్లవం అనుకుంటే - పార్వతినికూడా అలా సృష్టించితేనే బాగుండేది. (సుశీలకు పార్వతి ఆడబిడ్డ కాకపోవచ్చు. కాని అదే స్థానంలో, ఆ పద్ధతిలోనే ఉంది.)

లేదా - సమాజంలో ఆనవాయితీగా ప్రసిద్ధిచెందిన "ఆడబిడ్డ పోరు" ను, "సవతితల్లి ప్రేమ"ను సమర్థించాలిసింది.

లేకపోతే - ఆడబిడ్డ "నా తండ్రి సొమ్ము తినడానికి ఇంకో ఆడది ఇంట్లో ప్రవేశించింది. నా స్వతంత్రం సన్నగిలుతూ ఉంది." అనే భావాంకురం వల్లనే ఆడబిడ్డపోరు ఏర్పడిందనీ; —

సవతితల్లి - సుశీలకు బిడ్డలు లేరేఅనుకోండి - "నా అధికారం తగ్గిపోతూ ఉంది!" అనే ఉద్దేశం పుట్టడం వల్లనే "సవతితల్లి ప్రేమ" ఏర్పడిందనీ, - ఇది శాస్త్రీయ దృక్పధమనీ (శాస్త్రీయ దృక్పధమైతేనే) చూపవలసింది.

అపనింద రచయితలు సృష్టించిన ఆడబిడ్డలు, సవతితల్లులూ లోకంలో లేరని నా అభిప్రాయంకాదు. ఎక్కడో క్వచిత్తుగా ఉండే మనస్తత్వాలు ప్రజలు అర్థంచేసుకొనడానికి అంతగా పట్టించుకోరు. ప్రయోజనం కూడా అంతే!

సమాజంలో విపులంగా ఉండే వ్యక్తులనే రంగస్థలాని కెక్కించి వారి స్వచ్ఛందజీవితంపై అనాలోచితంగా-గ్రుడ్డిగా, స్వప్రయోజనార్థమై మోపే అపనిందలను పటాపంచలుచేస్తే ప్రజలు త్వరగా అర్థంచేసుకొని ఆనందిస్తారు.

ముస్లింమిత్రుడు రహీంను కల్పించి ప్రయోజనం లేకుండా చేశారు. జాతీయ ఐక్యత అనేది ఈ రచయితల మనస్సుల్లో ఉండి రహీం పాత్రను కల్పించినా ఆ పాత్రను వృధా చేశారు. అలా కాదు. మిత్రులనేవారు అనేకమంది ఉంటారు; అనేటట్టయితే రహీం పాత్రకు కూడా కొంచెం ప్రాధాన్యత ఇస్తే బాగుండేది

ప్రసాద్‌ను ఆదర్శవంతునిగా నిర్వహించి ఒకచోట అతనినోట "నాకా యోగం లేదు" అనిపించడం పాత్రోచితంగా లేదు. ఈ విధమైన నైరాశ్యభావాలే — కర్మ, యోగం, రాత, దురదృష్టం ఇత్యాదులు మధ్యతరగతుల వారిలో పాతుకొనిపోయి, — సమాజం ఎంత ముందుకు పోయినా—స్వభావాలు మారడంలేదు కనుక ఈ నైరాశ్యభావాలపై శాస్త్రీయమైన దండయాత్రలు చేయాలి. ఆ భావాలపై విప్లవరచనలే సమాజానికి ప్రయోజనమౌతాయి.

చిట్టచివర ప్రసాద్‌ను ఒక రచయితగా మార్చివేసి అతను వ్రాసినపుస్తకం "వర్ణాంతర వివాహం" వల్లనే అందరిలోనూ మార్పు కల్గడం, అది ఆధారంగా అత నొక "లక్"గా పైకిరావడం బాగా లేదు అక్కడే కల్పన కుంటుపడి నడవలేక ఆగిపోయి దేన్నో ఊతగా తీసికొని నడిపినట్లయింది. "వందేమాతరం" సినిమా వచ్చినపుడు దాన్ని చూచి లాటరీ టిక్కట్టువల్లనే ఆకథంతా నడిచిందనీ, సమాజానికి అటువంటి వ్యక్తుల్ని ఆదర్శంగా చూపడం బాగోలేదనీ, అనుకొన్నారు. నిజంకూడా అంతే!

అసలు రచయిత అనేవాడు మధ్యతరగతిలో ఉన్నా, ఆ వృత్తి మాత్రం ప్రజాసామాన్యదృష్టిని ఇంకా విశేషంగా ఆకర్షించడం లేని మూలాన ఒక్క రచనవల్లనే అంత మార్పు జరగడం వింతగాకూడా ఉంటుంది.

పడుచుపిల్ల సుశీలను క్షయవ్యాధితో చంపించి నాటకంవిషాదాంతంగా ముగించడం బాగాలేదు యువతిని, సుహృదిని చంపడం అసలు బాగుండలేదు. ఆమె బదులు ఇంకొకరు చంపబడవలసిన వారున్నారు కనుక, చివరకు సుశీలను ఆదర్శమూర్తినిగా చేసి, కుత్సితురాలు, పార్వతిని చంపించడంతో సరిపెట్టుకొంటే నాటకం రక్తిగట్టేది. పార్వతిని సంస్కారమార్గంలో పెట్టక ఆత్మహత్యకు పూనుకునేటట్లు చేయడంలో సాధించిన దేమీలేదు.

క్షయపీడితులు చివరకు దగ్గుతోనే చనిపోరు దగ్గు మరణ లక్షణంగాదు. దగ్గు క్షయవ్యాధికి ముఖ్యలక్షణమైనా చివరి ఘడియల్లో అదేమీ ఉండదు. క్షయరోగులు - సామాన్యంగా - అకస్మాత్తుగా చనిపోతారు. దగ్గు అసలు కనపడదు

డాక్టర్, రంగబాబు

'అభ్యుదయ' ప్రచురణలు

*౧.	ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘ ప్రథమ మహాసభా సంచిక	0- 8-0
*౨.	అభ్యుదయ రచనల సంపుటి	(ప్రతులు లేవు)
*౩.	వీరేశలింగ వర్ధంతి సంచిక	0-10-0
*౪-౧౨	'తెలుగుతల్లి' సంచికలు (తొమ్మిది సంచికలు)	5-14-0
*౧౩.	మహాకవి గురజాడ అప్పారావుగారి జీవితచరిత్ర	ప్రతులు లేవు
*౧౪.	గిడుగు రామమూర్తి పంతులుగారి జీవితం	ప్రతులు లేవు
*౧౫.	చిలకమర్తి లక్ష్మీ నరసింహంగారి స్వీయచరిత్ర	3- 0-0
*౧౬.	వీరేశలింగంగారి ప్రహసనాలు	0- 6-0
౧౭.	చదలవాడ గీతాలు	0- 3-0
౧౮.	తెలుగు పూలు (బాలబాలికలకు)	0- 3-0
౧౯.	'ఏమిమగవాళ్ళు!' (నాటికలు)	0-12-0

* ఈ గుర్తుగలవి 'ప్రజాశక్తి ప్రచురణాలయం, బెజవాడ' వారివద్ద దొరుకుతాయి తక్కినవాటికి 'అభ్యుదయ' కార్యాలయానికి వ్రాయండి

సం చందా రు. 6

అభ్యుదయ

విడి ప్రతి అ. 8

సచిత్ర సాహిత్య మాసపత్రిక

ఆంధ్ర అభ్యుదయ రచయితలసంఘం ఏ మహత్తరాశయాలతో కృషిచేస్తున్నదో ఆ ఆశయసిద్ధికోసం అభ్యుదయ నిరంతరం పాటుపడుతుంది. ఆంధ్ర సాహిత్యాభ్యుదయానికీ, ఆంధ్ర కళాభ్యుదయానికీ కృషిచేస్తుంది.

'అభ్యుదయ' రచయితల పత్రిక. ఆంధ్రదేశం విజ్ఞాన వంతులందరి అదరాభిమానాలను చూరగొన్న సాహిత్య పత్రిక.

—: ప్రకటన రేట్లు :—

కవరు 4 వ పేజీ	రు 40	లోపలిపేజీ 1 కి	రు. 20
కవరు 2, 3 పేజీలుఒక్కొక్కటి	రు. 30	½ పేజీ	రు. 12

6 నెలలకు కంట్రాక్టురేటు 20% తక్కువ

రెండుమూడు రంగులలో ప్రకటనలు చేయించదలచినవారు మేనేజరుకు వ్రాయండి

అన్నివివరాలకు :— మేనేజరు, 'అభ్యుదయ'
గవర్నరుపేట — బెజవాడ.

Editor, Printer & Publisher C Pitchayya
Secretary, Andhra Progressive Writers' Association, Governorpet, Bezwada
Printed at Prajasakti Press. Q. H No. K. 3. A

బెజవాడలో

శ్రీ సరస్వతిలో

ముచ్చటైన 3వ వారం

శ్రావ్యమైన సంగీతం !

మధురమైన సన్నివేశాలు !

హృదయాన్ని కదిలించే

సినేరియో !

స్వర్ణలత, వాస్టి,

కరన్ దివాన్

నటించిన

"రతన్"

ప్రదర్శింపబడుతోంది

రాబోవు ఫిలిం

ఈశ్వరలాల్

బేగం పారా

నటించిన

సోసీ మహీవాల్

లీలా మహల్ లో

14–11–46 నుండి

విస్మయాన్ని గొల్పే

ట్రిక్కులతో

పంచరంగుల ఫిలిం

అల్లావుద్దీన్ -మాయాదీపం

గొప్ప ఇంగ్లీషు చిత్రం.

ఉదయపు ఆటలు

మెట్రో వారి

'రష్యాపాట'

ప్రదర్శింపబడుతోంది

తదుపరి ఫిలిం

"క్లియోపాత్ర"

అనే ఇంగ్లీషు చిత్రం